మే-2026

# దర్శనమ్®

ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక



₹ 51/- సంపుటి 22 సంచిక 8 ISSN 2582-2411






శంకరజయంతిరోజున శృంగేరీలో పవిత్ర తుంగభద్రానది ప్రవహించే ఘాట్‌ను
శ్రీశంకరాచార్యఘాట్‌గా జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాసన్నిధానంవారు
నామకరణం చేయగా జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీసన్నిధానంవారు ప్రారంభించారు.
శ్రీ వరాహస్వామి,తుంగభద్రాదేవి, శ్రీ ఆదిశంకరాచార్య విగ్రహాలను ఆవిష్కరించారు



శంకరజయంతి సందర్భాన శృంగేరీలో జరిగిన
రథోత్సవంలో పాల్గొన్న శ్రీసన్నిధానంవారు




దర్శనమ్ కార్యాలయం శ్రీభారతీతీర్థ గ్రంథాలయంలో శంకరజయంతి మహోత్సవం










దర్శనమ్ కార్యాలయం శ్రీభారతీతీర్థ గ్రంథాలయంలో నెలనెలా అష్టావధానం కార్యక్రమ పరంపరలో చి.వింజమూరి సంకీర్తశర్మఅష్టావధానం

# శ్రీ ఆంజనేయమంగలాష్టకం

కపిశ్రేష్ఠాయ శూరాయ సుగ్రీవప్రియమంత్రిణే
జానకీశోకనాశాయ ఆంజనేయాయ మంగలం 1

మనోవేగాయ ఉగ్రాయ కాలనేమివిదారిణే
లక్ష్మణప్రాణదాత్రే చ ఆంజనేయాయ మంగలం 2

మహాబలాయ శాంతాయ దుర్దండీబంధమోచన
మైరావణవినాశాయ ఆంజనేయాయ మంగలం 3

పర్వతాయుధహస్తాయ రాక్షఃకులవినాశినే
శ్రీరామపాదభక్తాయ ఆంజనేయాయ మంగలం 4

విరక్తాయ సుశీలాయ రుద్రమూర్తిస్వరూపిణే
ఋషిభిస్సేవితాయాస్తు ఆంజనేయాయ మంగలం 5

దీర్ఘబాలాయ కాలాయ లంకాపురవిదారిణే
లంకిణీదర్పనాశాయ ఆంజనేయాయ మంగలం 6

నమస్తే2స్తు బ్రహ్మచారిన్ నమస్తే వాయునందన
నమస్తే బ్రహ్మచర్యాయ నమస్తే గానలోలాయ
ఆంజనేయాయ మంగలం 7

ప్రభవాయ సురేశాయ శుభదాయ శుభాత్మనే
వాయుపుత్రాయ ధీరాయ ఆంజనేయాయ మంగలం 8

ఆంజనేయాష్టకమిదం యః పఠేత్సతతం నరః
సిద్ధ్యంతి సర్వకార్యాణి సర్వశత్రువినాశనం 9



**ఇతి శ్రీఆంజనేయమంగలాష్టకం సంపూర్ణం**

# దర్శనమ్

ఆధ్యాత్మిక వార్తా మాస పత్రిక

మే 2026

సంపుటి-22 విడిప్రతి: రూ. 51/- సంచిక - 8

ISSN 2582-2411 పేజీలు 68

ఎస్ఆర్ఎస్ పబ్లికేషన్స్ ప్రచురణ

స్ఫూర్తిప్రదాత

**కీ.శే. మరుమాముల రాజమౌళిశర్మ**

గౌరవ సంపాదకులు

**యాయవరం చంద్రశేఖరశర్మ, ఆర్.వి.వి. కృష్ణారావు**

**మరుమాముల దత్తాత్రేయశర్మ**

ప్రధాన సంపాదకులు

**మరుమాముల వెంకటరమణశర్మ**

ప్రచురణకర్త, సంపాదకులు

**మరుమాముల రుక్మిణి**

సంపాదక మండలి

**డా. పూర్ణప్రజ్ఞా భారతి, అష్టకాల రామ్మోహన్**

**ఆకెళ్ల విభీషణ శర్మ, బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి**

**మరుమాముల రామచంద్రమూర్తి**

**ఆదరాసుపల్లి శశిధర్, ప్రసాదవర్మ కామఋషి**

ప్రత్యేక ప్రతినిధి

**పి.వి.ఎం. పవన్,** 81253 36958

ఉప సంపాదకులు

**రామలక్ష్మీ సుబ్రహ్మణ్యం**

## దర్శనమ్

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

**- : ప్రధాన కార్యాలయం : -**

ఇం.నెం. 29-105/4/1, శ్రీరామ సిద్ధాంతి భవనం
న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్-56
ఫోన్, ఫ్యాక్స్: 9441015469

e-mail: darshanameditordesk@gmail.com

మార్కెటింగ్: రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ, 9666680857

దర్శనం దర్శనారామ దర్శనం సమదర్శనం
దర్శనం లోక వృత్తాంతాదర్శ దర్శిన్యపేక్షితమ్ ॥
దర్శనాంతర్ముఖ స్ఫర్శి సద్విమర్శావమర్శనం
దర్శన ప్రతిభూస్థానం జీయాత్ సర్వ నిదర్శనమ్ ॥

**- అష్టకాల నరసింహరామశర్మ**

'దర్శనం దర్శితం యేన దర్శితం సర్వదర్శనమ్
దర్శనం శర్మసంధాత్ర దర్శనం దైవదర్శనమ్'

**- అయాచితం నటేశ్వరశర్మ**

## ఈ సంచికలో ...

అతుల భక్తికి.. అమిత శక్తికి ఆదర్శమూర్తి ... 7
- అన్నదానం చిదంబరశాస్త్రి

శనైశ్చర అనుగ్రహం.. ప్రారబ్ధ ప్రాయశ్చిత్తం ... 11
- చిల్లర సీతారామారావు

భారతీతీర్థగ్రంథాలయంలో శంకరజయంతి ... 14

అలరించిన సంకీర్త్యశర్మ అష్టావధానం ... 17
- డా. బొర్రెల్లి హర్ష

కన్నుల పండువగా కలంవీరుడి అమృతోత్సవం ... 19
- కె.వి.ఎస్. సుబ్రహ్మణ్యం

అభినవ శంకర విజయం ... 22
- మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

ఆధ్యాత్మిక స్పర్శ లేని జీవితం.. అసంపూర్ణమే ... 24
- పూర్ణిమ పసుమర్తి

మహాతపస్వి చంద్రశేఖర భారతి ... 26
- చెఱుకుపల్లి జమదగ్ని శర్మ

సనాతన ధర్మం... సాధికారిక గ్రంథం ... 29
- తాడేపల్లి పతంజలి

మాధవీయ శంకర విజయం ... 32
- తాడేపల్లి పతంజలి

శ్రీమద్దేవీ భాగవతం - డా. వద్దిపర్తి పద్మాకర్ ... 34

మహాభారత సారసంగ్రహం ... 36
- కీ.శే. డా. పుల్లెల శ్రీరామచంద్రుడు

తిరుమల చరితామృతం - కీ.శే. పివిఆర్‌కె ప్రసాద్ ... 39

రామాయణం రసరమ్యం ... 42
- వనం జ్వాలా నరసింహారావు

క్షయనామ సంవత్సరం... బార్హస్పత్యమానం ... 44
- డా. శంకరమంచి రామకృష్ణ శాస్త్రి

వేదాల్లో విజ్ఞానాంశాలు ... 48
- పోలిశెట్టి బ్రదర్స్

శృంగేరి శారదాపీఠ వైభవం ... 56

ఇందులోని వ్యాసాలు, అందులోని భావాలు రచయితలవే. దానికి, దర్శనమ్ పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. - సంపాదకుడు

# ఆర్షధర్మ విధ్వంసమే అసలు లక్ష్యం!

భారతీయ ఆర్ష సంస్కృతి విధ్వంసానికి నేడు ఒక నిశ్శబ్ద వికృత యుద్ధం సాగుతోంది. ఈ యుద్ధంలో ప్రధాన లక్ష్యం- బ్రాహ్మణ్యం. ఇది కేవలం సామాజిక విమర్శ కాదు, భారతావని ఆత్మగౌరవాన్ని, మేధో సంపత్తిని వేళ్ళతో సహా పెకలించి వేయాలని చూస్తున్న ఒక వ్యవస్థీకృత 'సాంస్కృతిక కుట్ర'. విద్వేషమే పెట్టుబడిగా, అబద్ధమే ఆయుధంగా మలచుకున్న శక్తులు బ్రాహ్మణులను సమాజానికి విరోధులుగా చిత్రీకరిస్తూ చేస్తున్న దాడిని లోతుగా పరిశీలిస్తే భయంకర నిజాలు బట్టబయలవుతున్నాయి. ఎందుకు ఈ దాడి? కుట్ర వెనుక అసలు కోణాలు ఏమిటి అని ఆలోచిస్తే... ధర్మ రక్షణ కవచాన్ని ఛేదించడం ప్రధానంగా కనపడుతుంది.

భారతీయ సంస్కృతిని, వేద విజ్ఞానాన్ని వేల ఏళ్లుగా  కాపాడుకుంటూ వస్తున్నది బ్రాహ్మణ వర్గం. ఒక కోటను కూల్చాలంటే ముందుగా దాని రక్షణ కవచాన్ని దెబ్బతీయాలి. హిందూ ధర్మాన్ని నాశనం చేయాలనుకునే శక్తులకు ఆ ధర్మాన్ని మోస్తున్న బ్రాహ్మణుడు మొదటి అడ్డంకిగా కనిపిస్తున్నాడు. అందుకే, 'బ్రాహ్మణ్యాన్ని నిర్మూలిస్తేనే ధర్మాన్ని కూల్చవచ్చు' అనే విదేశీ, విద్రోహ భావజాలం నేడు మేధో ముసుగులో ప్రవహిస్తోంది. మరో అంశం- త్యాగాన్ని తస్కరించి.. విద్వేషాన్ని అంటగట్టడం. 'అయాచక వ్రతం'తో, నిరుపేదరికంలో ఉంటూ కూడా సమాజ శ్రేయస్సు కోరిన చరిత్ర బ్రాహ్మణులది. కానీ, నేడు ఆ త్యాగనిరతిని 'ఆధిపత్యం'గా ముద్ర వేస్తున్నారు. చరిత్రలో ఎన్నడూ రాజ్యాధికారం కోసం పాకులాడకుండా, కేవలం ధర్మబోధన, ధర్మాచరణలకే పరిమితమైన వర్గాన్ని 'అణచివేతదారులు'గా చిత్రించడం ఒక పెద్ద 'మేధోపరమైన వంచన'.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు బ్యాంకు లేని వర్గంపై దాడి చేయడం చాలా సులభం. బ్రాహ్మణులు అల్ప సంఖ్యాకులు, పైగా అహింసావాదులు. ఈ బలహీనతను ఆసరాగా చేసుకుని, పాతకాలపు సామాజిక రుగ్మతలన్నింటికీ బ్రాహ్మణులే కారణమని ముద్ర వేయడం ద్వారా ఇతర వర్గాలను రెచ్చగొట్టే నీచమైన రాజకీయ క్రీడ సాగుతోంది. నేడు బ్రాహ్మణులను లక్ష్యంగా చేసుకుని వాడుతున్న పదజాలం- 'మనువాదులు', 'శోషకులు', 'ఛాందసవాదులు'  ఇవన్నీ ఒక వ్యూహం ప్రకారం సమాజంలోకి చొప్పించబడ్డాయి. ఒక వ్యక్తి జంధ్యం వేసుకోవడం నేరంగా, సంధ్యావందనం చేయడం తప్పుగా, తిలకం ధరించడం, సంప్రదాయ వస్త్రధారణ తదితర ఆచారాలను పాటించడం అపరాధంగా చూపించే ప్రయత్నం 'సాంస్కృతిక వివక్ష' తప్ప మరొకటి కాదు.

బ్రాహ్మణులపై విద్వేషానికి పునాదులు వేసింది నాటి బ్రిటిష్ వలసవాదులు. భారతదేశాన్ని పాలించాలంటే ఇక్కడి ధర్మాన్ని రక్షించే మేధోవర్గాన్ని ప్రజల నుంచి వేరు చేయాలని వారు భావించారు. మెకాలే విద్యా విధానం ద్వారా 'బ్రాహ్మణుడు అంటే శోషకుడు' అనే విషబీజాన్ని నాటితే, స్వాతంత్ర్యానంతర 'సెక్యులర్' మేధావులు దానికి నీరు పోసి పెంచారు. వేల ఏళ్ల జ్ఞాన వారసత్వాన్ని 'ఛాందసత్వం'గా, లోకహితం కోరే యజ్ఞయాగాదులను 'మూఢనమ్మకాలు'గా చిత్రీకరించడం వెనుక పెద్ద చారిత్రక కుట్ర దాగి ఉంది.

చరిత్రను పరిశీలిస్తే, బ్రాహ్మణులు ఎప్పుడూ సంపద కోసం ప్రాకులాడలేదు. అలెగ్జాండర్ నుంచి మొఘులుల వరకు ఎంతోమంది దండయాత్రలు చేసినా, ప్రాణాలను పణంగా పెట్టి గ్రంథాలయాలను, వేదాలను కాపాడింది బ్రాహ్మణులే. చాణక్యుడు సామ్రాజ్యాలను నిర్మించాడు కానీ, తాను మాత్రం ఒక చిన్న కుటీరంలోనే నివసించాడు. అటువంటి నిస్వార్థ వారసత్వాన్ని 'పీడక వర్గం'గా ప్రచారం చేయడం ఈ శతాబ్దపు అతిపెద్ద అబద్ధం. అర్హత ఉండి కూడా అవకాశాలు కోల్పోతున్న బ్రాహ్మణ యువతను చూసి జాలి పడాల్సింది పోయి, వారి దైన్యస్థితిని కూడా హేళన చేసే స్థాయికి రాజకీయ వికృతత్వం చేరుకుంది. ఆర్థికంగా చితికిపోయిన బ్రాహ్మణుడిని కూడా 'అగ్రవర్ణ అహంకారి'గా ముద్ర వేయడం రాజకీయ కుతంత్రం కాక మరేమిటి?

బ్రాహ్మణత్వం అంటే ఒక కులం కాదు, అది ఒక సంస్కార జీవన విధానం. ఈ విధానాన్ని నాశనం చేయడం అంటే ఈ దేశపు మేధోపరమైన పునాదులను ధ్వంసం చేసుకోవడమే. బ్రాహ్మణులను నిందించడం ద్వారా సామాజిక న్యాయం రాదు, కేవలం సామాజిక విద్వేషం మాత్రమే మిగులుతుంది. ఎవరైతే లోకకళ్యాణం కోసం "సర్వేజనా సుఖినోభవంతు" అని ఆశీర్వదిస్తారో, వారిపైనే విషం చిమ్మడం అంటే మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కోవడమే. బ్రాహ్మణులు నేడు ఆత్మరక్షణలో పడాల్సిన పనిలేదు. సత్యం, ధర్మం, శాంతిని ఆయుధాలుగా చేసుకున్న వాడిని ఏ కుట్రలు ఏమీ చేయలేవు. అయితే, సమాజం మేల్కోవాలి. ప్రజాస్వామ్యం పేరిట ఒక వర్గాన్ని మానసిక క్షోభకు గురిచేస్తున్న ఈ 'లిబరల్ ఉగ్రవాదాన్ని' తుత్తునియలు చేయాలి. సంస్కృతిని కాపాడుకునే బాధ్యత కేవలం బ్రాహ్మణులది మాత్రమే కాదు, భారతీయులందరిదీ. ■




# పాఠక దర్శిని

మీ అభిప్రాయాలను darshanameditordesk@gmail.comకు పంపగలరు.

## ఆదిశంకరుల సమగ్ర వ్యాసం

దర్శనమ్ ఏప్రిల్ నెల సంచిక ఆదిశంకరుల ముఖచిత్రంతో ఎంతో బాగుంది. 'అద్వైత ద్యుమణి.. ఆర్షధర్మ దండపాణి' శీర్షిక తాడేపల్లి పతంజలి గారు ఆదిశంకర భగవత్పాదుల గురించి చాలా అద్భుతంగా వివరించారు. ఆయన అవతార విశిష్టత మొదలుకొని శంకరాచార్యులకు సంబంధించిన సమస్త విషయాలను పాఠకులకు గుదిగుచ్చినట్లు తెలియజేశారు. రచయితకు, ప్రచురించిన పత్రిక యాజమాన్యానికి ధన్యవాదాలు. అలాగే దేశంలోని ఆదిశంకరుల విగ్రహాల ఎక్కడెక్కడ ఉన్నాయో తెలిపే వ్యాసం 'భారతావనిని ఉద్ధరించిన భగవత్పాదులు' మమ్మల్ని ఆకట్టుకుంది. ఈ వ్యాసం ద్వారా చాలా విషయాలు తెలుసుకోగలిగాం.

**- ఉప్పలపాటి అనంత గోపాలకృష్ణమూర్తి, బాపట్ల**

## సూచన బాగుంది

ప్రపంచానికి దిశానిర్దేశం చేసిన వారిలో అగ్రగణ్యులు ఆదిశంకరులు. ఆయన జన్మదినాన్ని జాతీయ తత్త్వవేత్తల దినంగా జరుపుకుంటే బాగుంటుందని సూచించే సంపాదకీయం అద్భుతంగా ఉంది. మహాభారత సారసంగ్రహం, రామాయణం, శ్రీమద్దేవీ భాగవతం, తిరుమల చరితామృతం, 'గిని-అద్వైత గని' వంటి ధారావాహికలు ఆసక్తిదాయకంగా ఉంటున్నాయి. చంద్రశేఖర భారతీ స్వామివారి దివ్యచరితామృతం ఆకట్టుకుంటోంది. 'ఆర్షధర్మంపై అన్యుల విషం' ద్వారా చక్కటి విషయాలు తెలుస్తున్నాయి. అపోహలు దూరమవుతున్నాయి.

**- గాయత్రీ విశ్వనాథ్, హైదరాబాద్**

## ఎందుకీ గందరగోళం?

భద్రాద్రిలోని సీతారాముల కళ్యాణాన్ని లక్ష్మీనారాయణుల కళ్యాణంగా జరిపించడం, సీతారామ చంద్రుల ప్రవర బదులు లక్ష్మీనారాయణుల ప్రవర చదవడంపై భక్తుల మొరను తెలియజేస్తూ ప్రచురించిన వ్యాసం 'రామా! కనవేమిరా' బాగుంది. భద్రాద్రిలో ఉన్నది సీతారాములైనప్పుడు చదవాల్సింది వారి ప్రవర... జరగాల్సింది సీతారాముల కల్యాణం. రామదాసు అర్చించింది సీతారాములను కాని లక్ష్మీనారాయణులను కాదు. అనవసరమైన గందరగోళాన్ని సృష్టించి భక్తులను కలవరానికి గురిచేయడం తగదు. ఇకనైనా ఇలాంటి ప్రయత్నాలను మానుకోవాలి.

**- శంకరమంచి లక్ష్మీనారాయణ, విజయవాడ**

### 'దర్శనమ్' చందా వివరాలు

| | |
|---|---|
| 3 సంవత్సరాలకు | రూ. 2000 |
| 6 సంవత్సరాలకు | రూ. 4000 |
| 12 సంవత్సరాలకు | రూ. 8000 |
| రాజపోషకులు | రూ. 15000 |
| మహారాజ పోషకులు | రూ. 25000 |
| విశిష్ట మహారాజ పోషకులు | రూ. 100000 |


**A/C NAME : DARSHANAM**
**BANK: CANARA BANK**
**A/C NO. 120001974779**
**IFSC CODE: CNRB0013063**

BHIM UPI
Scan using any BHIM UPI enabled APP
DARSHANAM
Canara Bank


## చందాదారులకు విజ్ఞప్తి

'దర్శనమ్' ధార్మికోద్యమ మాసపత్రిక సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా వెలువడతున్న ఈ పత్రికకు చందాలు, విరాళాలు అందించవలసిందిగా ప్రార్థన. ఈ నెలతో ముగియనున్న తమ చందాలను వెంటనే పునరుద్ధరించుకోవలసిందిగా మనవి. **ఎడిటర్, దర్శనమ్** పేరుతో చెక్కు/డిడి/మనియార్డరు/ఆన్‌లైన్‌లో చందాలను పంపాల్సిందిగా విజ్ఞప్తి. మీరు ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు చిరునామాలను స్పష్టంగా పిన్‌కోడ్‌తో సహా రాయవలసిందిగా కోరుతున్నాం. చిరునామా మారితే తక్షణం తెలియజేయండి. **- ఎడిటర్**






**"భక్తికి నిలువెత్తు రూపం.. శరణాగతికి ప్రాణపదం.. దాస్యభక్తికి ఏకైక చిరునామా ఆ కపిశ్రేష్ఠుడు. అంజనాదేవి గర్భాన ఉదయించిన ఆనందభాస్కరుడు, వాయుదేవుని ఔరసపుత్రుడు, రామనామ జపంతో పులకించిపోయే నిష్కల్మష హృదయుడు.. ఆంజనేయస్వామి. సముద్రాన్ని లంఘించినా, సంజీవని గిరిని పెకలించినా అదంతా తన 'రామచంద్రుడి' ప్రసాదమేనని వినమ్రంగా తలవంచిన అహంకారం ఎరుగని మహాజ్ఞాని. శారీరక, మానసిక బలానికి ప్రతీకగా, నవవ్యాకరణ పండితుడిగా, బుద్ధిమంతుల్లో అగ్రగణ్యుడిగా త్రేతాయుగం నుంచి నేటి వరకూ సకల చరాచర జగత్తుచే నీరాజనాలు అందుకుంటున్న ఆ మహావీరుని జన్మదినమే.. హనుమజ్జయంతి. అనంతమైన, అద్భుతమైన ఆ హనుమద్వైభవాన్ని అక్షరాల్లో బంధించడం సాధ్యం కాకపోయినా.. ఆ చిరంజీవి దివ్యస్మరణతో తరించేందుకు అక్షరరూపంలో చేస్తున్న చిన్న ప్రయత్నమే ఈ కథనం!"**



**డా. అన్నదానం చిదంబర శాస్త్రి**

ఎవ్వరికయినా పూజార్హత గుణగణాలను బట్టి వస్తుంది. లోకంలో దేవతలందరి కంటె ఎక్కువగా పూజింపబడుతున్నవాడు హనుమంతుడంటే ఆయన అంతగా సద్గుణ గరిష్ఠుడన్నమాట. రామభక్తుడుగా చెప్తున్నాము కాని ఆ రాముని కంటె హనుమంతునకే ఆలయాలు, పూజలు, విగ్రహాలు ఎక్కువ. రామాలయం ఉంటే హనుమంతుడుండి తీరతాడు. కాని ఆంజనేయాలయంలో రాముడుండాలని లేదు. ప్రతి దేవాలయంలో హనుమంతుడుంటాడు. రాజయిన సుగ్రీవునకెక్కడా ఆలయం లేదు. మంత్రి అయిన ఆంజనేయునకు ఊరూరా ఆలయాలే. అంటే రాముని భక్తునిగానే కాక, సుగ్రీవుని మంత్రిగానే కాక అంతకు అతీతమయిన స్థానం హనుమంతునకు ఉన్నదన్నమాట.

ఒక్క మాటలో చెప్పాలంటే హనుమంతుడు శక్తికి, ఉక్తికి, భక్తికి, రక్తికి, యుక్తికి, ముక్తికి అన్నిటికీ ప్రతీక. మహనీయుల విశిష్టత వారి పుట్టుకతోనే వ్యక్తమవుతుంది. హనుమంతుని పుట్టుక వెనుక అనేక కారణాలున్నాయి. కల్పాంతర యుగాంతర కారణాలున్నాయి. రాథంతర కల్పంలేనే కశ్యపుడు, సాధ్య అను దంపతులు కఠోర తపస్సు చేసి శివుని పుత్రునిగా కోరుకొన్నారు. ఆ కశ్యపుడే కేసరిగా, సాధ్యయే అంజనగా పుట్టారు. శివుడే హనుమంతునిగా పుట్టాడు.


గార్ధభ నిస్స్వనుడనే భయంకర రాక్షసుని సంహరించటంలో శివకేశవులు పందెం వేసికొన్నారు. శ్రీహరి వానిని సంహరింపలేకపోతే

ఆ రాక్షసునకు వరాలిచ్చిన శివునకు దాస్యం చేస్తానన్నాడు. వానిని హరి చంపగల్గితే శివుడు నారాయణునకు దాస్యం చేస్తానన్నాడు. అలా హరి ఆ రాక్షసుని సంహరించడంతో శివుడు దాస్యం చేయవలసి వచ్చింది. అది త్రేతాయుగంలో తీర్చుకొమ్మనటంతో శ్రీహరి రామునిగా అవతరించగా, శివుడు హనుమంతునిగా పుట్టి రామదాసుడిగా దాస్యప్రతిజ్ఞ పూర్తి చేసికొన్నాడు.

రావణాది రాక్షస బాధ భరింపజాలక దేవతలంతా బ్రహ్మ, రుద్రుల వద్దకు వెళ్లి పరిష్కారం లభింపక అందరూ బదరికావనంలో నారాయణుని వద్దకు వెళ్లారు. అంతట హరి రాక్షసబాధ అంతం కాగలదని చెప్తూ, సకల దేవతల తేజస్సును ఆకర్షించి తన తేజం మిళితం చేసిన శివుని స్వీకరింపుమన్నాడు. అట్టి తేజఃపుంజం పరమశివుని నుంచి పార్వతికి, పార్వతి నుంచి అగ్నికి, అగ్ని నుంచి వాయువునకు, వాయుదేవుని నుంచి అంజనకు చేరి ఆ తేజస్సే హనుమంతునిగా అవతరించింది. అందుకే శంకర సువనుడని, పార్వతీగర్భ సంజాతుడని, అగ్నిసంభవుడని, వాయునందనుడని, కేసరి సుతుడని, అంజని తనయుడని కీర్తి పొందాడు. "ఆంజనేయుని పూజిస్తే సకల దేవతలను పూజించినట్లే" అని బ్రహ్మదేవుడు అన్నాడు. అందుకు కారణమిదే. రష్యాలో కనిపెట్టబడిన కిర్లియన్ ఫొటోగ్రఫీ ఇట్టి తేజో విధానాన్ని యథార్థమని నిరూపిస్తోంది. అలా సర్వశక్తి యుక్తులతో వైశాఖ మాసం కృష్ణపక్షంలో దశమి నాడు, పూర్వాభాద్రా నక్షత్రంలో, వైధృతి యోగంలో శనివారం నాడు కర్కాటక లగ్నంలో హనుమంతుడు పుట్టాడు.

సర్వశక్తి సముపేతునిగా పుట్టిన మారుతి జన్మించిన ఐదవరోజే ఉదయభానుని పండుగా భ్రమించి పట్టుకొనబోయి ఇంద్రుని వజ్రాయుధంచే కొట్టబడి మూర్ఛిల్లాడు. అందుకు కోపగించిన వాయువు లోకంలో వీచిక స్తంభించాడు. బ్రహ్మేంద్రాదులంతా వచ్చి వాయువును బ్రతిమలాడారు.





వాయువు తృప్తి కోసం బ్రహ్మ కమండలోదకంతో స్పృహతేర్చి, చిరంజీవిగా ఆశీర్వదించి, దేవతలందరినీ వరాలు ఇమ్మన్నాడు. ఇంద్రుడు తన వజ్రాయుధం అతడిని ఏమీ చేయదని, వరుణుడు తన వరుణపాశమేమీ చేయదని, యముడు తన దండమేమీ చేయదని, కుబేరుడు తన గదాయుధమేమీ చేయదని, విశ్వకర్మ తానిప్పటికి చేసిన ఆయుధాలు, ముందు చేయబోయే ఆయుధాలు ఈ బాలునేమీ చేయవని, సూర్యుడు హనుమంతునకు సకల విద్యలు నేర్పుతానని... ఇలా సకల దేవతలు వరాలిచ్చారు. దాంతో అసాధారణ శక్తియుక్తుడయ్యాడు. అసలే కోతి, అందులో ఇంతబలం, బాల్యచాపల్యం అన్నీ ఏకమై అల్లరి భరింపరాని దవటంతో భృగు శిష్యులు ఆతని శక్తి ఆతనికి తెలియకుండా శాపమిచ్చారు. స్తుతించటం ద్వారా లేదా విరోధించటం ద్వారా ఆతని శక్తిని గ్రహింపజేయగల్గుతారు. అందుకే సముద్రలంఘన సమయంలో అందరూ స్తుతించి తన శక్తి తెలిసి కార్యం సానుకూలం చేసే స్థితికి తెచ్చారు.

హనుమంతుడు 'అతులిత బలధాముడు' అంటే అతనితో సాటివచ్చే బలవంతులు లేరు. 'భీముడు బలవంతుడు' అంటాం కాని, సౌగంధికా హరణంలో, పురుష మృగాహరణ వృత్తాంతంలో ఆ భీముడు హనుమంతుని తోక కాదుకదా వెంట్రుకను కూడా కదల్చలేకపోయాడు. రావణుడంతటి వాడు కూడా రామరావణ యుద్ధకాలంలో మారుతి కొట్టిన దెబ్బకు గింగిరాలు తిరిగి పడిపోగా సారథి రథాన్ని తోలుకుపోయి రక్షించాడు. ఆ రావణుని చంకలో ఇరికించుకొని సప్తసముద్రాలు తిరిగి వచ్చినవాడు వాలి. ఆ వాలి హనుమంతుని కంటె బలవంతుడేమో, అందుకే తన రాజు సుగ్రీవుడు బాధపడుతున్నా వాలిని చంపలేదేమో అని రాముడే

# మూర్తీభవించిన భక్తికి నిదర్శనం... హనుమంతుడు

రావణ సంహారం అనంతరం అయోధ్యకు వేంచేయబోతున్న శుభవార్తను సీతారామలక్ష్మణుల పరివారం ముందుగానే అక్కడికి చేరుకున్న హనుమంతుడు భరతుడికి తెలియజేసి సంతసింపజేస్తాడు. అయోధ్యలో శ్రీరామచంద్రుని పట్టాభిషేక మహోత్సవం కన్నుల పండుగగా జరిగిన సందర్భం. ఈ మహోత్సవంలో పాల్గొన్న సుగ్రీవ విభీషణాదులకు తమ స్వహస్తములతో శ్రీరామచంద్ర ప్రభువు మణిరత్న వస్త్ర భూషణాలను ప్రదానం చేస్తారు. ఆ లోకాభిరాముడి హృదయాంతర్యమేమో గానీ హనుమంతునికి ఏమీ ఇవ్వలేదు. రామచంద్రునికి ఎంతో ఆప్తుడైన హనుమను ఎలా విస్మరించినట్లు? అని అందరూ ఆశ్చర్యచకితులై చర్చించుకుంటున్న సందర్భం. అందరి ముఖాలనూ గమనిస్తూ ఆ లోకాభిరాముడు తనకేమీ తెలియనట్లు మౌనం దాల్చారు. సీతామాత ఆ రామచంద్ర భగవానుడి లీలలను అర్థం చేసుకుని తన కంఠాభరణమైన మణిహారాన్ని తీసి హనుమంతుడికి బహుమతిగా ఇవ్వడం సభాసదులందరినీ సంభ్రమాశ్చర్యాలకు లోను చేసింది. జానకీ మాత ఇచ్చిన ఆ హారాన్ని ఆంజనేయస్వామి భక్తిప్రపత్తులతో స్వీకరించి, దాని ధరించకుండా ఆ హారంలోని ఒక్కొక్క మణినీ తన పంటితో కొరికి, వాటిని జాగ్రత్త పరిశీలిస్తూ విసిరి పారేయసాగాడు. మొత్తం మణులన్నింటినీ అలా కొరికి పారేస్తుండడం చూసి, అందరూ భిన్నాభిప్రాయాలతో ఉండగా, శ్రీరామచంద్రుడు మందస్మితముతో, సీతమ్మ గాంభీర్యంతో ఆ దృశ్యాన్ని చూస్తున్నారు. భరత లక్ష్మణ శత్రుఘ్నులు ఎంతో కుతూహలంగా గమనిస్తున్నారు. కానీ సభలో ఉన్న మిగతావారు ఉండబట్టలేక "ఆంజనేయా! నువ్వు చేస్తున్న పనేమిటి? ఎంతో విలువైన అమ్మవారు బహుమానంగా ఇచ్చిన హారంలోని మణులను కొరికి నేలపాలు చేస్తున్నావు" అంటూ కోపగిస్తుండగా, సభలో ఒకరు బిగ్గరగా 'ఆ! వానర లక్షణాలు ఎక్కడికి పోతాయి, మణుల విలువ ఏం తెలుసు ఈ వానరులకు'' అని వ్యంగ్యంగా అనడం, మిగతావారు హేళన చేయడాన్ని చూస్తూ హనుమంతుడు "మీరెందుకు కోపగించుకుంటున్నారో నాకు అర్థమవడం లేదు. విలువైన హారాన్ని ధరించడం వల్ల నాకు శోభ కలుగుతుందేమో గానీ, ఆ మణుల్లో నాకు రామదర్శనం కలిగితేనే నాకు పూర్ణమైన బహుమతి! అందుకే ఈ మణులను కొరికి పరీక్షిస్తున్నాను. వాటిలో నా స్వామి దర్శనం కాలేదు. వీటి ప్రకాశం నాకు అంధకారబంధురంగా కనిపిస్తోంది. కనుక ఈ హారంతో నాకు ప్రయోజనమేమిటి? అందుకే వాటిని బద్దలు చేసి పారవేస్తున్నా అని ఆర్ద్రతతో సెలవిచ్చారు." సభలోని వారిలో చాలామంది హనుమంతుడి ఆలోచనను అర్థం చేసుకోగా, కొందరు ఇంకా సందేహంతో ఈ సంఘటనపై వేదన చెందుతున్నారు. వారు లేచి, నీ హృదయంలో రాముడున్నాడా? ఉంటే చూపించు? అని కోపంగా ప్రశ్నించగా, ప్రసన్న మనస్కుడైన హనుమంతుడు "నిశ్చయంగా నా హృదయంలో భగవానుడు శ్రీరామచంద్రుడు ఉన్నాడు. సింహాసనంపై మీరు ప్రత్యక్షంగా వారిని ఎలా చూస్తున్నారో అలాగే వారు నా హృదయంలో సర్వదా విరాజిల్లుతున్నారు అంటూ ఎంతో గంభీరం, ఉద్విగ్నత నెలకొన్న ఆ సభలో హనుమంతుడు తన విశాల వక్షస్థలాన్ని చీల్చి సీతారాములను అందరికీ దర్శింపజేశాడు. ఈ మహత్తర సంఘటనను వీక్షించిన సభాసదులందరూ ఆంజనేయస్వామి భక్తినీ, సీతారాముల అనుగ్రహాన్ని అర్థం చేసుకుని పులకరించిపోయారు. హనుమంతుడి మహిమను ఎల్లెడలా ప్రశంసలతో గానం చేశారు. సింహాసనం పైనుంచి శ్రీరాముడు లేచి అంజనేయుడిని ఆలింగనం చేసుకున్నారు. ఆ ఆత్మీయ స్పర్శతో హనుమంతుడి వక్షస్థలం మహాదృఢత్వాన్ని సంతరించుకుంది. శ్రీరాముడు తన పట్టాభిషేక మహోత్సవంలో ఆంజనేయుడికి బహుమానం ఎందుకివ్వలేదో అందరికీ అర్థమైంది. సీతామాత మందస్మితంతో ఆంజనేయుడిని అనుగ్రహించింది. అందుకే భక్తికి నిదర్శనంగా హనుమంతుడు యుగయుగాలుగా పూజలందుకుంటున్నాడు.


సందేహం వ్యక్తం చేస్తే అగస్త్య మహాముని వాలి కంటె హనుమంతుడే బలవంతుడని, తన శక్తి తనకు తెలియని కారణంగా వాలి జోలికి వెళ్ల లేదని చెప్పాడు. వాలి జోలికి హనుమంతుడు వెళ్లకపోవడానికి కారణం తల్లి అయిన అంజన మాట కూడా ఉంది. అది వేరే గాథ.

రావణుడు శక్తి ప్రయోగం చేసినప్పుడు అందరూ నేలకొరిగారు. ఒక్కరయినా బతికి ఉన్నారా లేదా అనే సందేహంతో రాత్రి కాగడా తీసికొని విభీషణుడు వెదకసాగాడు.

ఒక్క హనుమంతుడు మాత్రమే క్షేమంగా పక్కనున్నాడు. ఒకచో మూలుగు వినబడి వెళ్లగా కళ్లు కూడా తెరవలేని స్థితిలో స్పృహలో ఉన్న జాంబవంతుడు కనపడ్డాడు. 'తాతా జాంబవంతా!' అని పలకరించగానే 'విభీషణా! హనుమంతుడు బతికి ఉన్నాడా?' అని అడిగాడు. అంతట విభీషణుడు 'జాంబవంతా! మన రాజు సుగ్రీవుని క్షేమం, ప్రభువు రాముని, అతని సోదరుని కుశలమడుగక హనుమంతుని క్షేమమడుగుతావేమిటని ప్రశ్నించగా, జాంబవంతుడు-

**"హనుమంతుడు జీవించిన**
**మన మెల్లను మ్రందియున్న బ్రతికినయట్లే**
**హనుమంతుడు లేకుండిన**
**మన మెల్లను బ్రతికియున్న మ్రందినయట్లే"**

అంటాడు. హనుమంతుడు బతికి ఉంటే మనమంతా చచ్చినా బతికించుకొంటాడు. ఆయన లేకున్న మనలను రక్షింపగలవాడు లేడనే అభిప్రాయం వ్యక్తం చేశాడు. అట్టిది హనుమచ్ఛక్తి. అసలు బలానికి ప్రతీక హనుమంతుడే. ఆయనను ముందుంచుకొనే బలసాధన చేస్తారు. 'హనుమాన్ వ్యాయామశాల', 'మారుతి వ్యాయామశాల' ఇలా ఏర్పాటు చేసికొంటారు.



అంతటి బాహుశక్తి కలవానికి బుద్ధి మట్టంగా ఉంటుంది. కాని ఎంతటి బాహుశక్తియో అంతకు మించిన బుద్ధి శక్తి కలవాడు హనుమంతుడు. అందుకే 'జ్ఞానినామగ్రగణ్యం' అని 'బుద్ధిమతాం వరిష్ఠం' అని స్తుతిస్తాం. జ్ఞానమనేది వాక్కు ద్వారా ప్రకటితమయినప్పుడే సార్థకత, గుర్తింపు. ఆ విషయంలో 'అతిరూపవతీ సీతా, అతివాజ్ఞిపుణః కపిః' అనే ఆర్షవాక్యమే ప్రమాణం. సీతాదేవి అంత అందగత్తె లేదు, హనుమంతునంత వాక్ నైపుణ్యం గలవారు లేరు' అని దాని భావం. హనుమంతుని వాక్యజ్ఞతను ప్రప్రథమ దర్శనంలో శ్రీరాముడే ప్రశంసించాడు. సీతాన్వేషణలో పంపా సరోవరం వెంట వచ్చినప్పుడు మారుతి తొలి పలుకులు వినే రాముడు లక్ష్మణునితో 'చతుర్వేదాలు, సకల శాస్త్రాలు తెలిసిన నవవ్యాకరణజ్ఞుడే ఇలా మాట్లాడగల' ఉంటాడు. రామాయణమంతటా ఇట్టి ప్రజ్ఞ కన్పడుతుంది.

హనుమంతునిలోని గొప్ప విశేషం పరస్పర భిన్నశక్తులు ఆయనలో ఏకీకృతమై ఉండటం, పరిపూర్ణమై ఉండటం. అలా బాహుశక్తి, బుద్ధిశక్తి ఆయనలో పరిపూర్ణమై ఉన్నాయి. ఆయన సకల శాస్త్ర విశారదుడు. సంగీతశాస్త్రంలో ఆయనను మించినవారు లేరు. ఒకప్పుడు నారద తుంబురులు తమలో ఎవరు గొప్ప అని వాదించుకొని బ్రహ్మమాటపై హనుమ వద్దకు వచ్చి ఆయన చేసిన గుండక్రియా గానానికి పరవశులై మేము కాదు నీవే సంగీత విద్వాంసుడవని మెచ్చుకొని వెళ్లారు. సంగీత రత్నాకరంలో సంగీత శాస్త్ర ప్రవర్తకులను స్తుతిస్తూ శారంగదేవుడు 'ఆంజనేయో మాతృగుప్తో రావణో నందికేశ్వరః' అని ఆంజనేయుని స్తుతిస్తాడు. సంగీత శాస్త్రంలో భద్ర, గ్రీవ, భాల, ప్రకాశ, బిందు మున్నగు అలంకారాలను హనుమంతుడే కనిపెట్టాడు. ఆయనకు సంగీతశాస్త్రపరంగా 'కళాధరుడు' అనే బిరుదు కూడా ఉంది.

హనుమంతుడు సాముద్రిక శాస్త్రంలో దిట్ట. ఆ కారణంగానే సీతాదేవి తన భర్తను వర్ణించి చెప్పమన్నప్పుడు ఏ అవయవాలు ఎలా ఉంటాయో చెప్పగలిగాడు. మారుతి గ్రంథకర్త కూడా 'హనుమన్నాటకం' రచించాడు. జెండాపై కపిరాజుగా శ్రీకృష్ణుడు చెప్పిన భగవద్గీతను విని దానికి పైశాచి భాషలో వ్యాఖ్యానం రచించాడు. అందుకే త్యాగరాజు 'గీతార్థము సంగీతానందము వాతాత్మజునకు బాగ తెలుసురా" అని ఒక కీర్తనలో చెప్పాడు. హనుమంతుని సంకీర్తన సామర్థ్యం అనిర్వచనీయం. హనుమదుపాసనచే చిత్ర కవిత్వం వస్తుంది.

యోగశాస్త్రంలో ఆయన పరిణతి పొందినవాడు. కావుననే అష్టసిద్ధులు సాధించగలిగాడు.

"సూక్ష్మరూపధరి సియహి దిఖావా
వికటరూపధరి లంక జరావా
భీమరూపధరి అసుర సంహారే" అని,
'అష్టసిద్ధి నవనిధికే దాతా'
అని తులసీదాసు స్తుతించాడు.

రామ మంత్రోపాసకుడయిన మారుతి మంత్రశాస్త్ర ప్రవీణుడు కూడా. ఇలా బాహుశక్తి, బుద్ధిశక్తి రెండిటా ఆయనను మించినవారు లేరు.

■




**గ్రహ మండలంలోనే అత్యంత తీక్ష్ణమైన దృష్టితో, న్యాయ స్వరూపుడిగా కర్మ ఫలాలను ప్రసాదించే శనైశ్చర భగవానుడు, కేవలం కష్టాలను ఇచ్చే గ్రహం మాత్రమే కాదు; దుర్భర ప్రారబ్ధ కర్మల శేషాన్ని పాయశ్చిత్తం ద్వారా క్షమించి, పరిశుద్ధ మోక్ష మార్గాన్ని చూపే దయార్ద్ర హృదయుడు. కాకి వాహనంపై విశ్వమంతా వ్యాపించి, ఆలయం ముంగిట భక్తుల పూజలందుకుంటున్న ఆయన దివ్య రూపాన్ని స్మరిస్తూ, మన జీవితచక్రంలో కర్మల బంధాలను తెంచుకుని, ఆయన దివ్య అనుగ్రహాన్ని ఎలా పొందవచ్చో, గత జన్మల పాపాలకు పరిహారం ఎలా చేసుకోవాలో శనైశ్చర జయంతి సందర్భంగా ఈ విశిష్ట వ్యాసం వివరిస్తుంది.**

"నీలాంబరో నీలవపుః కిరీటిగృధ్రస్థితస్త్రాసకరోధనుష్మాన్
చతుర్భుజ స్సూర్యసుతః ప్రశాంతః సదాస్తుమహ్యాం వరదః ప్రసన్నః"

నీలమైన వస్త్రమును ధరించినవాడును, నీలమైన దేహము గలవాడును, నీల కిరీటము గలవాడును, గ్రద్ద వాహనముగా గలవాడును, భయంకరుడును, ధనుష్మంతుడును, చతుర్భుజుడును, ప్రశాంతుడును, సూర్యసుతుడు అయిన శనైశ్చరుడు నాయందు ప్రసన్నుడు అగుగాక."

నవగ్రహములలో 'శని' ఏడవ గ్రహము. జ్యోతిశ్శాస్త్రంలో తమోగుణ ప్రధానుడైన శని దుఃఖ కారకుడుగా చెప్పబడ్డాడు. వాస్తవానికి శని దుష్టగ్రహము కాదు. మానవులు దుఃఖములను అనుభవించడానికి మూలకారణము వారు చేసుకున్న కర్మలు. శని పక్షపాత బుద్ధిని చూప కుండా మానవుల దుష్కర్మ ననుసరించి శిక్షపడేటట్లు చేశాడు. దుష్కర్మలకు తగిన ఫలమును ఇచ్చు అధికారము శనికి శివుడు ప్రసాదించాడు.



చిల్లర
సీతారామారావు

శని తల్లిదండ్రులు ఛాయాదేవి, సూర్యభగవానులు. ఇతడు కశ్యప గోత్రమునకు చెందినవాడు. ఇతని గురువు అగస్త్యుడు. శనికి ఇష్టమైన రంగు నీలం. ఈయన వాహనం కాకి. ఇతని రథము లోహ నిర్మితము. నల్లని వన్నె గల ఎనిమిది అశ్వాలు రథాన్ని నడిపిస్తాయి. నల్లని వస్త్రాల మీద మక్కువ ఎక్కువ. తన తపోబలం చేత గ్రహపరత్వమును దక్కించుకున్నాడు. శనికి ఇష్టమైన వారం శనివారం. ఆ రోజు దేవాలయములకు వెళ్లి శనిదేవుడిని దర్శించుకోవాలి. ఆరోజు ఉపవాసం ఉండాలి. ఉప్పులేని భోజనం చేయాలి. సాయం సమయంలో నువ్వుల నూనెలో దీపాలను వెలిగించాలి. అసత్యము చెప్పకూడదు. మద్యమాంసాదులను ముట్టకూడదు. నువ్వుల నూనెతో శనికి అభిషేకం చేయాలి. నువ్వుల నూనెకు శనిదోషం నుంచి

నివారించగలిగిన శక్తి ఉంది. జాతకరీత్యా శని ప్రతికూలముగా ఉన్నప్పుడు ఆయన అనుగ్రహానికై శాంతిక్రియలు చేయాల్సి ఉంటుంది. శని ఏడున్నర సంవత్సరాలు పట్టుకొని పీడిస్తే దానిని ఏలినాటి శని అంటారు. ఏలినాటి శని నుంచి శని బాధలు తొలగిపోవాలంటే పిప్పలాదుడు చెప్పిన రహస్య స్తోత్రమును చదువుకోవాలి.

**శ్లో ॥ కోణో మన్దశ్శనిః కృష్ణస్సూర్యపుత్రో యమశ్చసః**
**పంగుశ్శనైశ్చర స్సౌరిః కాలశ్ఛాయాసుత శ్చః**

కోణుడు, మందుడు, శని, కృష్ణుడు, సూర్యపుత్రుడు, యముడు, పంగుడు శనైశ్చరుడు, సౌరి, కాలుడు, ఛాయా సుతుడు- ఈ పదిపేర్లను స్మరించుచుండిన కీడు తొలగిపోయి శుభములు కలుగుతాయి. సృష్టి ప్రారంభంలో శని పరిస్థితి అత్యంత దీనంగా, హీనంగా ఉండేది. నవగ్రహ కుటుంబంలో అతనికి సేవక స్థానం ప్రాప్తించింది. అవమానములను, దుఃఖములను అనుభవించిన శని శివుడిని ఆరాధించాడు. శివుడు ప్రసన్నుడై పేరుప్రతిష్ఠలు కలిగి, ప్రసిద్ధి చెందగలవని, వరాన్ని ప్రసాదించాడు. శివభక్తి ప్రతాపం వల్లనే శని పట్ల అందరికీ భక్తి పెరిగింది. శనికి ఎన్ని పూజలు జరుగుతున్నాయో అన్ని పూజలు మరే గ్రహాలకూ జరగడం లేదు. శివునికి అత్యంత ప్రియమైనవాడు.

శనిది అత్యంత మందగమనం. ఖగోళం మీద శనిగ్రహం ఎంతో మందగమనంతో సంచరిస్తూ కనిపిస్తాడు. ఇందువల్లనే ప్రాచీనకాలంలోని ప్రజలు శనిగ్రహానికి శనైశ్చరుడు అనే పేరు పెట్టారు. 'శనైః శనైః చరత ఇతి శనైశ్చర' శని మెల్లగా నడవడానికి గల కారణం ఆయన కుంటివాడు కావడమే. ఒక పౌరాణికగాథననుసరించి శని కుంటివాడుగా అవడానికి సంబంధించిన గాథ ఇలా ఉంది. పిప్పలాద మహర్షి బాల్యంలో ఉండగానే ఆయన తండ్రి మరణించాడు. తన భర్త మరణానికి కారకుడు శని అని పిప్పలాదుడి భార్య గట్టిగా నమ్మింది.





పిప్పలాదుడు తన తండ్రి మృత్యువుకు కారకుడైన శనిపై ప్రతీకారం తీర్చుకోవాలనే ఉద్దేశ్యంతో బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ దెబ్బతో శని కుంటివాడై మందగమనుడయ్యాడు. చిత్రస్థుని కుమార్తె శనికి భార్య.

నవగ్రహాల్లో శని దండనాధిపతి. ఏ వ్యక్తికైనా పూర్వజన్మ సుకృత, దుష్కృత ఫలితాలను ప్రదానం చేసే అధికారం శనికి ఉంది. శని ప్రకోపం అందరికీ తెలిసిన విషయమే. మనుష్యులనే కాదు, దేవతలకు కూడా భయమే. పార్వతీ పరమేశ్వరుల మీద కూడా శని తన ప్రభావాన్ని చూపించాడు. ఒకనాడు శని, శంకరుడు సరదాగా సంభాషించుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. శంకరుడు సరదాగా- శనైశ్చరా! నీ ప్రభావం అమోఘమైనది గదా! నీవు ఎవరినీ విడిచిపెట్టవు గదా! త్రిమూర్తులలో నేనొకడిని గదా! నన్ను కూడా నీ ప్రభావానికి బలి చేస్తావా? అని అడిగాడు. శని సమాధానమిస్తూ- పరమేశ్వరా! ఒకమారు తమను పట్టి పీడించాలనే వింత కోరిక నాలో ఉంది అని పలికాడు. లయకారుడనైన తననే శని పట్టి పీడించడమా? అదీ చూద్దాం అనుకున్న శివుడు శని ప్రతిపాదనకు సరేనన్నాడు. తను ఎక్కడ ఉన్నదీ తెలిస్తే కదా శని తనని పట్టిపీడించేది అని భావించిన శివుడు వెంటనే కైలాసం వదిలి అరణ్యాలలో ఒక చెట్టుతొర్రలో దాక్కున్నాడు. మూడు నెలలు గడిచిపోయాయి. ఒకనాడు శివుడు కైలాసానికి వచ్చాడు. శని ఎదురుపడినప్పుడు శివుడు అతనితో- 'శనీ! నీ కోరిక నెరవేరలేదు కదా?' అని ప్రశ్నించాడు. పరమేశ్వరా! గతంలో ఎన్నడైనా తొర్రలో దూరి దాక్కోవలసిన అవసరం ఏర్పడిందా? కాని, ఇప్పుడు అలా జరిగింది. ఎవరి ప్రభావం వల్ల? నా వల్లనే గదా! అని సమాధానమిచ్చాడు శని. శివుడు ఆశ్చర్యపడి నన్నే పట్టి పీడించిన నీవు ఇక మీదట శనీశ్వరుడిగా ప్రసిద్ధి చెందుతావు అని ఆశీర్వదించాడు. అప్పటి నుంచి శని శనీశ్వరుడు అయ్యాడు.

శని ప్రభావం నుంచి పార్వతీదేవి కూడా తప్పించుకోలేక

పోయింది. పార్వతీ దేవికి అందమైన ఒక భవనమును నిర్మిం చుకొని దానిలో నివసించాలన్న కోరిక ప్రబలంగా ఉంది. తన మదిలోని కోరికను పరమేశ్వరుడికి తెలియజేసింది. ఆయన పార్వతీదేవి కోరికను మన్నించాడు. అమ్మవారి కనుసన్నలలో ఒక దివ్యమైన భవనం నిర్మితమైంది. దాని అందానికి ముగ్ధురాలైన పార్వతికి ఒక అనుమానం వచ్చింది. శనిది క్రూరదృష్టి అంటారు గదా! ఒకవేళ శని క్రూరదృష్టి పడితే తన భవనం నామరూపాలు లేకుండా పోతుంది కదా! వెంటనే పరమేశ్వరుడితో- స్వామీ మీరు వెళ్లి శనితో మాట్లాడండి. అతడి క్రూరదృష్టి మన భవనం మీద పడకుండా చూడండి అని పలికింది. పార్వతీ! నీ ఇచ్ఛానుసారం నేను శనితో మాట్లాడతాను అని పలికి వెళ్లి శనిని కలిశాడు పరమేశ్వరుడు. తను వచ్చిన పనిని తెలియజేశాడు. శనీ! పార్వతీదేవి ఒక భవనాన్ని నిర్మించుకుంది. దాని మీద నీ వక్రదృష్టి పడకుండా మరల్చుకొమ్మని, ఆమె నిన్ను కోరుతున్నది అని పలికాడు. శివుడి మాటలకు శని చేతులు జోడించి- మహాదేవా! మీరు నిశ్చింతగా ఉండండి. నేను ఆ మందిరం వైపు చెడు దృష్టితో చూసే దుస్సాహసం చేయను అని వాగ్దానం చేశాడు. శని సమాధానానికి శివుడు సంతోషించి, అతడిని ఏదైనా వరం కోరుకొమ్మని అడిగాడు. శని జవాబిస్తూ- మీ తాండవ నృత్యం చూసే భాగ్యం కలిగించండి అని కోరుకున్నాడు.




తాండవం అనగానే పరమేశ్వరుడు ఆనందంతో అంగీకరిం చాడు. అయితే ఆ ఆనందంలో ఒక విషయం మరిచిపోయాడు. శివుడు శని దగ్గరకు వచ్చే సమయంలో పార్వతీదేవి ఒక విషయాన్ని తెలియజేసింది. ఒకవేళ శని సమ్మతించకపోతే మీరు డమరుకమును వాయించండి. ఆ శబ్దం వినగానే, దానిని నేను ఒక సూచనగా తీసుకొని నా భవనాన్ని నేనే దగ్ధం చేస్తాను. కాని శని దృష్టివల్ల దగ్ధం కాకూడదు. పార్వతీదేవి తెలిపిన ఈ విషయాన్ని మరచిపోయిన శివుడు. డమరుకము వాయిస్తూ ఆనందంతో తాండవ నృత్యం చేశాడు. డమరుక శబ్దం వినగానే పార్వతీదేవి శని అంగీకరించలేదని భావించి తన గృహాన్ని తానే దగ్ధం గావించుకున్నది. తిరిగి వచ్చిన శివుడు దగ్ధమవుతున్న గృహాన్ని చూశాడు. పార్వతి తనకు చెప్పిన మాట గుర్తుకు వచ్చిది. శివుడు పార్వతికి జరిగినదంతా తెలియజేశాడు. పార్వతి తన తప్పుకు, తొందరపాటుకు చింతించింది. ఇదంతా శని ప్రభావమే అనుకున్నారు శివపార్వతులు. శని దృష్టి మహా వినాశనాన్ని కలుగజేస్తుందని ఈ గాథల వల్ల



తెలుస్తున్నది.

జన బాహుళ్యంలో శని గురించి కొన్ని అపోహలు ఉన్నాయి. శని ఎప్పుడూ కీడే చేస్తాడని, జాలి దయలేని క్రూరుడని, అశాంతి దుఃఖాలను మూలకారకుడని ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని మున్నగు పేర్లతో ప్రజలను వేధిస్తాడని, ఒక భావన ప్రజలలో పాతుకుపోయింది. వాస్తవానికి శని ధర్మాత్ముడు తన దశలో జాతకుని మనసు భగవంతుడి వైపు మరల్చి భక్తివిశ్వాసాలను కలిగిస్తాడు. నిష్కారణంగా ఎవ్వరినీ బాధ పెట్టడు. పుణ్యకర్మలు చేసినవారిని సుఖపెడ తాడు. పాపకర్మలు చేసిన వారిని బాధ పెడతాడు.

శనిదేవుడిని ప్రసన్నం చేసుకోవడానికి శాంతి ప్రక్రియలు చేయాల్సి ఉంటుంది. నల్లని ఆవును లేదా గేదెను సేవించడం శనికి సంతోషాన్ని కలుగజేస్తుంది. నల్లని వస్త్రాలు, లోహం, పీచు ఉన్న కొబ్బరికాయ మున్నగు వాటిని దక్షిణతో సహా దానం చేయాలి. ఆంజ నేయుడికి తమలపాకు హారాన్ని వేసినవారు శనిదేవుని అనుగ్రహానికి పాత్రులవుతారు. ■




దర్శనమ్ కార్యాలయం, శ్రీ భారతీతీర్థ గ్రంథాలయ ప్రాంగణంలో ఏప్రిల్ 21, బుధవారం ఆదిశంకర జయంతి మహోత్సవం కార్యక్రమం భక్తి పూరితంగా జరిగింది. అందులో భాగంగా మొట్టమొదట ఉదయం దర్శనమ్ కార్యాలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. ఆదిశంకర భగవత్పాదుల జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ శోభాయాత్ర అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంలో, భక్తిప్రపత్తులతో సాగింది. స్థానిక దేవీనగర్‌లోని శ్రీ రామాలయం వరకు ఈ యాత్ర జరిగింది. శంకరాచార్యుల నామ జపంతో శృంగేరి జగద్గురు పాహిమాం అనే నినాదాలతో కొనసాగిన ఈ యాత్రలో ప్రధాన ఆకర్షణగా నిలిచిన అంశం- సాక్షాత్తు ఆదిశంకరుల బాల్య రూపాలను తలపించేలా ఇద్దరు బాలురు బాలశంకరుల వేషధారణలో మెరిసిపోయారు. కాషాయ వస్త్రాలు ధరించి, చేత దండం పట్టుకుని వారు నడుస్తుంటే, చూసే భక్తులకు సాక్షాత్తు శంకర భగవత్పాదులే తమ ముందు నడిచి వస్తున్నారా అనే అనుభూతి కలిగింది.

ఈ ఇద్దరు బాలశంకరులను అనుసరిస్తూ భక్తులు ఈ యాత్రలో పాల్గొన్నారు. యాత్ర పొడవునా భక్తులందరూ ఏకకంఠంతో నామాలను పఠిస్తుండటంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక పరిమళం వెదజల్లింది. అద్వైత సిద్ధాంతకర్త అయిన శంకరుల కీర్తనలు పాడుతూ, నామ సంకీర్తనలు చేస్తూ భక్తులు పరవశించిపోయారు. చివరకు, ఈ శోభాయాత్ర శ్రీ భారతీతీర్థ గ్రంథాలయ ప్రాంగణానికి చేరుకుంది. అక్కడ నిర్వహించబోయే పూజా కార్యక్రమాలకు, ఆధ్యాత్మిక సభకు ఈ శోభాయాత్ర ఒక గొప్ప నాందిగా నిలిచింది. ఆనాడు శంకరులు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా పాదయాత్ర చేసిన స్మరణను ఈ శోభాయాత్ర కలిగించింది. 'శోభ' అంటే ప్రకాశం లేదా అందం అని అర్థం. ఒక పవిత్రమైన రోజున తమ సంతోషాన్ని చాటిచెప్పడానికి, ధర్మం సాధించిన విజయానికి గుర్తుగా ఈ యాత్రలను వైభవంగా నిర్వహిస్తారు. దర్శనమ్ మాసపత్రిక ఆధ్వర్యంలో జరిగిన ఈ శోభాయాత్ర అటువంటి స్ఫూర్తిని నింపింది. ఆ తరువాత ఆదిశంకర జయంతి సభ ప్రారంభం అత్యంత పవిత్రంగా, గురు వందనంతో దర్శనమ్ మాసపత్రిక సంపాదకులు మరుమాముల వెంకటరమణ శర్మ గారి స్వాగత



వచనాలతో మొదలైంది. జగద్గురువులకు ప్రత్యేక అర్చన, నామార్చన జరిగాయి. హిందూ ధర్మంలో 'గురువు'కు ఉన్నతమైన స్థానం ఉంది, అందుకే ఏ శుభకార్యమైనా గురు ప్రార్థనతోనే ప్రారంభమవుతుంది.




దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి వారు, వారి శిష్యులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామివారి పట్ల భక్తులు తమ అచంచలమైన భక్తిని అందరూ కలిసికట్టుగా చేసిన తమ స్తోత్రాల ద్వారా చాటుకున్నారు. వేదికపై ఉన్న జగద్గురువుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటిస్తూ, వారికి సాష్టాంగ నమస్కారాలు సమర్పించారు.

శ్రీ భారతీతీర్థ స్వామివారు శ్రీ శంకరాచార్యులపై రచించిన స్తోత్రాన్ని మారుమాముల వెంకటరమణ శర్మ గారు భక్తి పరవశంతో ఆలపిస్తుండగా, సభికులందరూ గొంతు కలిపారు. గురువును త్రిమూర్తుల స్వరూపంగా, సాక్షాత్తు పరబ్రహ్మగా భావిస్తూ ఈ ప్రార్థన సాగింది. సదాశివుడి నుంచి ప్రారంభమై, వ్యాస మహర్షి ద్వారా కొనసాగి, ఆదిశంకరుల వరకు చేరిన ఈ అవిచ్ఛిన్నమైన 'గురు పరంపర'ను వక్తలు స్మరించుకున్నారు. శిష్యులకు జ్ఞానాన్ని ప్రసాదించి, అజ్ఞానమనే చీకటిని తొలగించే గురువుల పరంపరలో భాగం కావడం తమ అదృష్టమని భక్తులు భావించారు.

ఈ గురువందన కార్యక్రమంతో సభ ప్రాంగణమంతా ఒక విధమైన ప్రశాంతత, ఆధ్యాత్మిక శక్తి ఆవరించాయి. పండితులు చదివిన మంత్రపుష్పాలు, గురు స్తోత్రాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో భక్తి భావాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లాయి. ఈ విధంగా, గురువుల పట్ల కృతజ్ఞతను చాటుకుంటూ వారి ఆశీస్సులతో కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లారు.

ఆదిశంకర జయంతి వేడుకలలో భాగంగా జరిగిన శ్రీ శంకర భగవత్పాదుల విశేష పూజా కార్యక్రమాలు దిగ్విజయంగా పూర్తయిన తర్వాత, సభా ప్రాంగణం ఆధ్యాత్మిక గానలహరితో పులకించిపోయింది. ప్రముఖ నామ సంకీర్తనాచార్యులు, భజన సంప్రదాయంలో విశేష గుర్తింపు పొందిన బ్రహ్మశ్రీ కొడకండ్ల రాధాకృష్ణ శర్మ, మైత్రావరుణ శర్మ వారి బృందం చేపట్టిన సంకీర్తన కార్యక్రమం భక్తులను మరో లోకానికి తీసుకెళ్లింది.






ఆదిశంకరులు మానవాళికి ప్రసాదించిన అమూల్యమైన స్తోత్రాలను శర్మ అత్యంత మధురంగా, శాస్త్రీయ రాగయుక్తంగా ఆలపించారు. ముఖ్యంగా శివ నక్షత్రమాలిక లోని శ్లోకాలను పఠిస్తుంటే, ఆ పరమశివుని గుణగణాలన్నీ కళ్ళముందు కదలాడినట్లుగా అనిపించింది.

స్వామి, అమ్మవార్ల అభేదాన్ని చాటిచెప్పే అర్ధనారీశ్వర స్తోత్రాన్ని వారు ఆలపిస్తున్నప్పుడు, భక్తులందరూ తన్మయత్వంతో శృతి కలిపారు. శంకరుల సాహితీ సౌరభం, శర్మ గారి గాత్ర మాధుర్యం కలిసి సభలో ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక తరంగాన్ని సృష్టించాయి.

వాద్య సహకారం, తాళ లయలతో సాగిన ఈ సంకీర్తన కేవలం వినడానికే కాక, ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకింది. శంకరులు రచించిన అనేక ఇతర స్తోత్రాలను కూడా వారు ఈ సందర్భంగా వినిపిస్తూ, ఆ స్తోత్రాల వెనుక ఉన్న భక్తి తాత్పర్యాన్ని తమ గానం ద్వారా వ్యక్తపరిచారు.

నామ సంకీర్తన కొనసాగుతున్నంత సేపు సభికులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. కళ్ళు మూసుకుని నామస్మరణలో లీనమైన భక్తులతో ఆ ప్రాంగణమంతా ఒక కైలాసాన్ని తలపించింది. శంకరుల తత్వాన్ని గాన రూపంలో అందించిన ఈ కార్యక్రమం జయంతి వేడుకలలో ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ విధంగా రాధాకృష్ణ శర్మ బృందం తమ సంకీర్తనతో శంకర జయంతిని ఒక మధురమైన ఆధ్యాత్మిక అనుభవంగా మార్చారు. సత్సంగానికి ముందుగా శ్రీకాంతాచార్యులవారు శంకరుల అభివృద్ధితో పాటుగా గోమాతని స్తుతిస్తూ చేసిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. తర్వాత జరిగిన శంకరాచార్య సత్సంగ సభలో ప్రసాద వర్మ కామర్షి, శతావధాని డాక్టర్ జిఎం రామ శర్మ అవధానపీఠ మాసపత్రిక సంపాదకులు మారుమాముల దత్తాత్రేయ శర్మ, సాహితీవేత్త తాడేపల్లి పతంజలి మొదలైన వారు పాల్గొని శంకరాచార్యుల వారి గొప్పతనాన్ని తమ ప్రవచనాలు ద్వారా తెలియజేశారు. ఆ తర్వాత సభలో పాల్గొన్న వారందరినీ దర్శనమ్ మాసపత్రిక సంపాదకులు మారుమాముల వెంకటరమణ శర్మ శాలువాలతో సత్కరించారు. శంకర జయంతి నాడు శంకరాచార్యుని చక్కగా స్మరించిన ఈ సభ ఆయనకు గొప్ప నివాళి. ■



# అలరించిన వింజమూరి సంకీర్త్య శర్మ అష్టావధానం



తెలుగువారి సొంతమైన విశిష్ట సాహితీ ప్రక్రియ అవధానం. గత రెండున్నర దశాబ్దాలుగా అవధాన వికాసానికి, తెలుగునాట అవధానులందరిచేత అష్టావధానాలు, శతావధానాలు విరివిగా నిర్వహిస్తూ భాషా సేవలో పునీతమవుతోంది దర్శనమ్. శృంగేరి జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం వారు తమ ధర్మ విజయయాత్రలో భాగంగా భాగ్యనగరానికి వేంచేసిన సందర్భంలో దర్శనమ్ కార్యాలయాన్ని సందర్శించి, శ్రీ భారతీతీర్థ గ్రంథాలయాన్ని ప్రారంభించి, అనుగ్రహించారు. అనేక ధార్మిక కార్యక్రమాలు, సత్సంగాలు, సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న దర్శనమ్ ప్రతి నెల ఒక అష్టావధానాన్ని అసిధారావ్రతంగా నిర్వహిస్తోంది. ఈ పరంపరలో మార్చి 29న చి. వింజమూరి సంకీర్త్య శర్మ అవధానం జరిగింది. బాల అవధానిగా సరస్వతీ అమ్మవారి అనుగ్రహం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 12 ఏళ్ల వయసు లోనే తొలి అవధానం చేసిన సంకీర్త్య శర్మ ఏడవ అవధానాన్ని దర్శనమ్ కార్యాలయం, భారతీతీర్థ గ్రంథాలయంలో అనేక మంది పండితుల సమక్షంలో నిర్వహించారు.

ఇష్టదేవతా ప్రార్థనా పద్యాలలో సామాన్య వృత్తాలు మాత్రమే కాక లయాత్మక ఛందస్సులు కూడా సంకీర్త్య శర్మ వాడటం విశేషం. వీటికి తోడు ఆయన గళ ప్రభావం కాబోలు సభ అవధానికి వశీకృతం అయ్యింది. ప్రార్థన పద్యాలు సంగీత సాహిత్య సమ్మిళిత శోభతో సభాస్థలిని బ్రాహ్మీమాయం చేసినవి.

యాదృచ్ఛికంగా అదే రోజున సంకీర్త్య శర్మ గురువు గారైన తటవర్తి కల్యాణ చక్రవర్తి గారి జన్మదినం గనుక నిషిద్ధాక్షరి ప్రాశ్నికుడు నితిన్, గురువు గారికి శుభాకాంక్షలు తెలుపుతూ పద్యాన్ని వచించమని ప్రత్యక్షర నిషేధాన్ని ప్రారంభించారు. అడుగడుగునా అడ్డుపడుతున్నా అవధాని చక్కగా పూరణ చేశాడు సంకీర్త్య శర్మ ప్రాస స్థానంలో గురువు అనే పద్యం రాకుండా 'గ' ను నిషేధించినా రెండు, మూడు అక్షరాలతో శ్రీ మాన్యున్ అని మూడు అక్షరాలతో అద్భుతమయిన ప్రారంభాన్ని సభలో ప్రదర్శించారు అవధాని. ఇక నిషిద్ధం చేసిన రెండు పాదాలలోనే గురువు గారిని శబ్దమునకు ఈశుడని, వాగ్మి అని మంచి పదములతో పూర్తి చేశారు అవధాని.

పి.ఎల్. నాగేశ్వరరావు గారు "కాటికి కాళ్ళు జాపుకొని కాంతను వేడ్కగపెండ్లి యాడెగా" అని సమస్య ఇవ్వగా, కాశీ అనే కాటిలో ఉన్న శివుని కల్యాణం గురించి చక్కని పూరణ చేశారు అవధాని. ఆ పద్యంలో శూలపాణి భస్మధారి త్రినేత్రుడు






చిత్స్వరూపుడు శంభుడు అని పరమేశ్వర వర్ణన సాగుతుంటే సభ శివమయమైపోయింది. శివమయమైన చోట సమస్యలేముంటాయి. చక్కగా పూరణ అయిపోయింది.

భువనగిరి పురుషోత్తం గారు తెలుగు-తెలుపు-తలపు-పిలుపు అను దత్త పదములతో తెలుగు భాష విశిష్టతను తెలుపమన్నారు. ఎల్లలు దాటిన తేట తెలుగు కమ్మదనాన్ని చక్కగా వర్ణిస్తూ పద్యానికి కిరీటప్రాయంగా చివర్లో ఆంధ్రరాణ్మణీ అని తెలుగుతల్లిని గూర్చి వాడిన పదం హృదయంతరాలల్లోని భాషాప్రేమను భక్తిని తట్టి లేపినట్టయింది.

వర్ణనాంశముగా శ్రీమతి చిగురాలపద్మ సీతాస్వయం వరమున సీత నిరీక్షణ, భీతిని వర్ణించమంటే నిజంగా సీతాదేవి మనసులో అనుకున్న మాటలు పలుకుతున్నట్టుగా చక్కగా వర్ణించి అవధాని తన కల్పనా శక్తిని చాటుకున్నారు.

శ్రీమతి భానుమతిహట్టి గారు న్యస్తాక్షరి నిర్వహిస్తూ కందములో విష్ణు వర్ణన చేయమనగా విశ్వవ్యాప్తుడైన పురుషుని చిన్న కందంలో చూపిన శైలి అనంతుడైన శ్రీమన్నారాయణుణ్ణి తండ్రికి స్తంభమున చూపిన ప్రహ్లాదునితో ఉపమించవచ్చు అన్నటుగా పూరించి సభను విష్ణుమయం చేశారు అవధాని. ఇక ఛందోభాషణములో చమత్కారముగా ప్రశ్ననే సమాధానంగా మార్చి తన ప్రతిభ చూపించారు అవధాని.

ఆశువు, అప్రస్తుతం చక్కగా పూర్తిచేసి అద్భుతమైన ధారణతో అవధానాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు అవధాని. వీటన్నిటినీ సంచాలక స్థానంలో పరిశీలిస్తున్న నాకు రసానందము పుష్కలంగా కలిగిందని చెప్పితీరాలి.

ముఖ్య అతిథులుగా విచ్చేసిన జి.ఎం. రామశర్మ గారు, శ్రీమాన్ చిటితోటి విజయకుమార్ గారు వారి స్పందనను తెలియచేసి సంకీర్త్య శర్మను ఆశీర్వదించారు.

**- డా. బోరెల్లి హర్ష**, అష్టావధాని





# కన్నుల పండువగా కలంవీరుడి అమృతోత్సవం

విశిష్ట పాత్రికేయులు ఎం.వి.ఆర్ శాస్త్రి గారి అమృతోత్సవం ఏప్రిల్ 22వ తేదీన భాగ్యనగరంలో ఘనంగా జరిగింది. అనేక మంది ప్రముఖులు, ఆయన శిష్యులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సామవేదం షణ్ముఖ శర్మగారు ఎం.వి.ఆర్ శాస్త్రి గారి గురించి ప్రసంగించారు.

అమృతోత్సవాన్ని జరుపుకుంటున్న మా ఎం.వి.ఆర్ శాస్త్రి గారికి ప్రత్యేకమైన నమస్కారాలు తెలియచేసుకుంటూ, అమృతోత్సవం సందర్భంగా ఆ మృత్యుంజయుడు వారికి చిరాయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థన చేస్తున్నాను. ఎం.వి.ఆర్ శాస్త్రి గారు ఇక్కడ కూర్చున్న దగ్గర నుంచీ నా స్థానమేంటో ఆయన తెలియచేస్తున్నారు. 'ప్రవచనకర్తగా ఆవేశపడకండి. మిమ్మల్ని జర్నలిస్టుగా పిలిచాను, జర్నలిస్టుగా పిలిచాను' అని రెండు మూడు సార్లు చెప్పారు. నిజమే. పాత్రికేయ మిత్రుల సమక్షంలో నేను చెబుదామనుకున్నదీ అదే.

నేను పాత్రికేయుడిగా మొదలుపెట్టినప్పుడు, ఒక ప్రసిద్ధ పత్రికలో సంపాదకుడిగా పనిచేసినప్పుడు ప్రధాన సంపాదకు లొచ్చి, ఒక పత్రిక నాకిచ్చి, 'ఇందులో ఈ కాలమ్ చదువు, ఎంత గొప్పగా రాస్తున్నారో చూడు' అని చెప్పారు. ఆ కాలమ్ పేరు 'ఉన్నమాట'. రాసిన వారు శాస్త్రిగారు. అది 90వ దశకంలో జరిగినది. అప్పుడు ఉద్యోగంలో చేరిన కొత్తలో మొదటగా అది చదివాను. నిజాన్ని నిర్భయంగా చెప్పడం, సత్యాన్ని సాక్షాత్క రింపజేయడం.. ఇవన్నీ కనపడుతూ ఉన్నాయి. నిజాన్ని నిర్భయంగా చెప్పడానికి భయం లేకుండా ఉండే లక్షణం ఒక్కటి సరిపోదు, నిజాయితీ కూడా చాలా అవసరం. అందుకు అటు.. నీతి, నిజాయితీ, నిర్భయం, నిజం... ఈ నాలుగు 'ని' కారాలతో, నిచ్చెనలతో వారు జర్నలిజంలో చూపిన విశేషాలను... అప్పటి నుంచి నేను అనుసరిస్తూనే ఉన్నాను.

నేను పాత్రికేయంలో అభిమాన పాత్రికేయులుగా వారిని అప్పటి నుంచి గౌరవించడం మొదలైంది. వారి ప్రత్యక్ష పరిచయం నాకు లేదు. అటు తరువాత ప్రస్థానం మారి వస్తూ ఉండగా, వారు ఆంధ్రభూమిలోకి ప్రవేశించినప్పుడు రచించిన 'వీక్ పాయింట్' కాని, ఎడిటోరియల్స్ కాని, ఇవన్నీ చూస్తే అనిపించేది, ఆ రోజుల్లో... ఇందాక చెప్పారు. స్వతంత్రానికి పూర్వం ఉన్న విషయాల్లో... అప్పుడు పాత్రికేయ రంగంలో ఉన్న చిత్తశుద్ధి, భాష.. ఇవన్నీ పరిశీలిస్తే... అప్పట్లో కృష్ణాపత్రిక సంపాదకీయాల కోసం ఎలా చదివేవారో.. ఎం.వి.ఆర్ శాస్త్రి గారి



రచనల కోసం పత్రికలు అలా చూసేవారని స్పష్టమైంది. పాత్రికేయుల బాధ్యత ఏంటనేది అంత చక్కగా చూపించారు వారు.

నేనొక పాత్రికేయుడిగా 27 సంవత్సరాలుగా ఒక ధార్మికమైన పత్రికను నడుపుతూ, దానిలో దేశాన్ని, ధర్మాన్ని పరిశీలించిన సంపాదకీయాలు ఉన్నాయి. ఆ కారణంగా వారితో పాటు పక్కన కూర్చుని మాట్లాడగలిగే ఒకానొక పరిస్థితి ఏర్పడింది. చాలా మందికి తెలుసు.. ఋషిపీఠం సంపాదకుడిగా ఉన్న కారణంగా.. అది పాత్రికేయ లక్షణమే.. అంటే ఇప్పుడు వారు చెబితే అనిపిస్తుంది... పాత్రికేయుడిగా కొనసాగుతూనే ఉన్నానని గ్రహించాను. ప్రవచనకర్తగాను, మిగిలిన విషయాలలోను.. ఉన్నా, పాత్రికేయునిగా వారికి నాకు ఉన్న సామాన్య లక్షణం ఒకటి ఉంది.. అదేమిటంటే దేశం, ధర్మం... ఈ రెండింటి పట్ల స్పందించడం... ఇది ప్రధానమైన లక్ష్యం. అది నన్ను వారికి మరింత సన్నిహితుడిని చేసింది. వారికి నాకు ఉన్న మరొక ప్రధానమైన అంశం ఏమిటంటే.. మా గురువు సద్గురు శివానంద మూర్తిగారు... వారిని ఈ సమయంలో స్మరిస్తున్నాను. ఎందుకంటే పూర్ణాయువునిచ్చి, ఆయనను ప్రతిక్షణం చైతన్యవంతంగా జీవించగలిగే బలం వారికి సద్గురువుల నుంచి ప్రసరిస్తూనే ఉంది కనుక, వారిని ఈ సమయంలో స్మరిస్తున్నాను. భారతీయం అనే పేరుతో వారు చేసిన రచనలను ఆంధ్రభూమి పత్రిక ద్వారా అందించారు. ఎందుకంటే మా గురువు గారు ఎల్లవేళలా దేశం కోసం, ధర్మం కోసం తపించిపోవడమే కాదు దేశం పట్ల ప్రతి పౌరుడికి బాధ్యత ఉంటుందని చెప్పడం...

దేశమంటే మట్టి కాదోయ్..

దేశమంటే మనుషులోయ్...

అని మనం ఒక మాట వింటూ ఉంటాం.

దేశమంటే మట్టి కాదు, మనిషి కాదు.. పరంపర, సంస్కృతి. ఇవి ఎప్పుడూ మరచిపోరాదు. కనుక మనం చారిత్రక మూలాలు కూడా విస్మరించరాదు. భారతదేశ చరిత్ర సామాన్యమైనది కాదు. చరిత్ర కలిగిన దేశం మనది. చరిత్రను విస్మరిస్తున్న దేశం కూడా మనదే. మనకున్న అలాంటి ఆ చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించాలి. ఇటు పాత్రికేయులుగా వారిలో ఒక కోణాన్ని చూస్తూ.. చక్కగా సంపాదకీయాలు రచించారని చెబుతున్నాం. కాని ఆయన గొప్ప మేధావి. అది మరువరాదు. అనేక గ్రంథములు అధ్యయనం చేశారు. దేశాన్ని అధ్యయనం చేశారు. చరిత్రను అధ్యయనం చేశారు. రాజ్యాంగాన్ని కూడా అధ్యయనం చేశారు. ఇవన్నీ తెలుసుకుని వారు మాట్లాడుతున్నారు. ఒక చక్కని పాత్రికేయునిగానే కాకుండా, ఒక గొప్ప లక్ష్యం కోసం నిరంతరం ఉద్యమిస్తున్న మహామనీషి వారు. ఇది ప్రతి వారు గుర్తు పెట్టుకోవాలి. ఒక మహా లక్ష్యం కోసం తపన పడుతూ ఉన్నారు.

ఆ తపనతో ఆయన మారుతున్నటువంటి ఈ మాధ్యమ రంగంలో ఎన్ని పరిణామాలు వచ్చాయో, వాటన్నిటికి తనను తాను మలచుకుంటూ, చూపిస్తున్నారు. అందుకే పాత్రికేయ రంగంలో నుంచి ఆయన దృశ్య మాధ్యమంలో కూడా చూపిస్తున్న విషయాలు సామాన్యాలు కావు. పైగా సద్గురు శివానందమూర్తి గారు మలచిన ఒక బ్రహ్మాస్త్రం ఎం.వి.ఆర్ శాస్త్రి గారని నా అభిప్రాయం. ఇక రచయితగా వారిని చూస్తే మాత్రం... ఆ రచనలకి నిజానికి ప్రతివారు అభినందించడం కాదు. ప్రతి వారు చదవాలి. నేను అలా చదివినవాడిగా

మాట్లాడుతున్నాను. కేవలం పైపైన మాట్లాడటం కాదు.. వారి రచనలు, గ్రంథాలు దొరికినన్ని చదువుతూనే ఉన్నాను. అందులో వారు సుభాష్ చంద్రబోస్, నేతాజీ అని రెండు భాగాలుగా సుభాష్‌చంద్రబోస్ గురించి రచించిన రచనపై నా సమీక్ష అడిగారు వారు. ఆ సమయంలో వారణాసి క్షేత్రంలో ఉన్నాను. కాని చదివినటువంటి ఉద్విగ్నంతో అప్పటికప్పుడు ఒక వీడియో చేసి పంపేశాను. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఒక్కటి చదివితే చాలు.. భారతదేశ స్వాతంత్ర్య చరిత్ర అంతా తెలుస్తుంది. ఈ దేశానికి ఏ విధంగా స్వతంత్రం వచ్చింది, ఎవరు దీనికి నిజమైన కారణం, అబద్ధాలు ఎలా రాజ్యాలు ఏలాయి అనే విషయం అందులో స్పష్టంగా తెలుస్తుంది. అదే విధంగా మన మహాత్ముడు అనే పేరుతో వారి లీలలను చాలా చక్కగా రాశారు ఆ గ్రంథంలో. అంటే సత్యాన్ని ఆవిష్కరించడంలో వారు చూపించిన మార్గం చాలా మందికి స్ఫూర్తినిచ్చింది. అదే బాటలో చాలామంది మరికొన్ని వాస్తవాలను కూడా తీసుకొచ్చారు.

వీటితో పాటు కాశ్మీరు కథ - కాశ్మీరు వ్యథ.. ఇది కాశ్మీరు చరిత్ర. కాశ్మీరు చరిత్రని మన ప్రాచీన గ్రంథాల ఆధారంగా ,చూడటమనే అంశం వారు అందులో చూపించిన కోణమది. నేటి తరానికి అసలు కాశ్మీరం గురించే తెలియదు. మన దేశంలో అంతర్భాగమేనా అని ప్రశ్నించే స్థాయిలో ఉన్నారు. కాని కాశ్మీరు ఈ దేశానికి శిర స్సు అనేది మరచిపోరాదు. శిరస్సు శరీరానికి ఎంత అవసరమో.. కాశ్మీరు భారతదేశానికి అంత అవసరం. అలాటి గొప్ప చరిత్ర కాశ్మీరు నుంచి భారతదేశమంతా ఎలా ప్రసరించింది... అనేది తెలియాలంటే కల్హణుడి రాజ తరంగిణి నుంచి అన్నీ తెలియాలి. కల్హణుడు రాజతరంగిణిని అధ్యయనం చేయటం ఒకటి, ఇది రాజకీయంగా, చారిత్రకంగా కాశ్మీరులో వచ్చిన మార్పులేమిటి.. వాటన్నిటినీ కూడా వారు అధ్యయనం చేసి, గ్రంథాలలో చూపారు.. రెండవది వారి గ్రంథం ఒకటి చదివి.. సారాంశం మాట్లాడదామని కొన్ని వాక్యాలు ఎంచుకోవాలని ప్రయత్నిస్తే.. మొదటి పుట నుంచి చివరి పుట వరకు ప్రతి వాక్యం సారవంతంగానే కనపడుతుంది. ఒక్క వాక్యం వ్యర్థం లేకుండా ఎట్లా రచించాలనేది .. రచయితలు, పాత్రికేయులు వారి దగ్గర నేర్చుకోవలసిన మరొక అంశం. ఒక్క వాక్యం కూడా వ్యర్థం ఉండదు. అంతా సారవంతంగానే ఉంటుంది.

అలా 'మన కాశ్మీర కథ' గురించి మాట్లాడితే .. మరొక అద్భుతమైన గ్రంథం 'సెక్యులరిజం'. పేరులోనే దేని గురించి మాట్లాడుతున్నారో తెలిసిపోతుంది. ఇందులో రాజ్యాంగం తరపు నుంచి క్రమంగా వచ్చిన మార్పులేమిటి, దానికి భారతదేశపు స్వాభావికమైన సనాతన ధర్మానికి కలిగిన దెబ్బ ఏమిటి... ఇక్కడ



స్వాభావికమైన అని ఒక మాట అన్నాం. అలాగే నేటివ్ అండ్ నేచర్. ప్రతిదానికీ ఒకనేటివిటీ ఉంటుంది. ఆ నేటివిటీని కాపాడుకోవాలి. మన నేటివ్ పక్షి, నేటివ్ జంతువు.. అని నేటివ్ పెట్టుకుంటూ ఉంటారు. అది మొత్తం నేషన్‌కి సంబంధించినది. అంటే.. మనమెలా ఈ దేశంలో పుట్టి పెరగడం వల్ల ఈ దేశంలో పెరిగే హక్కు మనకెలా ఉందో... అలాగే ఈ దేశంలో పుట్టిపెరిగి విస్తరించిన ధర్మానికి కూడా.. ఈ దేశంలో పుట్టి పెరిగే హక్కు ఉంటుంది... రక్షించబడే హక్కు ఉంటుంది. అది తెలుసుకోవాలి. మన ధర్మాన్ని మనం కాపాడుకోవలసిన బాధ్యతను ఎప్పటికప్పుడు గుర్తుచేసుకోవాలి. ఈ దేశపు స్వాభావిక ధర్మం సనాతన ధర్మం. స్వాభావికం అది మరచిపోకూడదు. మనం అందరినీ గౌరవిస్తాం. ఈ దేశంలో పుట్టి పెరిగిన చెట్టు, పుట్ట ఎలాంటివో... ఈ దేశంలో పుట్టి విస్తరించిన సనాతన ధర్మం.. కొన్ని వేల యేళ్ల నుంచి విస్తరించిందో... దానిని మనం విస్మరించరాదు అనే విషయం వీరి యొక్క రచనలలో... అప్పటి నుంచి ఇప్పటి వరకు కనపడుతూ ఉంటుంది. యాభై ఏళ్ల పైచిలుకు పాత్రికేయ బాధ్యతని .. ఒక్క సనాతన ధర్మంచుట్టూ, దేశ భక్తి చుట్టూ తిప్పిన మహానుభావులు. అది తెలుసుకోవాలి. ఒకస్పష్టమైన సిద్ధాంతంతో నడవడమంటే అదే. దేశం పట్ల బాధ్యత అనేది వారి ప్రతి రచనలో కనపడుతుంది.

జాతీయవాదమంటే ఒక పార్టీకి సంబంధించినది కాదు. అది ఒక దేశానికి సంబంధించినది. పార్టీలు మారినా సిద్ధాంతం మాత్రం మారకూడదు. పైగా దేశమంతా క్షేమంగా ఉండాలని కోరుకోవడం కంటె గొప్ప సిద్ధాంతం మరొకటి ఉంటుందా, అదీ పరిహరించవలసినది. కనుక దేశక్షేమం అనిఒక అంశాన్ని దృష్టిలో పెట్టుకుని దానికి విఘాతం కలిగిస్తున్న రాజకీయ పరిణామాలు కాని, సామాజిక పరిణామాలు ఏవైనా వాటిని నిగ్గదీసి, నిలదీసి ప్రశ్నించగలిగే ఒక సూటి రచన అవసరం. అందుకే ఒక జీవప్రవాహం **(మిగతా 25వ పేజీలో)**

# అభినవ శంకర విజయం

(గత సంచిక తరువాయి)

శ్రీశ్రీశ్రీ శివాభినవ నృసింహ భారతీస్వామివారు గురువు గారితో కలసి విజయయాత్రలు చేసిన సన్నివేశంతో ఈ కావ్యం లోని రెండవ ఆశ్వాసానికి శ్రీకారం చుట్టారు శ్రీ లలితాదిత్యకవి.

**"దేశ పరిస్థితుల్, జనుల తీరులు దెన్నులు, క్షేత్ర తీర్థ భూ**
**మీశ బుధాళిఁ గూడగఁ జరించు విధానము, శిష్యకోటిఁధ**
**ర్మాశయ బోధ, ప్రాంత సమయంబులు, బీర విధానముల్,**
**జగ ద్దేశికుడైనవాడు జగతీ విధు లెల్లయు నేర్వగావలెన్."**

అనే సంప్రదాయాన్ని వివరించారు కవి.

ఈ లక్ష్యంతోనే పుష్కరకాలం గురుదేవుల వెంట విజయ యాత్ర చేశారు స్వామివారు. నంజన్ గూడు, చామరాజపురి, మదరాసురాజధాని, సేలం, తిరుచినాపల్లి, మధుర, చిత్తూరు, కడప, కర్నూలు మొదలైన ప్రదేశాలలో విజయయాత్రలు ముగించి, తిరిగి శృంగేరీకి చేరుకున్నారు గురుశిష్యులు.

స్వామివారు శృంగేరి చేరి, తుంగానదీ స్నాన మాచరించి, శారదాదేవి దర్శనం పొందారు. స్వామివారు-

**"దర్శించెను తాపత్రయ కర్శితజన శిశిరణోప కారి నిజ పయః**
**స్పర్శనకృత మంగళ నాదర్శస్వచ్ఛ ప్రవాహ తరలం దుంగన్"**

అని వర్ణించారు కవి.



తాపత్రయాలలో వేగి పోయే జనులకు చల్లదనం ప్రసాదించి, ఆనందింప చేసే తుంగానదిలో మునకలు వేశారని వర్ణించారు కవి.




ఆ పిమ్మట స్వామివారు దర్శించిన శారదాదేవిని లలితాదిత్య మనకు కూడ చూపించారు.

తెల్లనివన్నింటనీ మించిన తెల్ల దనంతో ఉన్న 'సర్వ శుక్లా' అయిన శారదాదేవి వర్ణన చిత్తగించండి:

**"రాకేందువును గేరు, రాజతాద్రిని**
**దూఱు, శేషాహికన్నన్నఁ జెన్నుమీరు,**
**గగనేభమున్ గను, గంగకున్ మిన్నగు, దుగ్ధపాథోరాశి తోడ పెనగు,**
**చందనంబు హసించు, శారదాభ్రము మించు, మల్లికా సుమముల**
**త్రుళ్ళడంచు, త్ర్యక్షుసాక్షిగఁ దోచు,**
**హంసదర్పమ్మునఁ దోచు,**
**ఘనసారసారముం గాలరాచు, నంగ**
**ధావళ్యధాళ ధ ళ్యములచేత**
**భావుకస్వాంతముల శుద్ధపరచుతల్లి దైవ**
**తిలకముం దిలకించె**
**తత్తటిల్లి కమలసంభవసంకల్ప**
**కల్పవల్లి."**


మల్లాప్రగడ
శ్రీమన్నారాయణ మూర్తి

అని చేసిన ఈ వర్ణన ప్రబంధ పద్య సౌందర్యాన్ని తలపిస్తోంది.

ఆ సుమధుర సుముహూర్తంలో స్వామివారినోట ఆశువుగా వెలువడిన 'కమలజదయి తాష్టకం' స్తోత్రం ప్రబంధశైలిలో అనువదించారు శ్రీ లలితాదిత్యకవి.

**"ఓ శృంగాచల శేఖరాభరణమా! ఓ వ్యాస పుత్రాది యో**
**గీశాంతఃకరణ ప్రదీపమ! ప్రణమ్రేశాన వైకుంఠ సం**
**కాశన్యక్కృత శక్రకుంజర వచః కల్పావనీజంబ! లో**
**కేశప్రేయసి! శుద్ధవిద్య నిడవే! యింపార సద్బుద్ధియున్"**

ఇలా సమాస బంధురంగా సాగుతూ...,

**"బహుసూనంబుల నీ పదద్వయిని గొల్వన్ లేదు, మెండైన నీ**
**మహిమన్ బంధుర పద్య గద్యముల సంభావింపగా లేదు, నే**
**ను హతప్రజ్ఞుడ నైన మూకుడగు సూనుం దల్లి రక్షింపదే**
**ద్రుహిణార్ధాంగిని శుద్ధ విద్య నిడవే తూర్ణంబె సద్బుద్ధియున్"**

అంటూ జీవుని వేదనను ప్రకటిస్తూ సాగిన ఈ అనువాదం మూలంలోని కవితా ప్రౌఢిమకు ప్రతిబింబమై సాగి, కవి ఉభయ భాషా రచనా ప్రతిభకు దర్పణమై భాసిస్తోంది. (సశేషం)



# దర్శనమ్
ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

## దర్శనమ్ శ్రేయోభిలాషులకు నమస్కారం... సవినయ విన్నపం

సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా 21 సంవత్సరాలుగా 'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక ధర్మనిష్ఠతో కృషిచేస్తోంది.. చతురామ్నాయ పీఠాల జగద్గురువులు సహా ధర్మాచార్యులకు, పీఠాధీశ్వరులకు గురువందనమ్, ధార్మికవేత్తలు, మహాత్ములకు గురుసత్కారం కార్యక్రమాలను సభక్తికంగా నిర్వహిస్తోంది. వేద, శ్రౌత, శాస్త్ర, ఆర్ష ధర్మాన్ని పునరుజ్జీవింపజేసే ఎన్నో ధార్మిక కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహిస్తోంది. సంస్కృత, తెలుగు భాషా వికాస కార్యక్రమాలను, అవధానాలను విరివిగా నిర్వహిస్తోంది. జీర్ణదేవాలయాల పునరుద్ధరణ, గోసంరక్షణ, లోక కళ్యాణం కోసం ఎన్నో యాగాలు, ధార్మిక కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తోంది. దర్శనమ్ పత్రిక ప్రతి నెల 25వ తేదీన మార్కెట్లోకి, 1వ తేదీన పాఠకుల ముంగిట్లోకి అందేలా క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధతతో కృషిచేస్తోంది. ఒక సామాన్యుడి ధార్మికోద్యమ అక్షరాయుధం 'దర్శనమ్' ఆర్షధర్మ పరిరక్షణ, సంస్కార సమాజం కోసం అహరహం ధర్మనిష్ఠతో పనిచేస్తోంది. ఈ ధార్మికోద్యమానికి మీరు అనేక సందర్భాల్లో అందించిన చేయూత.. వదాన్యత అమోఘం.. మీ సహకారం నాలో ఆత్మస్థైర్యాన్ని మరింత పెంచుతోంది. ప్రస్తుతం ఎన్నో క్లిష్టపరిస్థితులను, అవరోధాలను అధిగమించి ముందుకు సాగుతూ 22వ వసంతంలోకి పత్రిక అడుగిడింది. ఈ ధార్మికోద్యమ పత్రిక ఎల్లకాలం ముందుకు సాగాలని, తెలుగునాట పాఠకదేవుళ్లకు ఆత్మీయ నేస్తంగా ధర్మప్రబోధం అందించాలని నా ఆకాంక్ష... ఇందుకోసం పత్రిక మూలనిధి(ధర్మనిధి)ని ఏర్పాటు చేయాలని నిశ్చయించాను. మీరు మీకు తోచినంత ఈ మూలనిధికి భాగస్వామ్యం అందించి సాయపడాలని, ఈ ధార్మికోద్యమంలో భాగస్వాములు కావాలని మనఃస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను.

– మరుమాముల వెంకటరమణ శర్మ

## 'దర్శనమ్' చందా వివరములు

| | | |
|---|---|---|
| మూడు సంవత్సరాలకు | రూ. | 2000 |
| ఆరు సంవత్సరాలకు | రూ. | 4000 |
| జీవిత చందా (12 సం॥లు) | రూ. | 8000 |
| రాజపోషకులు | రూ. | 15000 |
| మహారాజ పోషకులు | రూ. | 25000 |
| విశిష్ట మహారాజ పోషకులు | రూ. | 100000 |

**విదేశీయులకు...**

| | | |
|---|---|---|
| మూడు సంవత్సరాలకు | రూ. | 12000 |
| ఆరు సంవత్సరాలకు | రూ. | 24000 |
| జీవిత చందా (12 సం॥లు) | రూ. | 48000 |
| విశిష్ట చందాదారులు | రూ. | 60000 |
| రాజపోషకులు | రూ. | 80000 |
| మహారాజ పోషకులు | రూ. | 100000 |

BHIM UPI
Scan using any BHIM UPI enabled APP
DARSHANAM
917013093123@cnrb
Canara Bank

**దర్శనమ్** ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక
ఇ.నెం. 29-105/4/1, శ్రీరామ సిద్ధాంతి భవనం,
న్యూ విద్యానగర్ కాలనీ, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్ - 500 056.
సెల్ : 94410 15469
darshanameditordesk@gmail.com

A/C NAME : DARSHANAM
BANK: CANARA BANK
ACCOUNT NO : 120001974779
IFSC CODE : CNRB0013063
MICR : 500015150
BRANCH CODE : 13063
SWIFT CODE: CNRBINBBBFD

# ఆధ్యాత్మిక స్పర్శ లేని జీవితం.. అసంపూర్ణమే!



ఆధునిక మానవ జీవితంలో మెటీరియలిజం (భౌతికవాదం) ప్రధాన స్థానాన్ని సంపాదించింది. సంపాదన, సౌకర్యాలు, సుఖసౌఖ్యాలు, భోగాలు- ఇవే జీవితం పరమార్థమని చాలామంది నమ్ముతున్నారు. కానీ ఈ భౌతిక సంపదల వెనుక అంధంగా పరుగెత్తే మనిషి, తన అంతరంగాన్ని, ఆత్మతత్వాన్ని మరిచిపోతున్నాడు. ఆధ్యాత్మికత లేని మెటీరియలిజం మనిషిని సంపూర్ణ జీవితం వైపు నడిపించలేకపోతుంది; అది ఒక అసంపూర్ణ జీవనానికే దారితీస్తుంది.

భౌతికవాదం మనిషికి తాత్కాలిక సంతోషాన్ని ఇస్తుంది. ధనం, హోదా, ప్రతిష్ఠ వంటి వాటితో ఆనందం పొందవచ్చేమో కానీ, ఆ ఆనందం స్థిరమైనది కాదు. ఒక కోరిక నెరవేరగానే మరో కోరిక జన్మిస్తుంది. ఈ అంతులేని ఆశల చక్రంలో మనిషి శాంతిని కోల్పోతాడు. ఎంత సంపాదించినా 'ఇంకా కావాలి' అనే అసంతృప్తి అతన్ని వెంటాడుతూనే ఉంటుంది. ఇది మనసుకు భారంగా మారి, చివరకు ఒత్తిడి, ఆందోళన, ఒంటరితనం వంటి సమస్యలకు దారి తీస్తుంది.

ఆధ్యాత్మికత అనేది మతానికి మాత్రమే పరిమితం కాదు. అది మనలోని విలువలను, మనిషితనాన్ని, ఆత్మపరిశీలనను పెంపొందించే జీవన దృష్టి. ఆధ్యాత్మికత మనకు "నేను ఎవరు?", "ఈ జీవితం ఎందుకు?", "నా బాధ్యత ఏమిటి?" అనే ప్రశ్నలను వేయిస్తుంది. ఈ ప్రశ్నలే మనిషిని లోతైన అవగాహన వైపు నడిపిస్తాయి. కానీ ఆధ్యాత్మికత లేని మెటీరియలిజంలో ఈ ప్రశ్నలకు చోటు ఉండదు. ఫలితంగా జీవితం యాంత్రికంగా, అర్థరహితంగా మారుతుంది.

భౌతిక విజయమే జీవన లక్ష్యమైతే, సంబంధాల విలువ తగ్గిపోతుంది. కుటుంబం, స్నేహం, ప్రేమ... ఇవన్నీ లాభనష్టాల కళ్లద్దాలతోనే చూసే పరిస్థితి ఏర్పడుతుంది. స్వార్థం పెరుగుతుంది, సహానుభూతి తగ్గుతుంది. ఇతరుల బాధ పట్ల స్పందించలేని హృదయాలు తయారవుతాయి. ఈ విధంగా సమాజం కూడా లోపభూయిష్టమవుతుంది. బయటకు అభివృద్ధి కనిపించినా, లోపల ఖాళీగా మారుతుంది.



ఆధ్యాత్మికతతో కూడిన జీవితం మాత్రం భౌతిక అవసరాలను తిరస్కరించదు; వాటికి సరైన స్థానం ఇస్తుంది. సంపాదన అవసరమే, కానీ అది లక్ష్యం కాదు? ఒక సాధనం మాత్రమే. ఆధ్యాత్మిక దృష్టితో జీవించే వ్యక్తి, భౌతిక విజయాల మధ్య కూడా అంతర్గత శాంతిని కాపాడుకుంటాడు. అతనికి సంతృప్తి, కృతజ్ఞత, సేవాభావం వంటి గుణాలు సహజంగా అలవడతాయి.

కాబట్టి, ఆధ్యాత్మికత లేని మెటీరియలిజం మనిషిని సంపూర్ణంగా తీర్చిదిద్దలేదు. అది శరీరాన్ని పోషించవచ్చు, కానీ ఆత్మను ఆకలితోనే ఉంచుతుంది. శరీరం-మనసు-ఆత్మ ఈ మూడింటి సమతుల్యతే నిజమైన సంపూర్ణ జీవితం. ఆ సమతుల్యత లేకుండా, ఎంత వైభవంగా జీవించినా అది చివరకు ఒక అసంపూర్ణ జీవితమే. ఇంకా లోతుగా చూస్తే, ఆధ్యాత్మికత లేని మెటీరియలిజం మనిషిని బయట

ప్రపంచానికి బానిసగా మారుస్తుంది. తన విలువను తానే నిర్ణయించుకునే శక్తిని కోల్పోయి, ఇతరులు ఇచ్చే గుర్తింపు, సమాజం వేసే ప్రమాణాల ఆధారంగా తనను తాను కొలవడం ప్రారంభిస్తాడు. ఎంత సంపాదించావు? ఏ కారు వాడుతున్నావు? ఏ హోదాలో ఉన్నావు? ఇలాంటి ప్రశ్నలే మనిషి అస్తిత్వాన్ని నిర్వచించేవిగా మారతాయి. ఈ పరిస్థితిలో మనిషి తన అసలైన స్వరూపాన్ని మరచిపోతాడు.

ఆధ్యాత్మికత లేని జీవితం భయంతో నిండి ఉంటుంది. భవిష్యత్తుపై భయం, సంపద కోల్పోతామేమో అనే ఆందోళన, పోటీ లో వెనుకబడిపోతామేమో అనే అసురక్ష భావన? ఇవన్నీ మనసును ఎప్పుడూ కలవరపెడతాయి. భౌతిక వస్తువులే ఆనందానికి ఆధారమైతే, అవి పోయిన రోజు జీవితం శూన్యంగా అనిపిస్తుంది. అందుకే చాలా మంది అన్నీ ఉన్నా ఆనందం లేనివారిగా కనిపిస్తారు. ఈ అంతర్గత ఖాళీని నింపలేని మెటీరియలిజం, మనిషిని మరింత అశాంతికి గురి చేస్తుంది.

ఆధ్యాత్మికత మనిషికి అంగీకారాన్ని నేర్పుతుంది. జీవితంలో లాభనష్టాలు సహజమేనని, సుఖదుఃఖాలు తాత్కాలికమేనని అవగాహన కలిగిస్తుంది. ఈ అవగాహన లేకపోతే, ప్రతి అపజయం ఒక విషాదంగా, ప్రతి నష్టం ఒక శాపంగా అనిపిస్తుంది. అప్పుడు మనిషి చిన్న సమస్యలకే కుంగిపోతాడు. ఆధ్యాత్మిక బలం ఉన్న వ్యక్తి మాత్రం, పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని, వాటి నుండి నేర్చుకునే దృష్టిని పెంపొందించుకుంటాడు.

ఇక నైతిక విలువల విషయానికి వస్తే, ఆధ్యాత్మికత లేని మెటీరియలిజం వాటిని క్రమంగా క్షీణింపజేస్తుంది. ''లాభం ఉంటే చాలు'' అనే ఆలోచనతో నిజాయితీ, న్యాయం, కరుణ వంటి గుణాలు పక్కన పడిపోతాయి. ఈ ధోరణి వ్యక్తిగత జీవితానికే కాదు, సమాజానికీ ప్రమాదకరమే. ఎందుకంటే ఆధ్యాత్మిక విలువలు లేని అభివృద్ధి, చివరకు మనిషినే మనిషికి శత్రువుగా మార్చుతుంది.

అందుకే నేటి ప్రపంచానికి అవసరమైనది మెటీరియలిజం-ఆధ్యాత్మికతల మధ్య సమన్వయం. భౌతిక పురోగతి అవసరమే, కానీ అది ఆత్మజ్ఞానంతో, విలువలతో కూడినప్పుడే అర్థవంతమవుతుంది. ఆధ్యాత్మికత మనిషిని వాస్తవాల నుంచి దూరం చేయదు; వాటిని సమతుల్యంగా చూసే చూపును ఇస్తుంది.

ముగింపుగా చెప్పాలంటే, ఆధ్యాత్మికత లేని మెటీరియలిజం ఒక వెలితి గల మార్గం. అది బయటకు వెలుగులు విరజిమ్మినా, లోపల చీకటినే దాచుకుంటుంది. నిజమైన జీవితం అంటే కేవలం బతకడం కాదు- అర్థంతో, శాంతితో, మానవీయ విలువలతో జీవించడం. ఆధ్యాత్మిక స్పర్శ లేని భౌతిక జీవితం, ఎంత ఆకర్షణీయంగా కనిపించినా, చివరికి అసంపూర్ణ జీవితంగానే మిగులుతుంది.

**- పూర్ణిమ పసుమర్తి**

---

**21వ పేజీ తరువాయి... కన్నుల పండువగా కలంవీరుడి...**

వంటి శైలి వారి గ్రంథాల్లో.. పాత్రికేయ రచనల్లో మనకు కనపడుతుంది. జీవప్రవాహం అది. ఆయన రచనలు చదివితే స్ఫూర్తి చెందనివాడు ఉండదు. పాత్రికేయ రంగంలో ప్రాథమిక దశలో ఒక్క 'ఉన్న మాట' చదివితే అంత స్ఫూర్తి పొందిన అనుభవంతో ఈ మాట చెప్పగలుగుతున్నాను.

అలాగే ఆంధ్రుల కథ, రమణ మహర్షి గురించి వారు రచించిన కరుణాచలం అరుణా చలం గొప్ప గ్రంథం. ఈ గ్రంథం వారిలోని ఆధ్యాత్మిక, తాత్విక చింతన మనకు తెలియచేస్తోంది. అటువంటి త్యాగ బుద్ధి కలిగిన ఆయన ధర్మనిష్ఠతో ఇదంతా నడిపించారు. వారిలో ప్రధానంగా ఉన్నది... దేశభక్తి, ధర్మనిష్ఠ.. తత్త్వం చింతన... ఈ మూడూ వారిలో ఉన్న గుణాలు. వారి పుస్తకాలకు కొన్నిటికి సమీక్షలు చేశాను. ప్రతివారు అధ్యయనం చేయాలి. ఇవన్నీ అధ్యయనం చేయవలసిన గ్రంథాలు. 75 సంవత్సరాల యువకుడిగానే ఆయనను భావిస్తున్నాను.

ఇప్పుడు ఆయన యువతతో ఒక సైన్యాన్ని తయారుచేశారు. అది మరొక కోణం. అదియువ సైన్యం. ఎంతోమందిని తీర్చిదిద్దిన దేశికుడు. వీటన్నిటి వెనుక సద్గురు శివానంద మూర్తిగారి ప్రణాళిక కనపడుతోంది. తప్పటడుగు వేయకుండా, తప్పును ఎత్తి చూపిస్తూ, సరవించి చూపే నైపుణ్యం ఉంది. ధర్మం మీద అవాకులు చవాకులు పేలినివారిని ఖండించారు. వక్రీకరించి చరిత్రను సవరించారు. వక్రీకరించిన ధర్మాన్ని సవరించారు. సనాతన వ్యవస్థని హేళన చేసినవారికి సమాధానం చెప్పారు. ఆయన లక్ష్యం కోసం ఉద్యమించడాన్ని గమనించాలి. ఆయన రాసినా మాట్లాడినా... వాక్యాలకు కత్తులు కడతారేమో అనిపిస్తుంది. రచించడం, వచించడం, జీవించడం, జీవింప చేయడం... ఈ నాలుగూ వారిలో ప్రధానంగా కనిపిస్తాయి. ఆయనది నిర్మలమైన అంతఃకరణం. ఆయన హృదయంలో మార్దవత్వం. ప్రభావవంతమైన ప్రబోధ లక్షణం ఆయన రచనలలో ఉంది. అది స్ఫూర్తిని కలిగిస్తుంది. వారితో ఎప్పుడూ ఉంటామని చెబుతున్నాను.

**- కె.వి.ఎస్. సుబ్రహ్మణ్యం**, సీనియర్ పాత్రికేయులు




(గత సంచిక తరువాయి)

పసివాని అందచందములను, ఆటపాటలను చూచి తల్లిదండ్రులు పొందెడి ఆనందమునకు పారముండునా? బాలచంద్రునివలెనే నృసింహుడు దిన దిన ప్రవర్ధమాను డయ్యెను. తల్లిదండ్రులకు బంధుమిత్రులకు నిరుగుపొరుగుల వారికి సర్వజనులకు ప్రేమపాత్రుడయ్యెను.

చాలమంది బిడ్డలు పుట్టిపోగా చివరకు దక్కిన బిడ్డడని మిక్కిలి అక్కరతో పెంచుకొనుచున్నను వానికి తల్లిదండ్రుల గారాబమబ్బలేదు. లాలనపాలనాదులయందు అత్యంత ప్రీతి విశ్వాసములు చూపుచున్నను బిడ్డడన్నింటికి తమ మీదనే ఆధారపడునట్లు చేయలేదు. బాలకుని కోరికల నన్నింటినీ తీర్చుచున్నను వాడు పట్టుపట్టి హఠమొనర్చుట కవకాశమీయ లేదు. పుత్రుని నడవడి నెల్లప్పుడు కనిపెట్టకున్ననూ వాడు స్వతంత్రముగను, స్వచ్ఛందముగను పెరుగుట కవకాశము కల్పింపలేదు.

చిన్న వయసునందే సమస్తమును సూక్ష్మముగా నవలోకించు స్వభావముగల ఆ బాలుడు తన తల్లిదండ్రులవలెనే పూజలు చేయుట, స్తోత్రములు పఠించుట, తండ్రి ఆహ్నికమునకు కూర్చుండగా తానును పద్మాసనము వేసి కనులు మూసికొని ప్రక్కనే కూర్చుండుట, ఆయన స్నానమునకై నదికి పోగా తానును నదికేగుట మున్నగునవి చేయుచు సర్వకార్యముల యందును తల్లిదండ్రుల ననుసరించుచునే పెరిగెను. శాస్త్రి గారును జాగరూకులై బాలుని నడవడి నుపాయముతో తీర్చి దిద్దుచుండిరి.

శిశువు పెరిగి బాలకుడయ్యెను. చిన్న చిన్న పనులను తానే చేయ నారంభించెను. దేవపూజకై పత్ర పుష్పములు కోసి తెచ్చుట వానికి నిత్యకృత్యమయ్యెను. తండ్రిగారు అనుష్ఠాన మున కాసీనులు కాగా తానును వారి ప్రక్కనే కూర్చుండి వారు చేయు పనులన్నిటి నవలోకించుట అంగన్యాస, కరన్యాసము లను తదేకదృష్టితో పరికించుట, వారుచ్చరించు మంత్రములను వానియందే లీనమై వినుట వానికి నిత్యపరిపాటియయ్యెను. తండ్రిగారి తోడనే మఠమునకు దేవస్థానమునకు పోవుట, గురుదర్శన దేవదర్శన సందర్భములందు ఒకరు చెప్పవలసిన అవసరము లేకుండ తనంతట తానే సాష్టాంగప్రణామ మాచరించుట స్తోత్రములను పఠించుచు తన్మయు డగుట బాల నృసింహునకు స్వభావము లయ్యెను.

అతనికి మూడేండ్ల వయస్సున చౌలము, అయిదేండ్ల వయ స్సున నక్షరాభ్యాసముమయినవి. ఇంటియందే అమరకోశ మును శబ్దములను నేర్పుచుండుట ఆరంభమయినది. మొదటి నుండియు సంస్కృత శ్లోకములను మిక్కిలి వేగముగా నేర్చు కొనుచున్న ఆ బాలుడు అమరకోశ శబ్దమఞ్జరులను శీఘ్రముగా నేర్చుకొనెను. పాఠశాలయందును అతని విద్యాభ్యాస మీ విధముగనే సాగినది. సౌమ్యగాంభీర్య స్వభావమునకు నిలయమైన ఆ బాలకుని నిశితబుద్ధి విద్యాభ్యాసమునందలి అసక్తి ఉత్సాహముతోడి వర్తనము నివియన్నియు ఉపాధ్యా యుల ప్రశంసకు పాత్రములైనవి. మిగిలిన బాలు రందరికంటె ప్రతి విషయమున ముందుండెడి నృసింహుని ఉపాధ్యాయు లెల్లరు ప్రీతివాత్సల్యములతో చూచుచెండెడివారు. తాము

పాఠములను చెప్పిన వెంటనే గ్రహించెడి అతని బుద్ధిమత్తకు తమ మెప్పును గూడ సూచించుచుండెడివారు.

ఇంటిలో సంస్కృత భాషాభ్యాసము సాగుచున్నట్లే పాఠశాలలో కన్నడాంగ్ల విద్యాభ్యాసము బాలనృసింహునకు చురుకుగా సాగుచుండెను. ఉభయ విద్యలయందును సోపానక్రమమున నతడు ప్రగతిపథము నధిరోహించెను.

శ్రీ శారదాంబా శ్రీ గురుదర్శనములు శాస్త్రిగారికి నిత్యకృత్య ములయి యున్నవి గదా! బాలనరసింహునకు నదే అభ్యాస మయ్యెను. తన దర్శనమునకై వచ్చు ఆ బాలకుని యందు ఏదో అపూర్వశక్తి యున్నదని శ్రీ సచ్చిదానంద శివాభినవ నృసింహభారతీ స్వామివారు గమనించిరి. సహజముగా పసివారిని ఎక్కువ మమతతో చూచుచుండు గురువులు ఈ బాలకుని యందు విశేషమైన ఆసక్తిని కలిగియుండిరి. ఆ బాలుడంజలిబద్ధుడై నిశ్చలముగా కనులు మూసికొని శ్రీ శారదాదేవి యెదుట ధ్యానమగ్నుడై నిలబడగా అతని యందు నలౌకిక తేజస్సును గురువులు గుర్తించిరి. ఒక దినముననైనను ఆ బాలుడు కనిపింప కున్నచో వారి మనస్సు సమాధానము నందెడిది కాదు. నృసింహుడింకను రాలేదేమని వానిని గూర్చియే తలపోసెడివారు.




నృసింహుని అభ్యుదయము విషయమున మహత్తరమైన ఆశాభావము గల గురువర్యులు శ్రీ జగదంబికను గూర్చి "సర్వజ్ఞం శ్రీ నృసింహం కురు శివదయితే సత్వరం మద్వినమ్రమ్" అని ప్రార్థించు చుండెడివారు. తమ అనంతరము వ్యాఖ్యాన పీఠమునకు రాదగిన యోగ్యత నృసింహు నందున్నదని శ్రీ గురువర్యులు భావించిరనుటకు ఇంతకంటె వేరు నిదర్శనమక్కరలేదు.

పదేండ్ల వయస్సుననే ఉపనీతుడైన నరసింహుడు త్రికాల సంధ్యావందనము, అగ్నికార్యము విడువక చేయుచుండెను. ఇంటియందు వేద సంస్కృతముల నభ్యసించుచునే ఆంగ్ల విద్యాభ్యాసము చేయు మాధ్యమిక పాఠశాలయందును నృసింహుడు తన ఉపాధ్యాయుల మెప్పునకు పాత్రుడయ్యెను. పాఠశాల పరీక్షల యందును ప్రప్రథముడుగా నుత్తీర్ణుడగు చుండెను. బాలకుని సూక్ష్మబుద్ధి గ్రహణశక్తి, ఏకాగ్రత, విద్య యందలి శ్రద్ధాసక్తులు, ఉపాధ్యాయుల యందలి భక్తిగౌరవ ములు మున్నగు గుణములన్నియు నితరుల కాదర్శప్రాయ ములయ్యెను. పాఠశాల ఉపాధ్యాయులును తాము చెప్పెడి పాఠ ప్రవచనములు ఈ బాలకునిలో సార్థకత నందు చుండుట కానందించిరి.

## 7

మాధ్యమిక పాఠశాలా పరీక్ష ఉచ్చశ్రేణిలో నెగ్గిన నరసిం హుడు తన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు సంతోషము కలిగించెను. దీనితో తల్లి లక్ష్మమ్మ తాను కన్న కలలు నిజమగుట చూడ నారంభించెను.

తమ కుమారుడు ప్రథమశ్రేణిలో విజయమునందినందున వానిచే ఇంగ్లీషు విద్యాభ్యాసమే చేయింపవలెనని లక్ష్మమ్మ భావించెను. కొంచెము కొంచెముగా ఇంగ్లీషు నేర్చినవారు గూడ ఆ రోజులలో పెద్ద పెద్ద పదవుల నందుకొనుచుండిరి. అధికార మునకు పదవికి ఆ కాలమున నెంతో మర్యాద యుండెడిది. ప్రభుత్వోద్యోగులన్నచో అత్యంత నమ్రతను, గౌరవమును చూపు చుండెడి కాలమది. తమ కుమారుడు ఇంగ్లీషు విద్యలో ప్రావీణ్యమునంది ప్రభుత్వోద్యోగియై గొప్ప అధికారమును పెద్ద పదవిని పొంద వలెనని లక్ష్మమ్మ అభిలాష.

ఆ విషయమును గూర్చి ఆమె భర్తతో చాలసార్లు చర్చించుచుండెడిది. ఆంగ్ల విద్యా భ్యాసము వలన పెద్ద పెద్ద పదవుల నందు కొనిన వారి నిదర్శనములు చూపుచుండెడిది. ఇరుగు పొరుగులనున్న ఆమె స్నేహితురాండ్రు ఆమె అభిప్రాయము ననేక విధముల ప్రోత్స హించి ఇంతటి బుద్ధిమంతుడైన బాలుని పెద్ద అధికారి నొనర్చుటకు ఆంగ్ల విద్యయే సరి యైనదని సలహాలనిచ్చుచుండెడివారు. లక్ష్మమ్మ ఏమి చెప్పినను, ఎంత చర్చించినను శాస్త్రిగారు విని యూరకుండిరే గాని తమ తీర్మానమిది యని వారెన్నడు చెప్పలేదు.

లక్ష్మమ్మకు తోడు మాధ్యమిక పాఠశాల అధ్యాపకులును, కొందరు స్నేహితులును బాలకుని లౌకిక జీవన ప్రగతియం దెక్కువ ఆసక్తి కలిగియుండిరి. వారిలో కొందరు శాస్త్రిగారితో కూడ ఇదే విషయమును ప్రస్తావించిరి. కుర్రవానిని బెంగు ళూరుకు పంపి హైస్కూలు, కాలేజీ చదువులు చదివింపవలెనని ప్రోత్సహించిరి. సహాయ సంపత్తుల విషయమై విపుల సూచనలు గూడ చేసిరి.

శాస్త్రిగారు తొందరపడి యెట్టి నిర్ధారణకు రాలేదు. భార్య బలవంతము, స్నేహితుల ప్రోత్సాహము వారి మనస్సుపై నెట్టి ప్రభావు చూపలేకపోయినవి. మొదటినుండియు దైవమునే నమ్మి భగవత్ప్రేరణ ననుసరించి ప్రవర్తించుటయే శాస్త్రిగారి కలవాటు. బాలకుని శ్రీ శారదాంబకు చెందిన సొత్తుగా భావించుచూ వచ్చినవారు. ఆ బాలుని రక్షణాభ్యు

దయములన్నియు ఆ జగదంబికయే నిర్వహించునని దృఢముగా నమ్మినవారు. ఆ దైవమే ముందటి కర్తవ్యమును సూచించునని వారి విశ్వాసము.

ఒకరోజు తుంగాతీరమున సాయం సంధ్యావందన మొనర్చుకొని శాస్త్రిగారు నిదానముగా గురు దర్శనమునకై నరసింహవనమున కేగిరి. శాస్త్రిగారిని గురువులు మందహాస ముఖులై చూచి వారి నమస్కారములను స్వీకరించిరి. శ్రీవారి మందహాసమే శాస్త్రిగారికి శుభ శకునమయ్యెను. మనస్సులో తాము చేసికొనిన నిర్ణయమే సరియైనదన్న భావన స్ఫురించినది. హర్షప్రఫుల్లముఖులై యున్న శాస్త్రిగారిని చూచి ''ఏమి శాస్త్రిగారూ! బాలుని విద్యాభ్యాసమును గూర్చి తీర్మానమునకు వచ్చినట్లున్నదే'' యనిరి. తమ మనసులోని నిర్ధారణ గురువులకు తెలిసినదా? యని శాస్త్రిగారు విస్మితులై నివేదించిరి. "తమ సన్నిధానమున ఆ విషయమును గూర్చి విజ్ఞప్తి చేసికొనవలయు ననియే నేను వచ్చితిని. కాని తమ్ము దర్శించుటతోడనే నా మనసు నిర్ధారణకు వచ్చినది. ఇది తమ అనుగ్రహమే యని నమ్మకము పుట్టి సంతోషమైనది" "ఔను మీ నరసింహునకు ఆంగ్ల విద్యాభ్యాసము వద్దు. అతని మార్గము వేరు. ఆంగ్ల విద్య నేర్చినందువలన అతడు పరీక్షలో నుత్తీర్ణుడై అధికార పదవి నందుకొనవచ్చును. కాని వాని కియ్యవలసినది ధార్మిక శిక్షణ. అతని పురోభివృద్ధి, కీర్తిప్రతిష్ఠలు సమస్తము నీ మార్గమందే యున్నవి. వానికి వైదిక విద్యనే నేర్పింపుడు" అని ఆశీర్వాద వాణిలో గురువర్యులానతిచ్చిరి.

శాస్త్రిగారు నమ్రతతో తలవంచి "తమ ఆజ్ఞను శిరసా వహించుచున్నాను. పిల్లవాడు సద్విద్యా సంజీవినీ పాఠశాల యందే వ్యాసంగమును సాగించుటకు ఇకమీద పూర్ణావకాశము లభింపగలదు. వాడు తన శక్తినంతను సంస్కృత విద్యాభ్యాసమునకే వినియోగింపగలడు'' అని మనవి చేసిరి. శాస్త్రిగారు ''తమ ఆజ్ఞను శిరసావహించుచున్నా''నని అనగానే గురువర్యులు "అది మా ఆజ్ఞ కాదు, జగదంబకి ఆజ్ఞ"యని చెప్పి శాస్త్రిగారిని పంపిరి.

ఉత్సాహముతో నింటికి వచ్చిన శాస్త్రిగారిని చూచి లక్ష్మమ్మ "నరసింహుని ముందు చదువు విషయమై నిర్ధారణ చేసికొని వచ్చినారు! అందుకే ఇంత సంతోషము'' అని మనసులో ననుకొనెను. కానీ భర్త నిర్ణ మడిగి తెలిసికొని కొంచెముగా ముఖము ముడుచుకొన్నది. ఆమె మనస్సు కొంత క్రుంగినది. కుమారుడు పెద్ద అధికారి కావలెనని ఆశ పెట్టుకొన్న ఆమెకు భర్త చేసిన ఈ తీర్మానము వలన కొంత నిరాశయే కలిగినది. గురువర్యులును ఇట్లే చెప్పిరన్న మాటలు విని ''మన యోగక్షేమ నిర్వాహకుడగు భగవంతుని ఇచ్ఛ ఎట్లున్నదో అట్లే అగును.



మనకు శ్రేయస్సయినదానినే గురువర్యులు సూచించిరి. వారి ఉపదేశము ననుసరించి నడచుకొనుటయే తగినది'' అని ఆమెయనన్నది. కొలది దినముల వరకు మనసు నావరించిన ఖిన్నత క్రమముగా దూరమయి ప్రతిభాశాలి యయిన తన కుమారుడు అడుగు పెట్టిన పథమందే సర్వాభ్యుదయముల నందుకొనునన్న విశ్వాసముతో మనస్సమాధానము నంది తృప్తి పొందినదా తల్లి!

గురువర్యుల అభిప్రాయమున కనుగుణముగా నరసింహుడు సద్విద్యా సంజీవినీ సంస్కృత పాఠశాల విద్యార్థి యయ్యెను. సంస్కృత విద్యాభ్యాసమున యశస్సును పొందసాగెను. సామాన్యుని వలె విత్తార్థికాక నిజమైన విద్యార్థి యయ్యెను.

### 8

గీర్వాణ విద్యలో అత్యధికాసక్తితో అభ్యాసము చేయుచున్న నరసింహుడు ఒక్కొక్క మెట్టే ఎక్కి ఔన్నత్యము నందుకొనుచుండెను. ఉత్సాహముతోడను, శ్రద్ధతోడను విద్యాభ్యాసమొనర్చి అతిశీఘ్రకాలము నందే కావ్యనాటకాలంకారాధ్యయనము పూర్తి చేసెను. ఈ విద్యవలన అతని బుద్ధి నిశితమై హృదయము విశాలమయ్యెను. గీర్వాణ భాషయందు ఆసక్తమైన అతని మనస్సు స్వాభావికముగనే ఆధ్యాత్మిక విద్యవైపునకు ప్రసరింపసాగెను. దాని ప్రభావము వలన బాలకుడు హెచ్చు హెచ్చు మౌనియు, నాలోచనాపరుడు కాజొచ్చెను. బాల్యమునుండియు పారమార్థిక విషయాభిముఖముగా పయనించుచున్న మనస్సు ఇప్పుడు జ్ఞానసాగరాభిముఖముగా పరువెత్తసాగెను. (సశేషం)

- చెఱుకుపల్లి జమదగ్ని శర్మ




(గత సంచిక తరువాయి)

ఎవరి యొక్క సమస్త కర్మలు భౌతిక సుఖాల వాంఛలకు అతీతంగా ఉంటాయో, మరియు ఎవరైతే తమ సమస్త కర్మల క్రియలను జ్ఞానాగ్నిలో భస్మం చేస్తారో, అట్టివారిని జ్ఞానులు , పండితులని పిలుస్తారు.

ఇటువంటి జనులు, తమ కర్మ ఫలములపై ఆసక్తిని (మమకారం) విడిచిన పిదప, ఎల్లప్పుడూ తృప్తి తో ఉంటారు. బాహ్య వస్తు విషయములపై ఆధారపడరు. వీరు కర్మలలో నిమగ్నమయి ఉన్నా, వారు ఏమి చేయనట్టే. (కర్తలు కారు)

ఆశ లేనివాడయి, ఏదీ నాది అన్న భావన లేకుండా, మనసు ఇంద్రియములు పూర్తి నియంత్రణలో ఉంచుకున్నవానికి, శరీరంతో కర్మలు చేస్తూనే ఉన్నా ఏ పాపము అతనికి అంటదు.

అప్రయత్నముగానే లభించిన దానితో సంతృప్తి చెంది, అసూయారహితులైన వారు జీవన ద్వంద్వములకు (సుఖ-దుఃఖాలు, లాభ-నష్టాలు వంటివి) అతీతులై ఉంటారు. అన్ని విధముల పనులు చేస్తూనే ఉన్నా, గెలుపు-ఓటమిలలో సమత్వ బుద్ధి తో ఉండి, వారు తమ కర్మలచే బంధింపబడరు. (ఈ శ్లోకానికి సంబంధించిన ఆంగ్లానువాదము మూలములో లేదు.)

ఆసక్తి, దేహాభిమానము, మమకారము లేనివారు, దివ్య ఆధ్యాత్మిక జ్ఞానంలోనే తమ బుద్ధిని ఉంచినవారికి, తాము చేసే ప్రతి పనిని యజ్ఞం (భగవత్ అర్పితము) గా చేసేవారికి అన్ని రకాల కర్మలు విలీనమవుతాయి. (ఎటువంటి బంధన శక్తి లేక పోవుటయే విలీనమని ఇక్కడ అర్థము).

**యదా సర్వే ప్రముచ్యంతే కామా యే-స్య హృది శ్రితాః ।**
**అథ మర్త్యో-మృతో భవతి అత్ర బ్రహ్మ సమశ్నుతే ॥**

మనసులో పుట్టే అన్ని కోరికలూ ఎప్పుడు తొలగిపోతాయో, అపుడు మనిషి అమరుడు అవుతాడు. అప్పుడే అతను బ్రహ్మ ప్రాప్తిని పొందుతాడు. 12

**ఆత్మానం రథనం విద్ధి శరీరం రథమేవ తు ।**
**బుద్ధింతు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥**
**ఇన్ద్రియాణి హయానాహుర్విషయాంస్తే షు గోచరాన్ ।**
**ఆత్మేన్ద్రియమనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణః ॥**
**యస్త్వ విజ్ఞానవాన్భవత్యయుక్తేన మనసా సదా ।**
**తస్యేన్ద్రియాణ్యవశ్యాని దుష్టాశ్వా ఇవ సారథేః ॥**
**యస్తు విజ్ఞానవాన్భవతి యుక్తేన మనసా సదా ।**
**తస్యేన్ద్రియాణి వశ్యాని సదశ్వా ఇవ సారథేః ॥**
**యస్త్వ విజ్ఞానవాన్భవత్యమనస్కః సదా-శుచిః ।**
**న స తత్పదమాప్నోతి సంసారం చాధిగచ్ఛతి ॥ 13**

జీవాత్మను రథము ఎక్కిన వానిగా తెలుసుకో. ఈ శరీరమే రథం. బుద్ధిని రథసారథిగా, మనసును పగ్గాలుగా తెలుసుకో.

ఇంద్రియాలు గుర్రాలు. విషయ వస్తువులు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు) ఆ గుర్రాలు వెళ్ళే మార్గాలు. శరీరం, ఇంద్రియాలు, మనస్సుతో కూడిన జీవుడు భోక్త అని మహాత్ములు చెబుతారు.

ఎవడు వివేకము (ఆత్మ జ్ఞానం) పొందడో, అదుపు తప్పిన మనసు గలవాడో, ఆ ఇంద్రియాలు, రథసారథికి అదుపులో లేని గుర్రాలలాగా అదుపు తప్పుతాయి.

ఎవడు వివేకము(ఆత్మ జ్ఞానం) పొందిన వాడో, నిగ్రహవంతమైన మనసు కలవాడో, అతని ఇంద్రియాలు, రథసారథికి అదుపులో ఉన్న గుర్రాలలాగా, వశంలో ఉంటాయి.


ఎవడు వివేకము(ఆత్మ జ్ఞానం) పొందడో, అతడు తన మనసుని అదుపులో పెట్టలేడు. అతను బ్రాహ్మీస్థితిని (బ్రహ్మమయిన దైవంలో స్థాపించబడిన స్థితి) పొందలేడు. సంసారంలోకి పడిపోతాడు.

◆◆◆

## అధ్యాయం 5

## త్యాగం

"త్యాగాలు చేయడం" అనే ఆలోచన భారతదేశంలో చాలా సుపరిచితం. అయితే, త్యాగాలన్నింటికీ ఆధారమైన సూత్రాన్ని ఒక విద్యార్థి అర్థం చేసుకోవాలి. అప్పుడే ప్రతి ఒక్కరూ ఇతరుల మేలు కోసం తమను తాము త్యాగం చేసుకోవాలని, మరియు ఇతర వస్తువుల త్యాగాలన్నీ చివరికి ఒక వ్యక్తి తనను తాను ఎలా త్యాగం చేసుకోవాలో నేర్పడానికే ఉద్దేశించినవని అతను గ్రహించగలడు.


SANÂTANA DHARMA

AN ELEMENTARY TEXT-BOOK

OF

HINDU RELIGION AND ETHICS

PUBLISHED BY THE BOARD OF TRUSTEES
CENTRAL HINDU COLLEGE
BENARES

1916

[THE RIGHT OF TRANSLATION AND REPRODUCTION IS RESERVED.]

Price Ans. 12, boards. Re. 1, cloth. Postage 1½ Anna.

ఈ సృష్టి త్యాగంతో కూడుకొని ఉన్నదని విద్యార్థి మొదటగా గ్రహించవలసిన విషయం. ఈ అనంత ప్రకృతిలో ఈశ్వరుడు తనకు తాను హద్దు పెట్టుకుంటాడు. తనను తాను పరిమితం చేసుకుంటాడు. శ్రుతి మరియు స్మృతి కూడా ఈ సత్యాన్ని ప్రకటించాయి. ఋగ్వేదంలోని పురుష సూక్తంలో మరియు భగవద్గీతలో ఈ విషయాలు చర్చింపబడ్డాయి. జీవుల పుట్టుకకు కారణమయ్యే లాంఛనప్రాయమైన త్యాగాన్ని శ్రీ కృష్ణుడు భగవద్గీతలో సూచించాడు.

పదార్థంలో లీనమవడాన్ని ఆధ్యాత్మిక పరిభాషలో "మరణం" అంటారు. తనకు చెందిన అంశములు కలిగిన , అనంతమైన వివిధ రూపాలలో పదార్థంలో తన శక్తులన్నింటినీ అభివృద్ధి చేయకలిగిన జీవులను సృష్టించడానికి, ఈశ్వరుడు ఈ విధంగా త్యాగం చేసాడు. ఇది ప్రాథమిక త్యాగం. ఈ త్యాగ భావనపై ధర్మశాస్త్రమంతా ఆధారపడి ఉంటుంది. ఇతరుల ప్రయోజనం కోసం జీవితాన్ని ధారపోయడమే త్యాగమని, త్యాగం యొక్క అర్థాన్ని కూడా ధర్మశాస్త్రం వివరిస్తుంది.

### త్యాగ నియమం - జీవుల జీవన నియమం

త్యాగ నియమం అనేది అన్ని జీవులకూ జీవన నియమం. వాటి ఎదుగుదల ప్రారంభ దశలలో, జీవులను బలవంతంగా త్యాగం చేస్తారు. తద్వారా అవి తమ ఇష్టానికి లేదా జ్ఞానానికి వ్యతిరేకంగా, అనివార్యంగా అభివృద్ధి చెందుతాయి. వాటి రూపాలు హింసాత్మకంగా విడదీయబడి, కొద్దిగా మరింత అభివృద్ధి చెందిన కొత్త రూపాలలోకి నెట్టబడతాయి.


తాడేపల్లి పతంజలి

ఈ విధంగా :

◆ ఖనిజ రాజ్యంలోని జీవులు తమ ఖనిజ శరీరాలు మొక్కల పోషణకు విచ్ఛిన్నం కావడంతో వృక్ష రాజ్యానికి వెళ్ళడానికి సిద్ధపడతాయి.

◆ వృక్ష రాజ్యంలోని జీవులు తమ వృక్ష శరీరాలు జంతువుల జీవితానికి మద్దతుగా విచ్ఛిన్నం కావడంతో జంతు రాజ్యానికి వెళ్ళడానికి సిద్ధపడతాయి.

◆ జంతు రాజ్యంలోని జీవులు తమ శరీరాలు ఇతర జంతువులకు, అనాగరికులకు మరియు కొన్ని రకాల మనుషులకు మద్దతుగా విచ్ఛిన్నం కావడంతో మానవ రాజ్యానికి వెళ్ళడానికి సిద్ధపడతాయి.

◆ మానవ రాజ్యంలోని జీవులు కూడా నరమాంస భక్షణ, యుద్ధం వంటి వాటిలో తమ మానవ శరీరాలు ఇతర మానవ జీవితాలకు మద్దతుగా విచ్ఛిన్నం కావడంతో ఉన్నత జాతులలోకి ఎదగడానికి సిద్ధపడతాయి.

"ఖనిజ రాజ్యంలోని జీవులు" అంటే ఖనిజాలలో లేదా రాళ్ళలో ఉండే జీవశక్తిని సూచిస్తుంది.

ఇక్కడ "జీవులు" అన్న పదం సాధారణంగా మనం అర్థం చేసుకునే కదిలే, శ్వాసించే ప్రాణుల వలె కాకుండా, ప్రాణం లేనివిగా కనిపించే ఖనిజ



పదార్థాలలో కూడా ఉండే ఒక రకమైన అంతర్గత శక్తి లేదా స్పృహని తెలియజేస్తుంది. వేదాంతపరంగా, ప్రతి వస్తువులోనూ ఒక జీవశక్తి లేదా ఆత్మ ఉంటుందని భావిస్తారు. ఆ సిద్ధాంతం ప్రకారం, ఖనిజాలు కూడా ఒక జీవన దశలో ఉంటాయి. ఈ జీవశక్తి త్యాగం ద్వారా (అంటే ఖనిజాలు విచ్ఛిన్నమై మొక్కలకు పోషకాలుగా మారడం ద్వారా) ఉన్నత రూపాలైన వృక్షాలుగా మారుతుందని ఈ తత్వశాస్త్రం వివరిస్తుంది.)

(- అనువాద కర్త వివరణ)

పైన చెప్పిన అన్ని సందర్భాలలోను తమ అంగీకారం లేకుండానే జీవులు తమ శరీరాలను అసంకల్పితంగా ఇతరుల ప్రయోజనం కోసం త్యాగం చేసారు. ఆ తరువాత అసంఖ్యాక యుగాల తర్వాత త్యాగధర్మము యొక్క సార్వజనీనతను గుర్తించి, జీవుడు, తన చుట్టూ ఉన్నవారి మేలు కోసం ఉద్దేశపూర్వకంగా తన స్వంత ఉపాధిని (శరీరాన్ని) త్యాగం చేయడం ప్రారంభించాడు.




దీనిని ఆత్మత్యాగం అంటారు. ఈ ఆత్మత్యాగం జీవుని యొక్క దివ్యత్వాన్ని చూపిస్తుంది. జీవుడు ఈశ్వరుని దయా స్వభావానికి ఈ ఆత్మత్యాగం ద్వారా సాక్ష్యంగా నిలుస్తాడు.

మహాభారతంలో ఈ ఆత్మత్యాగం గురించి ఒక అద్భుతమైన కథ చెప్పబడింది.

ఒక ముని అయిన త్వష్ట ప్రజాపతి కుమారుడు విశ్వరూపుడు. ఇతనిని ఇంద్రుడు సంహరిస్తాడు. త్వష్ట ప్రజాపతి ఇంద్రుని సంహరించే కొడుకును కోరుకొని ఒక పెద్ద యజ్ఞం ప్రారంభించాడు. యజ్ఞపరిసమాప్తి సమయానికి యజ్ఞ గుండం నుండి ఒక పెద్దరూపం వచ్చి బ్రహ్మాండం అంతా వ్యాపించింది. ఆ భయంకర రాక్షస రూపానికి వృత్రాసురుడు అని నామ కరణం చేసారు. రాక్షసులకు నాయకత్వం వహిస్తున్న వృత్రా సురుడు, ఇంద్రుడిని అతని సైన్యాన్ని యుద్ధంలో ఓడించి, అతనిని రాజధాని అమరావతి నుండి తరిమివేసి, అతని సార్వ భౌమాధికారాన్ని తీసుకున్నాడు. దేవతల రాజయిన ఇంద్రుడు రాక్షసుడయిన వృత్రాసురుని వలన చాలా బాధపడ్డాడు. దేవ తలు చాలాకాలం పాటు ప్రవాసంలో (పరదేశగమనం) తమ రాజు ఇంద్రునితో కలిసి తిరిగారు. తమ రాజధానిని తిరిగి పొందేందుకు దేవతలు పదే పదే ప్రయత్నించారు. కానీ మళ్లీ మళ్లీ ఓడిపోయారు. ఒక ఋషి యొక్క న్యాయమైన కోపాన్ని మరొక ఋషి యొక్క స్వచ్ఛంద స్వీయ త్యాగం మరియు జాలితో తప్ప తగ్గించలేమని చివరికి దేవతలు తెలుసుకున్నారు. పవిత్రమైన వ్యక్తి స్వీయ త్యాగంతో ఇచ్చిన తన శరీరపు ఎముక లతో చేసిన వజ్రాయుధంతో తప్ప మరే ఇతర ఆయుధం ద్వారా వృత్రాసురుని చంపలేమని దేవతలు తెలుసుకొన్నారు.

దేవతలు ఆత్రుతగా దధీచి ముని వద్దకు వెళ్లి తమ బాధాకర మైన గాథను అతనికి చెప్పారు. దధీచి వారి కథ విని జాలితో నిండిపోయాడు. "నా శరీరాన్ని మీకు నచ్చిన విధంగా ఉపయో గించుకోవడానికి నేను మీకు నా శరీరాన్ని ఇష్టపూర్వకంగా ఇస్తున్నాను." అని వారితో దధీచి అన్నాడు : ఆ తరువాత దేవ శిల్పి విశ్వకర్మ ఎముకలు తీసుకొనే ప్రయత్నంలో స్వచ్ఛత, తపస్సుతో మెరుస్తున్న దధీచి శరీరంపై మొరటుగా బాధాకరంగా తన చేతిని వేయలేకపోయాడు. కుంచించు కుపోయాడు. అప్పుడు దధీచి చిరునవ్వుతో "ఈ శరీరాన్ని ఉప్పుతో కప్పండి; ఆవుల మందను ఇక్కడకు తీసుకురండి; అవి ఉప్పును నా మాంసంతో కలిసి తింటాయి; అప్పుడు మీకు అవసరమైన ఎముకలను మీరు తీసుకోండి; అప్పుడు ఈ శరీరంలో ఏదీ వృధా చేయబడ" దన్నాడు : దధీచి చెప్పినట్లే జరిగింది. ఆ అద్భుతమైన దధీచి త్యాగశక్తి ముందు వృత్రాసురుని అమితమైన పరాక్రమం ఓడిపోయింది.2

మన భారతదేశంలో జీవుడు ఋషుల బోధల ద్వారా ఈ ఉత్తమోత్తమ త్యాగ దశ వరకు నడిపించబడ్డాడు. ఎవరయినా త్యాగం చేసిన వెంటనే దాని ఫలితం వెంటనే కనబడదు. ఒక వ్యక్తి ఇతరులకొరకు త్యాగం చేసినప్పుడు, భవిష్యత్తులో తాను త్యాగం చేసిన దానికంటె రెట్టింపు బహుమతులు రెట్టింపు పొందుతాడనే ఉత్తమ మార్గాన్ని ఋషులు మనకు బోధించారు. ఒక వ్యక్తి తన వస్తువులలో కొన్నింటిని త్యాగం చేసిన సంద ర్భంలో భౌతికంగా అవి తనకు దూరమయి కనిపించని వస్తువు లుగా లెక్కించబడతాయి. కాని ఈ త్యాగపు చర్య- తాను ఇచ్చిన వానికంటే రెట్టింపు ప్రయోజనాలను. భవిష్యత్తులో ప్రసాదిస్తుం దనే వాగ్దానాన్ని ఋషులు తెలియ చేసారు. మరణం తరువాత స్వర్గములో సుఖాలను పొందటానికి, ఇలాంటి త్యాగాలు చేయ డం అవసరమని, అలాగే త్యాగబుద్ధితో స్వార్థాన్ని వీలయినం తగా తిరస్కరించాలని మహనీయుల జీవితచరిత్రలు మనకు నేర్పుతున్నాయి. త్యాగం చేయడం ఈదేశంలో ఒక అలవాటుగా మారింది. ఇది గమనార్హం. ఇతరుల కోసం తన సంపదలను త్యాగం చేయాలని, ఇతరుల సేవలో తనను తాను త్యాగం చేయడమే కర్తవ్యమని ఉత్తమ మానవుడు భావించాడు. ఆ సేవ చేయడం ద్వారా లభించే ఆనందమే తనకు లభించే ప్రతి ఫలముగా మానవుడు కనుగొన్నాడు. (సశేషం)




**ప్రథమ సర్గ (ఉపోద్ఘాతము)**

శ్లోకం : ప్రణమ్య పరమాత్మానం శ్రీవిద్యాతీర్థరూపిణమ్ ।
ప్రాచీనశంకరజయే సారః సంగృహ్యతే స్ఫుటమ్ ॥ 1

తాత్పర్యం : శ్రీ విద్యాతీర్థ రూపంలో ఉన్న పరమాత్మకు (తన గురువుకు) నమస్కరించి, పూర్వకవులు రచించిన శంకర విజయాలలోని ప్రధాన సారాంశాన్ని గ్రహించి, ఈ గ్రంథాన్ని స్పష్టంగా రచిస్తున్నాను.

వ్యాఖ్య: గురువే దైవం (శ్రీ విద్యాతీర్థ రూపం) ఇక్కడ పరమాత్మను 'శ్రీ విద్యాతీర్థ రూపం'లో ఉన్నవారిగా వర్ణించారు. దీని ద్వారా రెండు ముఖ్యాంశాలు సూచించబడ్డాయి.

- తన గురువుగారైన శ్రీ విద్యాతీర్థ స్వామి సాక్షాత్తు ఈశ్వరావతారమని, అందువల్లనే వారు సర్వజ్ఞులని (అన్నీ తెలిసినవారని) చెప్పారు.
- పరమాత్మ పట్ల, గురువు పట్ల సమానమైన భక్తి ఉన్నప్పుడే మోక్షం లభిస్తుందని ధ్వనింపజేశారు.

శ్రుతి ప్రమాణం: "యస్య దేవే పరా భక్తిః యథా దేవే తథా గురౌ..." ఎవరికైతే దేవుని పట్ల ఎంతటి భక్తి ఉంటుందో, గురువు పట్ల కూడా అంతటి భక్తి ఉంటుందో, అటువంటి మహాత్ములకు మాత్రమే వేదాంత రహస్యాలు అర్థమవుతాయి.

'శ్రీ విద్యాతీర్థ' పదానికి మరొక అర్థం : తార్కికులు తమ కుతర్కాలతో మలినం చేసిన 'విద్య'ను (సరస్వతీ దేవిని), ఆ మాలిన్యాన్ని కడిగివేసి శుద్ధి చేసిన పవిత్రమైన తీర్థం వంటివారు కాబట్టి ఆయన 'విద్యాతీర్థులు'. బ్రహ్మవిద్య అనే సంపద (శ్రీ) తో కూడి ఉన్నందున భగవత్పాదులను 'శ్రీ విద్యాతీర్థ రూపం' అని పిలిచారు.

దీనినేసంక్షేప శారీరకగ్రంథకర్త ఇలా కొనియాడారు: "ఎవరిని ఆశ్రయించడం వల్ల నిత్యమైన సరస్వతీ దేవి తన నిజమైన అర్థాన్ని పొందిందో, కుతర్కాలనే బురదను కడిగివేసిందో, అటువంటి శంకరాచార్యుల పాదపద్మాలకు నమస్కరిస్తున్నాను."

శివావతార నిరూపణ: శ్రీ శంకర భగవత్పాదులు సాక్షాత్తు పరమశివుని అవతారమని శివపురాణం వంటి గ్రంథాలు నిరూపిస్తున్నాయి. "వ్యాస సూత్రాలకు అర్థం చెబుతూ, వేదాల పరమార్థాన్ని వివరించే శంకరుడు సాక్షాత్తు శివుడే కానీ మరెవరో కాదు." అని శివపురాణ వాక్యం.

పరమాత్మ స్వరూపం (వేదాంతార్థం): మరొక విధంగా చెప్పాలంటే, ప్రత్యగాత్మ (జీవాత్మ) కంటే భిన్నం కాని ఆ పరమేశ్వరుడినే ఇక్కడ 'శ్రీవిద్యాతీర్థరూపిణమ్' అని పిలిచారు.


- శ్రీ: అంటే మాయ.
- విద్య: అనే శబ్దం ద్వారా 'పర విద్య' (బ్రహ్మజ్ఞానం) మరియు 'అపర విద్య' (లౌకిక జ్ఞానం) అని అర్థం. వీటి ద్వారా పొందే మోక్షం, దేవలోకాలను కూడా ఇక్కడ గ్రహించాలి.
- తీర్థ: 'విశ్వకోశం' అనే నిఘంటువు ప్రకారం 'తీర్థ' శబ్దానికి శాస్త్రము, యజ్ఞము, పుణ్యక్షేత్రము, పాత్రత (యోగ్యత), ఉపాధ్యాయుడు, మంత్రి, ఋషులు సేవించిన జలము అని అనేక అర్థాలు ఉన్నాయి.

అందువల్ల, 'శ్రీవిద్యాతీర్థరూపిణమ్' అంటే ఈ సమస్తమైన

శాస్త్ర, క్షేత్ర, జ్ఞాన స్వరూపమైన సర్వాత్మకమైన బ్రహ్మము అని అర్థం."సర్వం ఖల్విదం బ్రహ్మ" (ఈ సమస్తమూ బ్రహ్మమే), "ఏకమేవాద్వితీయం" (ఉన్నది ఒక్కటే, రెండోది లేదు) అనే శ్రుతి వాక్యాల ప్రకారం ఆ పరమాత్మయే ఇదంతా.

గ్రంథ ప్రయోజనం: శ్రీ శంకర విజయమును నిరూపించడం అంటే, శంకరులు బోధించిన 'బ్రహ్మాత్మైక్య భావన' (జీవుడు, బ్రహ్మము ఒక్కటే అనే సత్యం) యొక్క విజయాన్ని చాటడమే.

- విషయం: తెలియని ఆ బ్రహ్మ తత్వమే ఈ గ్రంథానికి 'విషయం'.
- ప్రయోజనం: ఆ తత్వాన్ని తెలుసుకోవడమే పరమ 'ప్రయోజనం'.
- అవాంతర ప్రయోజనం: ఆచార్యుల విజయగాథను తెలుసుకోవడం ఒక మధ్యంతర ప్రయోజనం.




అలంకార విశేషం: ఇక్కడ ఒకే శబ్దానికి అనేక అర్థాలు వచ్చేలా పదప్రయోగం చేయడం వల్ల 'శ్లేషాలంకారము' అని పిలుస్తారు." నానార్థసంశ్రయః శ్లేషః"అని దీని లక్షణం.

మంగళాచరణ నియమం: కావ్యం ప్రారంభంలో దేవతావాచక శబ్దాలను లేదా 'భద్ర' వంటి శుభప్రదమైన పదాలను వాడాలి. అటువంటి పదాలు ఛందస్సు లేదా గణాల పరంగా ఎలాంటి దోషాలు ఉన్నా నింద్యమైనవి కావు (అంటే అవి ఎప్పుడూ శుభాన్నిస్తాయి). అందుకే విద్యారణ్య స్వామివారు పరమాత్మ ప్రార్థనతో కావ్యాన్ని ప్రారంభించారు.

**శ్లో: యద్వద్ఘటానాం పటలో విశాలో విలోక్యతే2ల్పే కిల దర్పణే2పి ।**
**తద్వన్మదీయే లఘుసంగ్రహే2స్మిన్నుద్వీక్ష్యతాం శాంకరవాక్యసారః ॥ 2**

తాత్పర్యం: ఒక చిన్న అద్దంలో కూడా పెద్ద పెద్ద ఏనుగుల గుంపు లేదా కుండల సమూహం ప్రతిబింబించినట్లుగా, నా ఈ చిన్న గ్రంథంలో (సంక్షేప శంకర విజయం) శ్రీశంకరుల జీవితంలోని ప్రధాన అంశాలన్నీ ప్రతిబింబిస్తాయి. పాఠకులు ఇందులో శంకర చరిత్ర సారాన్ని దర్శించవచ్చు.

వ్యాఖ్య :

అద్దం - ప్రతిబింబం :

ప్రశ్న (శంక): "ప్రాచీన శంకర విజయ కావ్యాలలో ఉన్న భగవత్పాదుల అమూల్యమైన వాక్యాల సారాన్ని, నీవు రచించిన ఈ అతి చిన్నదైన (లఘు) సంగ్రహ గ్రంథంలో చూడటం ఎలా సాధ్యం?" అని ఎవరైనా ప్రశ్నిస్తే, దానికి విద్యారణ్య స్వామివారు ఇక్కడ సమాధానం ఇస్తున్నారు.

సమాధానం: ఒక చిన్న అద్దంలో కూడా అతిపెద్దవైన కుంభాలు (ఘటములు), ఏనుగుల సమూహాలు (కరిఘటలు) లేదా పర్వత శిఖరాలు (అద్రి శృంగములు) ఎలాగైతే స్పష్టంగా కనిపిస్తాయో.. అలాగే నా ఈ చిన్న గ్రంథంలో కూడా శంకర భగవత్పాదుల వాక్యాల సారాన్ని మీరు సమగ్రంగా దర్శించవచ్చు.

విశేషార్థాలు:

- ఉపమాలంకారం: ఇక్కడ అద్దం మరియు గ్రంథాన్ని పోల్చడం ద్వారా కవి 'ఉపమాలంకారాన్ని' ప్రయోగించారు. సామాన్య ధర్మాన్ని బట్టి రెండు వస్తువులను పోల్చడమే ఉపమ.
- ఛందస్సు: ఈ శ్లోకం 'ఉపజాతి' వృత్తంలో ఉంది. ఇంద్రవజ్ర మరియు ఉపేంద్రవజ్ర అనే రెండు ఛందస్సుల కలయికనే ఉపజాతి అంటారు.
- శబ్దార్థము (ఘటానామ్): 'మేదిని' నిఘంటువు ప్రకారం 'ఘట' అనే శబ్దానికి కేవలం కుండ అనే అర్థమే కాకుండా, ఏనుగుల సమూహం అనే అర్థం కూడా ఉంది. అంటే అద్దంలో ఏనుగుల వంటి భారీ రూపాలు కూడా ఇమిడిపోయినట్లుగా, ఈ చిన్న గ్రంథంలో శంకరుల మహత్తర చరిత్ర ఇమిడి ఉందని భావం.
- శాంకరవాక్యసారః:ఇక్కడ శంకర వాక్యాలు అంటే భగవత్పాదులవే కాకుండా, వారి ప్రశిష్యుడైనఆనందగిరివంటి వారు రాసిన గ్రంథాలలోని సారాంశాన్ని కూడా గ్రహించినట్లు భావించవచ్చు.

**శ్లో : యథా2తిరుచ్యే మధురే2పి రుచ్యత్వాదాయ రుచ్యాంతరయోజనార్హా।**
**తథేష్యతాం ప్రాక్-కవి-హృద్య-పద్యేష్వేషా2పి మత్పద్య-నివేశభంగీ ॥ 3**

తాత్పర్యం: చాలా తీపిగా ఉన్న పదార్థాన్ని తింటున్నప్పుడు కూడా, రుచిని మరింత పెంచడానికి మధ్యలో కొంచెం ఉప్పగా లేదా కారంగా ఉండే పదార్థం ఎలా తోడ్పడుతుందో, అలాగే పూర్వకవుల అద్భుతమైన కావ్యాల మధ్యలో నా ఈ సామాన్యమైన శ్లోకరచన కూడా పాఠకులకు ఒక కొత్త రుచిని, ఆనందాన్ని కలిగిస్తుందని ఆశిస్తున్నాను.

వ్యాఖ్య

ప్రశ్న (శంక): "మధురమైన ప్రాచీన శంకర విజయ కావ్యాలు ఇప్పటికే ఉండగా, మళ్ళీ ఈ కొత్త రచన ఎందుకు? ఇది వ్యర్థం (వైయర్థ్యం) కాదా?" అని ఎవరైనా అడిగితే, దానికి సమాధానం ఈ శ్లోకంలో ఉంది.

(సశేషం)



# శ్రీమద్దేవీభాగవతం

## నవమ స్కందం

(గత సంచిక తరువాయి)

ఆమెను అందరూ వద్దని చెప్పినా వినకుండా బదరికా వనానికి వెళ్ళి అనేక సంవత్సరాలు తపస్సు చేసింది. శ్రీమహావిష్ణువు నాకు భర్త కావాలని సంకల్పించుకొని, గ్రీష్మ ఋతువులో పంచాగ్నుల మధ్యంలో ఉండి, శీతకాలంలో తడిబట్టలు ధరించి, వర్షర్తువులో వర్షంలో తడుస్తూ తపస్సు చేసింది. కొంతకాలం ఆహారం స్వీకరించి, మరికొంత కేవలం గాలి మాత్రమే పీలుస్తూ, నిరాహారంగా ఉంటూ తపస్సు చేసింది. ఆమె కఠోర తపస్సునకు మెచ్చి బ్రహ్మ, హంసవాహనుడై బదరీవనానికి వెళ్ళాడు. ఆమెతో ఇలా అన్నాడు- తులసీ! ఏ వరం కావాలో కోరుకో. హరిభక్తి కావాలా? హరిసేవ కావాలా? అజరామరత్వం కావాలా?


తులసి ఆయనతో ఇలా అన్నది- పితామహా! నా మనోవాంఛ నీకు తెలియజేస్తాను. నీవు సర్వజ్ఞుడవు. నీ దగ్గఱ నాకు సిగ్గెందుకు? నేను కృష్ణ ప్రియను. సేవకురాలను అయిన నేను, ఒకప్పుడు గోలోకంలో తులసి అనే పేరుతో ప్రసిద్ధి కెక్కిన గోపికను. కృష్ణుని సంపర్కం ఎంత కాలమున్నా నాకు సంతృప్తి కలగలేదు. ఒకనాడు రాధ రాసమండలంలో ఉన్న నన్ను చూచి, మానవస్త్రీవై పుట్టమని శపించింది. అపుడు గోవిందుడు నా అంశతో చతుర్భుజుడు పుడతాడని, అతనిని భర్తగా పొందమని చెప్పాడు. చతుర్భుజుని అనుగ్రహం కోసం బ్రహ్మ గూర్చి తపస్సు చేయమన్నాడు. నేను ఈ జన్మని ఎత్తాను. అందుకే నీకోసం తపస్సు చేసాను. నారాయణుడు భర్త అయ్యే వరం ప్రసాదించు.

బ్రహ్మ ఆమెతో ఇలా అన్నాడు- సుదాముడనబడే గోపాలుడు శ్రీకృష్ణుని నుండి జన్మించాడు. రాధాశాపం వల్ల శంఖచూడుడనే దనుజునిగా పుట్టాడు. అతనికి భార్యవై అనంతరం నారాయణునికి సతి అవుతావు.

**శ్లో॥ శాపాన్నారాయణస్యైవ కలయా దైవయోగతః**
**భవిష్యసి వృక్షరూపా త్వం పూతా విశ్వపావనీ ॥**
**ప్రధానాసర్వపుష్పేషు, విష్ణుప్రాణాధికా భవేః ॥**

(దే.భా, న.స్కం. అ-17, శ్లో: 33,34)

"దైవయోగం వల్ల నారాయణుని శాపానికి గురి అయి చెట్టుగా మారతావు. విశ్వపావనివి, పవిత్రురాలవు అవుతావు. సర్వ పుష్పాలలో ముఖ్య పుష్పవై, విష్ణువునకు ప్రాణం కంటే అధికురాలవు అవుతావు. నీవు లేని పూజలన్నీ వ్యర్థాలు. బృందావనంలో వృక్షరూపం ధరించడం వల్ల 'బృందావని' అనే పేరు నీకు వస్తుంది. గోపికా గోపకులు నీ ఆకులతో మాధవుని పూజిస్తారు. కృష్ణునిలో భాగమై వృక్షాలకు అధి దేవతవు అవుతావు. నా వరం వల్ల స్వేచ్ఛగా విహరించు".



డా॥ వద్దిపర్తి పద్మాకర్

బ్రహ్మ వరాలు స్వీకరించి తులసి ఆయనతో ఇలా అంది- పితామహా! శ్యామసుందరుడు, రెండు చేతులను ధరించేవాడు అయిన కృష్ణుని రూపంపై నాకున్న ప్రీతి, చతుర్భుజ నారాయణ రూపంపై లేదు. శాపం వల్ల కృష్ణునకు దూరమయ్యాను. గోవిందుని మాటల వల్ల చతుర్భుజుని స్వీకరిస్తాను. పరమాత్ముడు ఒక్కడే అయినా నీ వరం వల్ల కృష్ణుడే నాకు భర్త కావాలి. రాధాదేవి వల్ల నాకు భయం లేకుండా చేయి. అప్పుడు బ్రహ్మ దేవుడు ఆమెతో ఇలా అన్నాడు - నీకు రాధా మంత్రాన్ని ఉపదేశిస్తాను. ఆ మంత్రాన్ని జపించు. ఆ మంత్రంలో పదహారు అక్షరాలుంటాయి. నా వరం వల్ల ఆ మంత్రజపం వల్ల రాధకు

ఇష్టురాలవవుతావు. కృష్ణునికి రాధాసమానురాలవు అవుతావు. ఇలా పలికి బ్రహ్మ రాధా షోడశాక్షర మంత్రాన్ని ఆమెకుపదేశించాడు. మంత్రం, స్తోత్రం, కవచం, పూజావిధానం, పురశ్చర్యా విధి ఇచ్చాడు. తులసి బ్రహ్మ చెప్పినట్లుగా జపం చేసి మంత్రసిద్ధి పొందింది. మంత్రసిద్ధి అవ్వడం వలనవరాలు పొంది, సకల భోగాలు అనుభవించింది. చేసిన పనికి తగిన ఫలం లభించినప్పుడు, పడిన శ్రమ అంతాపోయి దుఃఖం సుఖంగా మారుతుంది.

శంఖచూడుడు మహాయోగి. జైగీషవ్యముని వలన కృష్ణ మంత్రాన్ని పొంది పుష్కర క్షేత్రంలో సిద్ధి పొందాడు. కంఠంలో కవచం ధరించి, బ్రహ్మ వరాలు పొంది, బ్రహ్మాజ్ఞతో బదరిలో నివసించాడు. ఒకనాడు అతడు తులసి ఉన్న చోటకు వచ్చాడు. సకల సౌందర్యరాశి, నవయౌవనంలో ఉన్నవాడు, మన్మథునితో సమానుడు, తెల్ల సంపంగి పూవురంగు గలవాడు, రత్నాభరణాలు ధరించిన వాడు,శరత్కాల చంద్రుని లాగా ఉన్నవాడు, తెల్ల తామర పూవుల వంటి కళ్ళు కలిగిన వాడు, ఐన శంఖచూడుడు రత్న నిర్మిత విమానం ఎక్కి వచ్చాడు. కస్తూరి, కుంకుమ, గంధం ధరించి ఆమె వద్దకు రాగా,ఆమె సిగ్గుపడింది. ఆమె సౌందర్యానికి శంఖచూడుడు సంతోషించాడు. ఆమెతో ఇలా అన్నాడు- నీవెవరవు? ఎవరి పుత్రివి? స్త్రీలలో ధన్యురాలివి. మాన్యురాలవు. కళ్యాణీ! సకల శుభాలకు నీవే మూలంలా ఉన్నావు. నీవివరాలు చెప్పు. ఆమె అతనితో ఇలా అన్నది- నేను ధర్మధ్వజుని పుత్రికను. ఇక్కడ తపస్సు చేసుకొంటున్నాను. నీవెవరవు? ఉత్తమ వంశంలో పుట్టిన స్త్రీని, ఒంటరిగా ఉన్నప్పుడు, స్వేచ్ఛగా మాట్లాడరాదని వేదవాక్కు. విషయలోలుడు, నీచవంశంలో పుట్టినవాడు, ధర్మం ఎఱుగనివాడు, వేదం తెలియనివాడు, కాముకుడు, ఏకాంతంగా ఉత్తమ స్త్రీలతో మాట్లాడడానికి పూనుకొంటాడు.

స్త్రీలు పైకి మధురంగా పలుకుతారు. లోపల ఇష్టం లేనివాని చూపు కోరుకొంటారు. తన కోరిక తీరేదాకా చక్కగా మాట్లాడి, కోరిక తీరగానే, పురుషుని చులకనగా చూస్తుంది. అటువంటి స్త్రీల గుఱించి వేదాలు దూషిత స్త్రీలు అని వర్ణించాయి. తెలివైనవాడు అటువంటి స్త్రీని నమ్మడు.

(సశేషం)



శ్రీ సాందీపని గురుకుల సేవాట్రస్ట్

Founded By:Maharanyam Sri Sri MuraliDhara Swamiji (Chennai)



Sri Hari

మన సనాతన ధర్మంలో మన జీవన ఆధారం వేదం, వేదం మన హిందూ ధర్మానికి భారతదేశానికి హృదయం వంటిది. ఎటువంటి సౌకర్యాలు లేని ప్రాచీన కాలంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని మహత్ములు,ఋషులు చాలా కష్టపడి వేదాన్ని సంరక్షించి ఇప్పుడు మన తరానికి అందించారు. వాళ్ళు అందించిన వేదాన్ని కాపాడవలసిన బాధ్యత మన అందరి మీద ఉన్నది.

హైదరాబాద్ నగరంలో ECIL సాకేత్, కాప్రా నందు శ్రీ ప్రేమిక వేదాశ్రమం అను పేరుతో శ్రీ కృష్ణ యజుర్వేద పాఠశాల నిర్వహింపబడుతున్నది, కావున ఆస్తిక జనులందరూ ఈ వేద పాఠశాలకు ధన, వస్తు రూపేణ సహాయ సహకారములు అందించి ఆ వేదమాత యెక్క అనుగ్రహమునకు పాత్రులు కాగలరని కోరుకుంటున్నాము.

ఈ వేద పాఠశాల యందు బ్రాహ్మణ సమారాధన తమ తమ గోత్ర నామములతో చేయించుకున్న వారికి ప్రసాదముగా కుంకుమ, మంత్రాక్షతలు తగు రసీదు పంపడం జరుగుతుంది.

ఆ వేదమాత యొక్క అనుగ్రహం అందరికీ లభించుగాక

Donation Type:One Day Samaradhana-Rs.5000/- One Vidhyarthi Expenses/Month-Rs.8000/- One Day Patasala Expenses-Rs.14000/-

Donations can be made by cheques favoring '' SRI SANDEEPANI GURUKULA SEVA TRUST (A.P.)"


donation can be made by online fund transfer : IFSC Code : **SBINOO12739**

Account Number : **34134951509** Name : SRI SANDEEPANI GURUKULA SEVA TRUST (A.P.),

Branch : SAKETH (HYDERABAD) UPI:ssgsthyd@icici

**Donations are eligible for exemption U/S 80G of Income - Tax Act**

**Admin & Patasala Address : Door no.1-1-31/399A, Lane - 26,Phase-1 Saket nagar,Saket, Kapra, Hyderabad-62. cell:9440875114 - 8667000419**




# మహాభారతసారసంగ్రహము

152

(గత సంచిక తరువాయి)

కామక్రోధాలకు వశుడై గుణవంతులను ద్వేషించేవాడు పురుషాధముడు. ఉత్తమ గుణవంతులైన జ్ఞాతుల విషయంలో మోహంతోను, లోభంతోను ప్రవర్తించేవాని లక్ష్మి చాలాకాలం నిలవదు.

దుష్టులు సమకూర్చిన ఈ అన్నం ఏదీ కూడ తినదగినది కాదు. నేను తినదగినది ఒక్క విదురుని అన్నమే అని నా నిశ్చయం.

**సర్వమేతన్న భక్తవ్యమన్నం దుష్టాభిసంహితమ్,**
**క్షత్తురేకస్య భోక్తవ్యమితి మే ధీయతే మతిః**

(ఉద్యోగపర్వం 91.32)

ఇలా పలికి శ్రీకృష్ణుడు ఆ ఇల్లు విడిచి విదురుని ఇంటికి వెళ్లిపోయాడు.

ద్రోణ-భీష్మ-కృప-శల్యులు, కౌరవులు వెనుకనే వెళ్లి విదురుని ఇంట్లో ఉన్న మధుసూదనునితో - "కృష్ణా! అన్ని శ్రేష్ఠవస్తువులూ ఉన్న ఉత్తమ గృహాలను నీవు నివసించడానికి చూపుతాం. రా" అన్నారు.

"నాకు అన్ని విధాల పూజా జరిగింది లెండి. ఇంక మీరు వెళ్లవచ్చు" అని చెప్పి కృష్ణుడు వాళ్ల నందరినీ పంపివేశాడు.


కీ.శే. ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు

తరువాత విదురుడు శుచి యైన, మధురమైన అన్న పానాదులు ఏర్పాటు చేశాడు. మధుసూదనుడు ముందుగా వాటితో బ్రాహ్మణులను తృప్తిపరచి తరువాత తన పరివారంతో కలిసి భోజనం చేశాడు.

## విదురుడు కౌరవుల దురుద్దేశమును కృష్ణునకు తెలుపుట

భోజనానంతరం రాత్రి సుఖాసీనుడైన కృష్ణునితో విదురుడు - "కృష్ణా! ఈ దుర్యోధనుడు వృద్ధుల మాటలు పెడచెవిని పెట్టే మూర్ఖుడు. పాండవులను తప్పక జయిస్తామను నమ్మకంతో విర్రవీగుతున్నవాడు. ఇలాంటి వానికి మంచి మాటలు చెప్పడానికి నీవు రావడం నాకేమీ నచ్చలేదు. ఈ దుష్టుల మధ్య నువ్వు ఎలా కూర్చొనగలుగుతావు? పూర్వం నీవు జయించిన రాజు లందరూ నీపై పగబూని ఈ దుర్యోధనుని పక్షంలో ఉన్నారు. నీవు వాళ్ల మధ్య ప్రవేశించడం నాకిష్టం లేదు.

నిన్ను దేవత లందరూ కలిసినా ఏమీ చేయజాలరని నాకు

తెలుసును. అయినా నాకు పాండవుల మీద ఎంత ప్రీతి ఉన్నదో అంత ప్రీతియే నీ విషయంలో ఉండడం చేత ఈ మాటలు చెపుతున్నాను'' అన్నాడు.

విదురుడు మైత్రీభావంతో తనలో పలికిన మాటలకు కృష్ణుడతనిని అభినందిస్తూ విదురా! దుర్యోధనాదుల దుర్బుద్ధిని గూర్చి నాకు పూర్తిగా తెలిసినా కూడ ఈ పృథివిని మృత్యుపాశం నుండి విడిపించడం ఉత్తమమైన ధర్మం అను అభిప్రాయంతో వచ్చాను.

ఒక ధర్మకార్యం చేయడానికి తన శక్తికొలది ప్రయత్నించినవాడు ఆ కార్యం సాధించజాలకపోయినా పుణ్యం పొందుతాడు. సందేహం లేదు.

అట్లే మనసా పాపకర్మను చింతించినవాడు అది చేయకపోతే పాపం పొందడు అని ధర్మాత్ములు చెపుతున్నారు.

**ధర్మకార్యం యతన్ శక్త్యా నో చేత్ ప్రాప్నోతి మానవః,**
**ప్రాప్తో భవతి తత్పుణ్యమత్ర మే నాస్తి సంశయః**
**మనసా చిన్తయన్ పాపం కర్మణా నాతిరోచయన్,**
**న ప్రాప్నోతి ఫలం తస్యేత్యేవం ధర్మవిదో విదుః**

(ఉద్యోగపర్వం 93. 6,7)

నేను ఏమాత్రమూ మాయ లేకుండా ధార్తరాష్ట్రుల హితం కొరకు, పాండవుల హితం కొరకు, పృథివిపై నున్న సకల రాజుల హితం కొరకు ప్రయత్నిస్తాను. దుర్యోధనుడు నా ప్రయత్నాన్ని శంకించినా కూడ నా హృదయానికి సంతృప్తి కలుగుతుంది. నా కర్తవ్యం నేను చూసినవాడనవుతాను.

ఈ రాజు లందరూ కలిసినా నన్నేమీ చేయజాలరు.

ఇలా పలికి కృష్ణుడు పర్యంకం మీద సుఖంగా నిద్ర పోయాడు.

## కృష్ణుడు కౌరవసభకు వెళ్లుట

మరునాడు కృష్ణుడు ప్రాతఃకాలమందు లేచి సంధ్యోపాసనాదులు పూర్తిచేసికొంటున్నాడు. దుర్యోధనుడు శకునితో కలిసి వచ్చి "గోవిందా! మహారాజు సభకు విచ్చేసి ఉన్నాడు. రాజు లందరూ నీ రాకకై వేచి ఉన్నారు'' అని నివేదించారు. కృష్ణుడు సంతోషించి సూర్యుడు కొంచెం పైకి రాగానే సర్వాభరణ భూషితుడై విదురుణ్ణి కూడ తన రథం ఎక్కించుకొని బయలు దేరాడు. వీరి వెనుక దుర్యోధనుడు, శకుని మరొక రథం మీద వెళ్లారు. వాళ్ల వెనుకనే సాత్యకీ, కృతవర్మా, ఇతర యాదవ ప్రముఖులు రథాల మీద బయలుదేరి వెళ్లారు. గజాశ్వాదులపై మరికొందరు వారి వెనుక వెళ్లారు. ప్రజ లందరూ వీథులలో బారులు తీరి శ్రీకృష్ణుణ్ణి చూడడానికి నిలబడి ఉన్నారు.

సూర్యుడు ఇతర తేజస్సులను కప్పివేసి నట్లు అక్కడ నున్న వారి తేజస్సులు కప్పివేస్తూ కృష్ణుడు మహేంద్రసభ వలె ఉన్న



ధృతరాష్ట్రుని సభలో ప్రవేశించాడు. ధృతరాష్ట్రుడు లేచి నిలబడగానే సభలోని వాళ్లందరూ లేచి కృష్ణుణ్ణి అభివాదనాదులతో సత్కరించారు.

కృష్ణుడు సభామధ్యంలో నిలచి ఉండగా అతనికి ఆకాశంలో ఉన్న పరమర్షులు కనబడ్డారు. ఆ నారదాదులను చూడగానే కృష్ణుడు భీష్మునితో - "భూలోకంలో జరుగుతున్న ఈ సమితిని చూడడానికై ఋషు లందరూ వచ్చారు. వాళ్లను ఆసనసత్కారాదులతో ఆహ్వానించు. వాళ్లు కూర్చొనకుండా ఎవరూ కూర్చొనకూడదు.''

**నిమన్త్ర్యతామాసనైశ్చ సత్కారేణ చ భూయసా,**
**నైతేష్వనుపవిష్టేషు శక్యం కేనచిదాసితుమ్**

(ఉద్యోగపర్వం 94.43)

అన్నాడు.

ద్వారం దగ్గరనున్న వాళ్లను చూడగానే భీష్ముడు తొందర పడుతూ "ఆసనాలు, ఆసనాలు'' అని భృత్యులను ఆజ్ఞాపిస్తూ వాళ్ల నందరినీ భక్తిపూర్వకంగా తీసికొనివచ్చి ఆసనాలపై కూర్చుండబెట్టాడు.

ఆ మునులందరూ పూజలందికొని ఆసనాల మీద కూర్చున్న తరువాత కృష్ణుడు, ఇతర రాజులు తగిన ఆసనాల మీద ఉపవిష్టులయ్యారు.

దుఃశాసనుడు సాత్యకికి ఉత్తమమైన ఆసనం చూపించాడు. వివింశతి కృతవర్మకు బంగారు పీఠం చూపించాడు. కర్ణదుర్యోధనులిద్దరూ కృష్ణునికి దగ్గరగా ఒకే ఆసనం మీద కూర్చున్నారు.

మహామతియైన విదురుడు కృష్ణుణ్ణి స్పృశిస్తూ తెల్లని అనర్ఘమైన అజినం కప్పిన మణిమయ పీఠం మీద కూర్చున్నాడు.

అంత కాలానికి కనబడిన కృష్ణుణ్ణి చూస్తున్న ఆ సభాసదులెవ్వరికీ, ఎంత అమృతం త్రాగినా తనివితీర నట్లు, అతనిని ఎంత చూచినా తృప్తి కలగడం లేదు. పీతాంబరమును ధరించి సభామధ్యంలో కూర్చున్న అతసీపుష్పచ్ఛాయ వంటి ఛాయ గల

కృష్ణుడు బంగారం మీద పొదిగిన మణి వలె మెరిసిపోతున్నాడు.

గోవిందుని మీద కేంద్రీకృతమైన మనస్సులతో అంతా నిశ్శబ్దం అయిపోయింది. ఒక్కడు కూడ ఏమీ మాటాడలేదు.

**తతస్తూష్ణీం సర్వమాసీద్ గోవిన్దగతమానసమ్,**
**న తత్ర కశ్చిద్ కించిద్వా వ్యాజహార పుమాన్ క్వచిత్**

(ఉద్యోగపర్వం 94.54)

## కౌరవసభలో కృష్ణుని భాషణము

సభలో అందరూ నిఃశబ్దంగా కూర్చొన్నారు. కృష్ణుడు ధృతరాష్ట్రుణ్ణి ఉద్దేశించి ఈ విధంగా అన్నాడు - "భారతా! కౌరవ-పాండవుల మధ్య యుద్ధం జరగకుండా, శాంతిని నెలకొల్పాలనే అభిలాషతో వచ్చాను. రాజవంశా లన్నింటిలోకీ మీ కురువంశానికి ఎంతటి వైశిష్ట్యం ఉందో అందరికీ తెలిసినదే. అలాంటి వంశంలో సర్వనాశం జరిగే పరిస్థితులు ఏర్పడడం, అందుకు నువ్వు నిమిత్తం అవడమూ యుక్తం కాదు.

నీ పుత్రులైన దుర్యోధనాదులు ధర్మార్థాలను వెనుకకు పెట్టి లోభంతో, నీతి నియమాదులన్నీ విడిచిపెట్టి తమ ముఖ్యబంధువుల విషయంలోనే ఏవిధంగా క్రూరంగా ప్రవర్తిస్తున్నారో నీకు తెలుసు.

కురువంశీయులలోనే పుట్టిన ఈ ఘోరమైన విపత్తును ఉపేక్షిస్తే మొత్తం పృథివీ మండలాన్నే నశింపజేస్తుంది.

**సేయమాపన్మహాఘోరా కురుష్వేవ సముత్థితా,**
**ఉపేక్ష్యమాణా కౌరవ్య పృథివీం ఘాతయిష్యతి.**

(ఉద్యోగపర్వం 95.11)

రాజా! నువ్వు తలచుకుంటే దీనిని శాంతింపచేయవచ్చును.

భరతర్షభా! శమం నీమీదా నామీదా ఆధారపడి ఉంది. నువ్వు నీ పుత్రులను నిలిపివేయుము. నేను పాండవులను నిలిపివేస్తాను.

పాండవులూ కౌరవులూ కలిసి ఉంటే దేవత లందరూ కలిసి దండెత్తి వచ్చినా వీళ్లను ఏమీ చేయజాలరు. నువ్వు సుఖంగా నిద్రపోవచ్చును. యుద్ధం అనేక మైన అనర్థాలకు దారితీస్తుంది.

నీ పుత్రులు పాండవులనందరినీ సంహరించినా, పాండవులు నీ పుత్రులనందరినీ సంహరించినా నువ్వు ఏ విధంగా సుఖంగా ఉండగలవో ఆలోచించి చెప్పు.

మీ పిలుపుపై యుద్ధం చేయడానికై వచ్చిన ఈ రాజు లందరూ కలిసి హాయిగా తిని త్రాగి సుఖంగా వాళ్ల వాళ్ల ఇంటికి వెళ్లేటట్లు చూడు.

తండ్రి పోయిన పిల్లలను నువ్వే పెంచావు కదా? ఇప్పుడు కూడ వీళ్ల క్షేమం చూడవలసిన బాధ్యత నీపైన ఉంది.

"అనుకొన్న ప్రకారం పదమూడు సంవత్సరాలూ వనవాసం చేసి వచ్చాం, మా రాజ్యం మాకివ్వండి" అని పాండవు



లడుగుతున్నారు.

"నువ్వు పూజ్యుడవు కదా అని మేం నీవు చెప్పినట్లు అన్ని క్లేశాలు సహిస్తున్నాం. నువ్వు కూడ మా విషయంలో తండ్రి వలె, తల్లి వలె ప్రవర్తించడం నీ ధర్మం" అంటున్నారు పాండవులు.

"భరత శ్రేష్ఠా! ధర్మజ్ఞులైన సభాసదులు కూడ అన్యాయంగా ప్రవర్తించడం యుక్తం కాదు" అని నీ పుత్రులు (పాండవులు) ఈ పరిషత్తుతో అంటున్నారు.

"అధర్మం ధర్మాన్నీ, అసత్యం సత్యాన్నీ అణగద్రొక్కుతూండగా చూస్తూ కూర్చున్న సభాసదు లందరూ కూడ హతులైనట్లే" అంటున్నారు వాళ్లు.

**యత్ర ధర్మో హ్యధర్మేణ సత్యం యత్రానృతేన చ,**
**హన్యతే ప్రేక్షమాణానాం హతాస్తత్ర సభాసదః**

(ఉద్యోగపర్వం 95.48)

"అధర్మం చేత పీడింపబడిన ధర్మం (న్యాయం కోరుతూ) సభకు వెళ్లినప్పుడు దాని శల్యాన్ని తొలగించని సభాసదులకు ఆ ధర్మం గట్టి దెబ్బ కొడుతుంది."

**విద్ధో ధర్మో హ్యధర్మేణ సభాం యత్ర ప్రపద్యతే,**
**న చాస్య శల్యం కృన్తన్తి విద్ధాస్తత్ర సభాసదః**

(ఉద్యోగపర్వం 95.49)

"ఏది ధర్మసంమతమో తెలిసి కూడ ఏదో ఆలోచిస్తూన్నట్లు మాటలాడకుండా కూర్చున్న సభాసదులను నది ఒడ్డుమీద ఉన్న చెట్లను పడగొట్టి నట్లు ఆ ధర్మమే పడగొడుతుంది."

**ధర్మ ఏతానారుజతి యథా నద్యనుకూలజాన్,**
**యే ధర్మ్యమను పశ్యన్తస్తూష్ణీం ధ్యాయన్త ఆసతే.**

(ఉద్యోగపర్వం 95.50)

రాజా! నీ సభలో ఉన్న సభాసదులనే చెప్పమను - నేను ధర్మార్థాలను జాగ్రత్తగా పరిశీలించి చెపుతున్నప్పుడు వీళ్లు మాత్రం ఏమనగలరు?

రాజా! పాండవుల భాగం పాండవుల కిచ్చివెయ్యి. ఈ క్షత్రియు లందరినీ సర్వవినాశం నుండి రక్షించు.

కృష్ణుని మాటలు విని అక్కడ నున్న వాళ్లందరూ మనస్సులో పూజించారు. అయితే ఒక్కరు కూడ నోరు మెదపలేదు.

(సశేషం)




# తిరుమల చరితామృతం

147

(గత సంచిక తరువాయి)

ఈ కర్మఫలం భగవంతుడు సుఖదుఃఖాల రూపంలో ఇస్తాడు. సామాన్యంగా మనం అనుకుంటాం, ఈ పాపపుణ్యాలు బ్యాంకు ఖాతాల్లాంటివని. చాలామంది పాపాలు చేసి, వాటిని ధార్మిక కార్యక్రమాలతోనో, దానాలతోనో కడిగివేసుకోవచ్చని, కొంత స్వామి హుండీలో వేస్తే పాప ప్రక్షాళన అయిపోతుందనీ అనుకుంటారు.

మన శాస్త్రం నిర్దిష్టంగా చెప్తోంది. పాపకర్మకు పాపఫలమే, పుణ్యకర్మకు పుణ్యఫలమే. విడివిడిగా రెండు అనుభవించాల్సిందే. పుణ్యం చేసి పాపం ఖాతా తగ్గించుకోలేం. పాపానికి దుఃఖం, పుణ్యానికి సుఖం. ఈ విషయంలో భగవంతుడు అందరినీ సమంగానే చూస్తాడు. అలా అయితే ఇంక భగవంతుడెందుకు? భక్తి ఎందుకు? దీనికి సమాధానం. స్వస్వరూప భగవత్ దర్శనంతో 'సంచిత' - అంటే ఎన్నో జన్మలుగా మనం సంపాదించి మూటలు కట్టి అనుభవించాల్సిన కర్మఫలం దగ్ధమవుతుందిట. ముందు జన్మలలో చేయబోయే పాపాలను మూటలు గట్టే కర్మగ్రంథులు కూడా దగ్ధమై - 'అగామి' కర్మఫలం కూడా ఉండదు. మిగిలేది ప్రారబ్ధమే.

ప్రారబ్ధం అనుభవించి తీరాల్సిందే. ప్రారబ్ధం ఇప్పుడు మనం అనుభవిస్తున్న కర్మఫలం. దానిని అర్థం చేసుకోవడానికి బ్రహ్మసూత్రాల్లో ఒక ఉదాహరణ ఇచ్చారు. రైతు పంట కోసి, నూర్చి, బస్తాల్లో నింపుతాడు. క్రిందటి ఏటి పంట, ఈనాటి పంట అన్ని బస్తాలూ 'సంచిత'మైతే, అతను అనుభవించడానికి ఒక బస్తా విప్పి అందులో రోజుకు కొంత అనుభవిస్తాడు అదీ. ఆ విప్పిన బస్తా 'ప్రారబ్ధం' అనుకోవచ్చు. ఈ మధ్యనే బస్తా విప్పితే ఇంకా బస్తా అంతా అనుభవించాలి వేల జన్మలలో. చాలాకాలం కింద విప్పితే మిగిలిన కొన్ని జన్మల్లో అనుభవించాలి. ఒక బస్తాలో కొన్ని వందల/ వేల జన్మలకు సరిపడే కర్మఫలం ఉండవచ్చు. ప్రస్తుత జన్మలో పుట్టటం కర్మఫలం అనుభవించడానికే... ఖర్చుపెట్టడానికి తెచ్చిన కర్మఫలం ఈ జన్మలో ఖర్చుపెట్టే లోపల, కోట్ల జన్మలెత్తినా క్షయం చేయలేనంత కర్మఫలం మళ్లీ మూటలు కడతాడా జీవి.


కీ.శే. పివిఆర్కె ప్రసాద్

శాస్త్రం ప్రకారం చాలా ధర్మిష్ఠి, నిష్ఠాపరుడు, సాత్త్వికుడు, భగవద్భక్తుడు- సర్వసమర్పణ బుద్ధికలవాడైనా ఆ జీవి ప్రతి రోజూ కనీసం పది జన్మలెత్తినా ఖర్చు పెట్టలేనంత కర్మఫలం సంపాదించి మూటలు కడతాడట. సామాన్యులం- మన సంగతి చెప్పనక్కరలేదు. ఇలా అయితే జన్మలనెత్తి కర్మఫలం అనుభవించి క్షయం చేయడం మన శక్తికి మించిన పని. భగవంతుని అనుగ్రహంతోనే ఇది సాధ్యం. భగవంతుని మహత్త్వ జ్ఞానంతో వచ్చిన భక్తితో సర్వసమర్పణ చేసి, దాసోహబుద్ధితో కర్మ చేస్తే ఏదో ఒక నాటికి భగవదనుగ్రహం తప్పక కలుగు తుంది. అనుగ్రహంతో సంచిత/ఆగాములు పోతాయి ఇది శాస్త్రం.

తిరుమల కొండమీద సాక్షాత్తూ మోక్షాన్నిచ్చే వాసుదేవ

నారాయణుడే శ్రీనివాసునిగా నిల్చుని ఉన్నాడు. వచ్చి దర్శనం చేసుకొన్న వారికి లేదా తను దర్శనమిచ్చిన వారికి పాపప్రక్షాళన చేస్తానని సంకల్పం చేసి బ్రహ్మదేవునికి మాటిచ్చాడు. కలి యుగాంతం వరకూ తిరుమలలో స్వామి ఉండేది భక్తులను అనుగ్రహించి వారి పాపాలను ప్రక్షాళన చేయడానికే. పాపకర్మలుంటేనే గదా దుఃఖం. దుఃఖం లేకుండా ఉండాలంటే పాపాలు పోవాలి.

యాత్ర చేయాల్సింది భక్తితో. చేసిన పాపాలకు పశ్చాత్తాపంతో గోవిందనామస్మరణ చేస్తూ కొండకు రావాలి. మనం భగవంతుని, ఎంతసేపు చూశామన్నది, మనం ఎంత భగవంతుని హుండీలో వేశామన్నది కాదు ముఖ్యం. ఎంతటి భక్తితో వేశాం, ఎంతటి ఆర్తితో దర్శనం చేసుకొన్నాం! చేసిన పాపాలకు పశ్చాత్తాపం ఉందా? ప్రాయశ్చిత్తం చేసుకుందానే యాత్ర చేస్తున్నామా?- అన్నది ముఖ్యం.



అనవసర ఆలోచనలతో, అంతులేని కోరికలతో భగవంతుని ముందు లక్షలు ఖర్చుపెట్టి, గంటసేపు కూర్చుని అభిషేకం చూసినంత మాత్రాన అతను గొప్ప భక్తుడై పోతాడనీ, లఘుదర్శనంలో గుంపులో తోయబడి, ఒక్క కనురెప్పపాటు కాలం మాత్రమే దూరం నుంచి భగవంతుని చూసిన భక్తుని కన్నా అతను గొప్ప అనీ అనుకోవడం పొరపాటు. ఇక్కడ మనం భగవంతుని చూశామన్న దానికంటే భగవం తుని కరుణాదృష్టి మనపై పడిందా అన్నది ముఖ్యం.

ఒక్కక్షణం భగవంతుని దృష్టి మనపై పడితే చాలు, సర్వపాపనాశనం కావడానికి. ఈ శక్తి భగవంతుని దృష్టికి ఉంది. ఇది అర్థం చేసుకోవాలంటే తొండమానుడు, కుమ్మరి భీమల జీవితాలే నిదర్శనం. అదివరకే చెప్పుకొన్నాం, ఆలయం కట్టించి బ్రహ్మోత్సవాలు, ఇతర సేవలు ఆరంభించి ఎన్నో వాహనాలు, నైవేద్యాలు ఏర్పాటుచేసి, స్వయంగా శ్రీనివాసుడికి ప్రతిరోజూ బంగారుపూలతో అర్చన చేసే తొండమాను చక్రవర్తి కన్నా, తన గుడిసెలో మట్టిపూలతో, ఆర్తితో, భక్తితో అర్చన చేసే కురువరపు నంబి కుమ్మరదాసుడైన భీముని భక్తికి భగవంతుడు ప్రాధాన్యం ఇచ్చి, భీమునికి వెంటనే మోక్షాన్నిచ్చి చక్రవర్తికి 'నీకీ జన్మలో మోక్షం లే'దన్నాడు. "నీ కర్మ వచ్చే జన్మలో పూర్తవుతుంది. వచ్చే జన్మలోనే నీకు మోక్షం. అదీ సాయుజ్యం కాదు, సారూ ప్యమే"నని చెప్పాడు భగవంతుడు. ఈ సంఘటన జాగ్రత్తగా అర్థం చేసుకుంటే శ్రీనివాసుడు ఎవరి పక్షమో తెలుస్తోంది. ధనవంతుని పక్షమా/పేదవాని పక్షమా? రెండు కాదన్నది అర్థ మవుతుంది. భక్తుని పక్షం, ఎవరు భక్తి కలిగివుంటే వారి పక్షం.

ఈ శాస్త్ర సూక్ష్మం తెలుసుకొంటే తిరుమలలో ఎలా దర్శనం అయింది అన్న బాధ ఉండదు. వచ్చిన చిక్కల్లా దర్శనంతోనే. ఈ మధ్యకాలంలో లక్షలలో జనం రోజూ వస్తూండడంతో సావ కాశంగా భగవతుని సన్నిధానంలో నిలబడి తృప్తిగా చూసే అవ కాశం లేకుండా పోయింది. మనకి అవకాశం లేదనే బాధకన్నా కొందరికి అటువంటి అవకాశం ఉందన్న బాధ ఎక్కువ. ఎవ్వరికీ లేకపోతే చిక్కేలేదు.

అందరికీ కులశేఖర పడి దాకా స్వామి వారి దగ్గరగా కొంచెం సేపు స్థిమితంగా నిలబడి, వీలైతే కూర్చొని దర్శనం చేసు కోవాలని ఉంటుంది. కాని ఈ రోజుల్లో జయవిజయుల్ని దాటి బంగారు వాకిలి గుండా లోపలికి వెళ్లి కులశేఖరపడి దగ్గర ఉండి దర్శనం చేసుకునే భాగ్యం చాలా కొద్దిమందికే. ఉదయం సుప్రభాతసేవ టిక్కెట్లు కొన్నవారికీ, ఆ తర్వాత తోమాల సేవ టిక్కెట్లు కొన్నవారికీ, అటు తర్వాత అర్చన టిక్కెట్లు కొన్నవారికీ... ఇవికాక అభిషేకం. సహస్ర కలశాభిషేకం, అష్టదళ పద్మసేవ, తిరుప్పావడ సేవలు చేసినవారికి మాత్రమే ఈ అవకాశం...

అందులోనూ ముఖ్యంగా అభిషేకం, అర్చన, తోమాల, అష్టదళ పద్మసేవ చేసే వారికి, సేవ జరిగినప్పుడు స్వామివారి ఎదుట అరగంటో, ముప్పావుగంటో సేవ జరుగుతున్నప్పుడు... కూర్చొని చూసే అవకాశం ఉంది. అదే సహస్ర కలశాభిషేకం, తిరుప్పావడ సేవాదారులు, అరగంటో, గంటో కూర్చున్నా, అది బంగారు వాకిలి లోనే కాని లోపల కాదు. కాని సేవ తర్వాత లోపలికి వెళ్లి స్వామివారి దర్శనం చేసుకొనే అవకాశం ఉంది.

ఈ సేవలన్నీ ఆలయంలో నేరుగా మూలవరులకే. అదివరకు ఈ సేవ జరిగేటప్పుడు భక్తులను బంగారువాకిలిలో గరుడాళ్వార్ దాకా కూర్చోపెట్టి చేసేవారు. కనుక దాదాపు 250, 399 మందికి ఒక్కొక్క సేవలో పాల్గొనే అవకాశం ఉండేది. సామాన్యభక్తులకు సమయం చాలడం లేదని, పోయిన సంవత్సరం నుండీ ఈ సేవాదార్లను స్నపన మండపం శయన మండపంలో కూర్చోపెట్టి, సేవ జరిగేటప్పుడు బంగారు వాకిలి దాకా లైను నడపడం (మహాలఘుదర్శనం) మొదలుపెట్టారు. దీనితో కూర్చొని సేవ చూసేవారి సంఖ్య ఒక్కో సేవకి 100 మందికి పరిమితం అయింది. అలా చేయడం వలన అదివరకు

కూర్చొని చూసేవారు 150/200 మంది తగ్గిపోయినా, లైనులో వచ్చిన దర్శనం చేసుకొనేవారు ఆ సమయంలో 2000 నుండి మూడువేల వరకూ పెరిగింది. భక్తులను తేవడం కూర్చోబెట్టడం, దాని కోసం లోపల లైన్లు బల్లలు, బారికేడ్లు, తాళ్లు అమర్చడంలో కాలం వృథా అవుతోందని వారంలో సగం రోజులు ఈ సేవలను కూడా సర్కారు సేవ చేసి, ధర్మదర్శనానికి సానుకూలం చేశారు. చాలాకాలం నుండి మధ్యాహ్నం అర్చన, సాయంకాలం తోమాల అర్చన, సర్కారు సేవ చేసి ధర్మదర్శనం నడుపుతున్నారు.

**ఐశ్వర్యారాయ్, రజనీకాంత్, టెండూల్కర్... వీళ్లు వి.ఐ.పి.లా?**

ఈ ఆర్జిత సేవలు కాక ధర్మదర్శనం మొదలు పెట్టేముందు ఉదయం, సాయంత్రం కొంతమంది ప్రముఖులకు ప్రత్యేకంగా దర్శనం ఏర్పాటుచేస్తారు. దీన్నే వి.ఐ.పి బ్రేకు దర్శనం అంటారు.

సాధారణంగా దేశ పరిపాలకులు, కేంద్రం, రాష్ట్రం నుండి వచ్చేవారు- అంటే రాష్ట్రపతి, ప్రధాని, కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, సీనియర్ అధికారులు, జడ్జీలు, పార్లమెంటు, శాసనసభ సభ్యులు వంటి వారికి ఈ అవకాశం. వారు కాక కార్యనిర్వహణాధికారి - దేవస్థానానికి సహాయకారులుగా ఉండేవారికి, మఠాధిపతులు, పీఠాధిపతులు, వివిధ రకాల దేవస్థానాల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు పెద్దమొత్తంలో విరాళాలు ఇచ్చిన దాతలకు ప్రత్యేక దర్శన భాగ్యం కల్గించే అవకాశం ఉంది.

ఎలా చూసినా, ఇలా ప్రత్యేకంగా కులశేఖరపడి దాకా- అంటే స్వామివారి దగ్గర దాకా వెళ్లి దర్శనం చేసుకొనేవారు రోజుకు అన్ని సేవలు, ప్రత్యేక దర్శనాలతో సహా రెండు వేల మంది దాకా ఉంటారు. వీరిని నియంత్రించడానికి సెలవుదినాల్లో, పర్వదినాల్లో పండుగ దినాల్లో యాత్రికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది కనుక ఉదయం, సాయంత్రం కాకుండా ఒక్క ఉదయానికే బ్రేకు దర్శనం కుదించారు. ఇలా దర్శనానికి ప్రత్యేకంగా వచ్చే వారందరూ కూడా డబ్బు చెల్లించే దర్శనం చేసుకోవాలి. కనుక అధికారులు మాత్రమే కాదు, వీరందరూ కూడా ధనికుల కింద లెక్క. అందులోనూ ఆర్జిత సేవకు రుసుం చెల్లించేవారు వి.ఐ.పిలుగా వస్తే అసలుకి రెండింతలు రుసుము చెల్లించాలి. బ్రేకు దర్శనం విషయాలలోనూ అంతే. ప్రతి భక్తుడు 500 రూపాయల రుసుము చెల్లించాలి.

ఇలా దర్శనం చేసుకొనే ప్రముఖులలో చాలామంది దేవస్థానం వారి రకరకాల పథకాలు, అన్నదానం, ఆరోగ్యదానం, నగల సమర్పణ, వేద రక్షణ, సంక్షేమ కార్యక్రమాలు, విద్యా కార్యక్రమాలు... ఇటువంటి పథకాలలో లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చినవారున్నారు. వారికి ప్రతి సంవత్సరం వారు



కోరుకున్న ఒక్క రోజున దర్శనం ఏర్పాటు చేసే వెసులుబాటు దేవస్థానం వారు కలుగజేశారు.

ఈ మధ్య కాలంలో ఈ అవకాశం సామాన్యభక్తులకు అందుబాటులో ఉండాలని పలుచోట్ల స్వామివారి కౌంటర్లలో ముందుగా రిజర్వేషన్లు చేసుకొనే అవకాశం కొంతవరకు, అలా దొరకని వారికి సేవకు ఒక రోజు ముందు కొన్ని టిక్కెట్లు, తిరుమలలో ఎవరు ముందు వస్తే వారికి ఏర్పాటు, అదీకాక ఇంకా మిగిలిన ఖాళీలలో చాలామటుకు యాత్రికులకు లాటరీ పద్ధతిలో అవకాశం కల్పించే ఏర్పాటు... ఇలా చాలావరకు సామాన్యభక్తులకు సావకాశం కల్పించడానికి దేవస్థానం ప్రయత్నాలు చేస్తూనే ఉంది.

అయినా దేవస్థానం మీద విమర్శలు, ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. చివరి నిమిషంలో వచ్చే వి.ఐ.పి.లకు, ఇతర ప్రముఖులకు వెసులుబాటు చేయాలి కదా! అవి కార్యనిర్వహణాధికారి, లేదా జాయింటు కార్యనిర్వహణాధికారి పరిధిలో జరుగుతాయి. వారికి ఇటువంటి వెసులుబాటు ఎందుకివ్వాలి అన్నది విమర్శ. దీని విషయంలో చాలా చర్చ జరుగుతోంది. హైకోర్టులో ప్రజాసంబంధిత వ్యాజ్యాలు కూడా వేయడం జరిగింది.

ఈ చర్చలకు కొంత ముఖ్యకారణం మీడియా. దేశంలో ఉన్న చాలా ప్రసార మాధ్యమాలకు తిరుమల తిరుపతిలో విలేఖరులున్నారు. టీవీ ఛానల్స్ వారి ఎన్నో కెమెరాలు తిరుమలలో ఏమి జరిగినా చూపడానికి సిద్ధం. మంచి చూపిస్తే ఆకర్షణ తక్కువ. లోపం జరిగిందనో, ఎవరికైనా ఇబ్బంది కల్గిందనో చూపిస్తే జనం ఆసక్తితో చూస్తారు.


(సశేషం)

(తిరుమల చరితామృతం పుస్తకం నుంచి)

అరణ్య కాండ



‘ఆంధ్ర వాల్మీకి’
**వాసుదాసస్వామి**
(వావిలికొలను సుబ్బారావు)
విరచిత
# ‘మందర-మకరందం’






అనువక్త-వాచవి
వనం జ్వాలా నరసింహారావు

## సర్గ-3
(గత సంచిక తరువాయి)

విరాధుడు చెప్పిన మాటలకు కోపగించిన శ్రీరామచంద్రుడు, “ఓరీ! నీచ రాక్షసుడా! దుష్టుడా! నీ అంతట నువ్వే చావును వెతుక్కుంటూ వచ్చావు. నా ఎదురుగా నిలబడి మరల బతికి పోతావా?” అంటూ బాణం ఎక్కుపెట్టాడు. పదునైన బాణాలను రాక్షసుడిమీద వేశాడు. రాముడు ఏడు బాణాలను విరాధుడి రొమ్ము దూర్పోయే విధంగా వేయగా, అవి కొండ లాంటి వాడి దేహాన్ని చీల్చి, ఎర్రగా మారిపోయి, భూమిలోకి పోయాయి. బాణాల తాకిడి బాధను సహించలేని విరాధుడు జానకి నేల మీద వదిలి, శూలం తీసుకుని రామలక్ష్మణులను సమీపించాడు. రామలక్ష్మణులిరువురూ ఆ రాక్షసుడి మీద పదునైన బాణాలను వర్షంలాగా కురిపించారు. వారు వేసిన బాణాలను చూసిన విరాధుడు, ఈ బాణాలు తననేమీ చేయలేవని నవ్వి, తన భయంకరమైన శరీరాన్ని పెంచాడు. దేహంలో నాటుకుని పోయిన బాణాలన్నీ నేలరాలాయి. శ్రీరామచంద్రమూర్తి మరి కొన్ని బాణాలను వేశాడు. శ్రీరామలక్ష్మణులు వేస్తున్న పదునైన అబాణాలను చూసి రాక్షసుడు నవ్వాడు. వాళ్లూ వదలకుండా వీడిపై బాణాలు వేయసాగారు. వాటివల్ల బాగా బాధకలిగిన విరాధుడు, ప్రాణాలను బిగపట్టుకుని, రామలక్ష్మణులపై వజ్ర సమానమైన శూలాన్ని విసిరాడు. మండుతూ వస్తున్న ఆశూలాన్ని చూసి శ్రీరాముడు దాన్ని రెండు బాణాలతో నరికాడు. భూమి కంపించే విధంగా అది నేలరాలింది. వాడి శూలం విరగగానే, రామలక్ష్మణు లిద్దరూ వాడి మీద దూకారు. దూకి తమ కత్తులతో వాడిని కొట్టారు. అప్పుడా రాక్షసుడు వాళ్లిద్దరినీ ఎత్తుకుని ఆకాశంలో పరుగెత్తాడు. అడవి మధ్యలోకి వాళ్లను తీసుకుని వెళ్లి తమను చంపాలన్న వాడి కోరికను గ్రహించాడు శ్రీరాముడు. వాడు ఎక్కడికి తీసుకునిపోతే అక్కడికే పోదామనీ, అదే మన మార్గమనీ శ్రీరాముడు లక్ష్మణుడితో అన్నాడు.

## సర్గ-4
### శ్రీరాముడికి తన శాపాన్ని గురించి చెప్పిన విరాధుడు

చంటి పిల్లను ఎత్తుకున్న విధంగా రామలక్ష్మణులను భుజాలమీద ఎత్తుకుని అడవిలో పోతున్న ఆ విధానం చూసిన సీతకు భయం కలిగింది. గట్టిగా, ఇలా జరిగింది కదా అని ఏడ్చింది. అప్పుడు సీతాదేవి ఇలా అంటుంది: “దానవోత్తముడా! నన్ను ఒంటరిగా విడిచి వారిద్దరినీ తీసుకొనిపోతే నన్ను ఇక్కడ పెద్ద పులులు, తోడేళ్లు, చిరుతపులులు మింగుతాయి. కాబట్టి వాళ్లను వదిలి నన్ను తీసుకొని పోయి చంపు. అలా అయితే వాళ్లు సుఖంగా జీవిస్తారు. వాళ్లు లేకుండా నేనున్నా చచ్చిన దానితో సమానమే. కాబట్టి నీకు నమస్కారం చేస్తా....వాళ్లను విడిచి పెట్టు”. సీత ఈ ఏడుపు మాటలు విన్న శ్రీరామలక్ష్మ

ణులు రాక్షసుడిని చంపడానికి తొందరపడసాగారు. విరాధుడి కుడి భుజమందున్న లక్ష్మణుడు వాడి ఎడమ చేతిని, ఎడమ భుజాన వున్న శ్రీరాముడు వాడి కుడిచేతిని నరికారు. విరాధుడు ఆయుఅధాలతో చచ్చేవాడు కాదు. చేతులు లేనివాడయ్యాడు. కాబట్టి వాడిని మోచేతులతో, మోకాళ్లతో గుద్ది, పైకెత్తి కింద పడేశారు. కత్తులతో నరికినా, బాణాలతో గుచ్చినా, నేలమీద వేసి గుద్దినా, చావని ఆ కఠిన రాక్షసుడిని చూసిన శ్రీరాముడు లక్ష్మణుడితో, వీడిని ఒక గుంట తీసి పూడుద్దామన్నాడు. ఇది విన్న విరాధుడు, రాముడితో, తాను ఆయన చేతిలో చచ్చిపోయాననీ, అజ్ఞానం వల్ల ఆయన ఎవరైందీ తెలుసుకోలేక పోయాననీ, అని తన శాప విషయాన్ని గురించి చెప్పాడు.

విరాధుడిలా అన్నాడు: ''కౌసల్యానందనా! కరుణాస్వరూప! శ్రీరామచంద్రా! తండ్రీ! మీరెవరో ఇప్పుడు తెలుసుకున్నా. శ్రీరాముడివి నీవు... అవతార మూర్తైన భవంతుడవని, సీతాదేవి లక్ష్మి అని తెలుసుకొంటిని. నేను పూర్వం తుంబురుడనే గంధర్వుడిని. రంభతో కూడి కామావేశాన మర్యాద తప్పి సంచరిస్తుంటే కుబేరుడు నన్ను రాక్షసుడివి కమ్మని శపించాడు. శాపం తొలగే ఉపాయం కూడా ఆయనే చెప్పాడు. దశరథ కుమారుడు శ్రీరాముడు ఎప్పుడు నన్ను చంపుతాడో అప్పుడు నాకు రాక్షసత్వం పోతుందని, గంధర్వ రూపం వస్తుందని అన్నాడు. శ్రీరఘురామచంద్రమూర్తీ! నీ కరుణవల్ల భయంకర మైన శాప బాధ తొలగింది. మీ దర్శనం వల్ల కృతకృత్యుడ నయ్యాను. స్వర్గానికి పోతాను. దయ చేసి ఆజ్ఞ ఇవ్వు. మీకు మేలు కలుగుగాక! ఈ దారిలో ఒకటిన్నర ఆమడ దూరం పోయాక అక్కడ సూర్యతేజుడైన శరభంగ మహర్షి వున్నాడు. ఆయన్ను మీరు దర్శించండి. మేలు కలుగుతుంది. నన్ను పూడ్చి వేయండి. ఆ తరువాత అక్కడికి పొండి శ్రీరామచంద్రమూర్తీ! లక్ష్మనా! ఏనుగును పూడ్చడానికి ఎంత గుంట తవ్వుతారో అంతది తవ్వండి'' అన్నాడు. వెంటనే చనిపోయాడు.

శ్రీరామచంద్రమూర్తి చెప్పిన విధంగా లక్ష్మణుడు విరాధుడిన దేహం పక్కనే వెంటనే ఒక గుంత తవ్వాడు. శ్రీరామలక్ష్మణులు కల్సి వాడి శరీరాన్ని ఆ గుంటలో వేశారు. ఇంకా ప్రాణంతో వున్న విరాధుడు, శ్రీరామలక్ష్మణులు బలవంతంగా గుంతలో పడేయగానే, భయంకరమైన ధ్వని చేస్తూ, దాంట్లో పొర్లాడు. వాడిని పిడికి పోటులతో చంపారు రామలక్ష్మణులు. ఊపిరితో పూడ్చరాదు కాబట్టి చంపి మరీ పూడ్చారు. శ్రీరామలక్ష్మణులు విరాధుడిని ఈ విధంగా చంపి, సంతోషించి, ఆ గోతిని పెఅద్ద రాయితో పూడ్చారు. ఇలా చేసి, దూరంగా వుంచిన వారి బాణాలను మరల తీసుకుని, సీతాదేవి దగ్గరకు పోయి, అడవిలో చంద్రడు సూర్యుడులాగా ప్రకాశించారు.



## సర్గ-5
## శరభంగాశ్రమానికి పోయిన సీతారామలక్ష్మణులు

భయంతో-శోకంతో ఖిన్నురాలై వున్న సీతాదేవిని ఓదార్చిన శ్రీరాముడు, తమ్ముడు లక్ష్మణిడితో శరభంగాశ్రమానికి పోవడానికి దారి బాగు చేయమని అంటాడు. అక్కడికి పోయి మహాత్ముడైన వాడిని, దేవ-గంధర్వులు, సిద్ధులు, గొప్ప ఋషులు స్తోత్రం చేసేవాడిని, విశేష బ్రహ్మ తేజస్సు గల శరభంగుండితో సంభాషిస్తున్న ఇంద్రుడిని చూశారు సీతారామ లక్ష్మణులు. అప్పుడు లక్ష్మణుడితో శ్రీరాముడిలా అన్నాడు: ''ప్రకాశిస్తున్న కాంతిగల ఇంద్రుడిని చూశవా? లక్ష్మణా నువ్విక్కడే సీత దగ్గర వుండు. ఆ ఇంద్రుడి వృత్తాంతం, ఆయన ఇక్కడికి ఎందుకు వచ్చాడో తెలుసుకొని వస్తా'' అని ముని ఆశ్రమానికి చేరబోయాడు. శ్రీరాముడు రావడం చూసిన ఇంద్రుడు, శరభంగుండితో రహస్యంగా, శ్రీరామచంద్రుడు తనను చూడడానికి వస్తున్నాడనీ, ఆయన్ను తానిప్పుడు చూడ కూడదనీ అంటాడు. శ్రీరాముడు చేయాల్సిన అసాధ్య కార్యం, రావణాధికం ముందున్నదనీ, అది చేయనివ్వాలనీ, అది ఇతరులు చేయలేనిదనీ, దాంట్లో విజయం సాధించిన తరువాత-కీర్తి పొందిన తరువాత, తానే ఆయన్ను సమీపించి సంభాషిస్తాననీ చెప్పి ఇంద్రుడు రతం ఎక్కి ఆకాశానికి పోయాడు. అలా ఇంద్రుడు పోగానే, వెనక్కు తిరిగి వచ్చిన శ్రీరామచంద్రమూర్తి, సీతాలక్ష్మణులను కలిసి, వారితో సహా అగ్నిహోత్రంతో ప్రకాశిస్తున్న శరభంగ మహర్షిని భక్తితో సమీపించాడు. చేరి ఆయన పాదాలకు శిరస్సు వంచి మొక్కాడు. మొక్కి ముగ్గురూ నిలుచున్నారు. వారికి ఆసనానికి తగిన పీటలను అమర్చారు ముని. వారు కూర్చొనిన తరువాత, శ్రీరామచంద్రమూర్తి ఇంద్రుడు అక్కడకు రావడానికి కారణం ఏంటని శరభంగుండిని అడిగాడు. జవాబుగా శరభంగుండు ఇలా చెప్పాడు. **(మిగతా 47వ పేజీలో)**



# క్షయ సంవత్సరం బార్హస్పత్యమానం



(గత సంచిక తరువాయి)

మధ్యమగణనయా గురుప్రవేశో యస్మింశ్చంద్రవత్సరేనవిద్యతే సోయమధి సంవత్సరః, తత్ర బృహస్పతి సవనాదికం కార్యం, స్ఫుటగణనయా బృహస్పతిప్రవేశ రహితో యశ్చంద్ర వత్సరస్తస్మిన్నధిమాసవత్కామ్యాదికం వర్జ్యమితి కేచిన్మహర్షయో మన్యంత ఇత్యర్థః, అనేనైవాభిప్రాయేణ స్మృత్యంతరేపి,

శ్లో॥ గురోర్మధ్యమరాశేస్తు ప్రవేశో యత్ర వత్సరే, హీనస్తత్రాధికశ్చాంద్రే వర్షేకుర్యాన్న శోభనం,

ఏవం స్ఫుటేజ్యగమనాత్స్ఫుటాఖ్యశ్చాధివత్సర ॥

ఇతి. అత్రాధి సంవత్సర దర్శనాత్ క్షయసంవత్సరోప్యస్తీత్యవ గమ్యతే అత ఏవోక్తం తత్రైవ

శ్లో॥ రాశిద్వయ ప్రవేశస్యాద్గురోర్యత్రేందువత్సరే ।

క్షయాబ్దస్తత్ర శుద్ధే చ శుభకర్మ న కారయేత్ ॥

గురోః మధ్యమ సంక్రాంతి హీనః ।

యః చంద్రవత్సరః..

తస్మిన్ అధిసంవత్సరః గురువు యొక్క మధ్యమ గతి ప్రవేశం (ఒక రాశి నుండి మరొక రాశికి) లేనటువంటి, ఏ చాంద్రమాన సంవత్సరం (ఉగాది నుండి ఉగాది మధ్య కాలం) ఉందో...

దానిని 'అధి సంవత్సరం' (అదనపు సంవత్సరం) అంటారు.

సవనత్రయమ్ కారయేత్ ఆ సంవత్సరంలో మూడు సవన ములు (విశేష స్నానాలు లేదా శాంతి కర్మలు) చేయాలి.

ప్రతిష్ఠాః సవనాదికాః.. ప్రయత్నేన వర్జనీయాః.. విగ్రహ ప్రతిష్ఠలు, యజ్ఞాలు మొదలైన శుభకార్యాలను.. ప్రయత్న పూర్వకంగా వదిలిపెట్టాలి (చేయకూడదు).

స్ఫుట సంక్రాంతి హీనః చేత్..

అధిమాసవత్ ఆహుః దానిని 'అధిక మాసం' వలె (అంటే అధిక మాసంలో ఏవి చేయకూడదో అవి చేయకూడదు అని) పెద్దలు చెబుతారు.

**"స్మృత్యంతరేపి... గురోర్మధ్యమరాశేస్తు ప్రవేశో యత్ర వత్సరే, హీనస్తత్రాధికశ్చాంద్రే వర్షేకుర్యాన్న శోభనం"**

స్మృత్యంతరేపిః వేరొక స్మృతి గ్రంథంలో కూడా (ఈ విధంగా చెప్పబడింది). యత్ర వత్సరేః ఏ సంవత్సరంలో అయితే. గురోః మధ్యమ రాశేః తు ప్రవేశః గురువు యొక్క మధ్యమ గతి రీత్యా రాశి ప్రవేశం జరుగుతుందో.

హీనః తత్రః అక్కడ (ఆ రాశి భోగ కాలం) తక్కువగా ఉండి (లేదా వ్యత్యాసం ఉండి). అధికః చాంద్రేః అది చాంద్రమాన రీత్యా 'అధిక' సంవత్సరం అవుతుంది. కుర్యాత్ న శోభనంః (అటువంటి అధిక సంవత్సరంలో) శుభకార్యాలు చేయకూడదు.

వివరణ: గురువు మధ్యమ గతి ద్వారా లెక్కించినప్పుడు, కాల గణనలో వచ్చే తేడా వల్ల ఒక సంవత్సరం 'అధిక సంవత్సరం'గా వస్తుంది. అటువంటి సమయంలో శుభకార్యాలు నిషేధించబడ్డాయి.

స్ఫుట గతి మరియు క్షయ సంవత్సరం:

''ఏవం స్ఫుటేజ్యగమనాత్స్ఫుటాఖ్యశ్చాధివత్సర ॥ ఇతి. అత్రాధి సంవత్సర దర్శనాత్ క్షయసంవత్సరోప్యస్తీత్యవగమ్యతే''

ఏవం: ఇదే విధంగా. స్ఫుట ఇజ్య గమనాత్: గురువు యొక్క 'స్ఫుట' నిజగతిని బట్టి. స్ఫుటాఖ్యః చ అధివత్సరః ఇతి: 'స్ఫుట' అనే పేరు గల అధిక సంవత్సరం కూడా ఉంటుంది. అని అర్థం. అత్ర అధిసంవత్సర దర్శనాత్: ఇక్కడ 'అధిక' సంవత్సరాలు కనిపిస్తున్నాయి కాబట్టి. క్షయ సంవత్సరోపి అస్తి ఇతి అవగమ్యతే: 'క్షయ' (తగ్గిపోయే) సంవత్సరం కూడా ఉంటుందని అర్థం చేసుకోవాలి.

వివరణ: మధ్యమ గతితోనే కాకుండా, స్ఫుట గతి (నిజమైన గ్రహ సంచారం) ద్వారా కూడా అధిక సంవత్సరాలు వస్తాయి. గణితంలో 'అధికం' ఉన్నప్పుడు, దాన్ని సరిచేయడానికి ఎప్పుడో ఒకప్పుడు 'క్షయం' ఉండాలి కదా? అందుకే క్షయ సంవత్సరాలు కూడా ఉంటాయని సిద్ధాంతం.

క్షయ సంవత్సరముఖ్య లక్షణం - ఇది చాలా కీలకమైన శ్లోకం. క్షయ సంవత్సరం ఎప్పుడు ఏర్పడుతుందో ఇది నిర్వచిస్తోంది." అత ఏవోక్తం తత్రైవ - రాశిద్వయ ప్రవేశస్యా ద్గురోర్యత్రేందువత్సరే । క్షయాబ్దస్తత్ర శుద్ధే చ శుభకర్మ న కారయేత్ ॥"

అత ఏవ ఉక్తం తత్రైవః అందుకే, అదే గ్రంథంలో ఇలా చెప్పబడింది.యత్ర ఇందు వత్సరేః ఏ చాంద్రమాన సంవత్సరంలోనైతే (చైత్రం నుండి ఫాల్గుణం లోపు). గురోః: గురువు యొక్క. రాశి ద్వయ ప్రవేశః స్యాత్: రెండు రాశులలో ప్రవేశం జరుగుతుందో (అతిచార గతి వల్ల కావచ్చు లేదా సంవత్సర కాలం ఎక్కువగా ఉండటం వల్ల కావచ్చు). తత్ర క్షయాబ్దః: అది 'క్షయ సంవత్సరం' అవుతుంది. శుద్ధే చః (మాసాలు మొదలైనవి) శుద్ధంగా ఉన్నప్పటికీ. శుభకర్మ న కారయేత్: ఆ సంవత్సరంలో శుభకార్యాలు (వివాహాదులు) చేయించకూడదు.



వివరణ: ఒకే చాంద్రమాన సంవత్సరంలో (ఉదాహరణకు ఒక ప్రభవ నామ సంవత్సరంలో) గురువు ఒక రాశి నుండి మరొక రాశికి, అక్కడి నుండి ఇంకొక రాశికి (మొత్తం రెండు రాశి సంక్రమణాలు) జరిగితే, ఆ సంవత్సరాన్ని "క్షయ సంవత్సరం"అంటారు.

ఉదాహరణకు: గురువు మేషంలో ఉన్నప్పుడు సంవత్సరం మొదలై, ఆ సంవత్సరం ముగిసేలోపే గురువు వృషభాన్ని దాటి మిథునంలోకి ప్రవేశిస్తే (లేదా ఒక రాశిని పూర్తిగా దాటితే), ఆ సంవత్సరంలో రెండు గురు సంవత్సరాలు ఇమిడిపోయినట్లు లెక్క. అప్పుడు ఆ సంవత్సరం లుప్తమవుతుంది. అటువంటి క్షయ సంవత్సరాలు శుభకార్యాలకు పనికిరావు.

గమనిక: ఇది ఉత్తర భారతంలో పాటించే బార్హస్పత్య మానానికి (గురు రాశి మారితే సంవత్సరం మారే పద్ధతికి) వర్తిస్తుంది. దక్షిణాదిలో మనం పాటించే 60 ఏళ్ల చక్రానికి (సౌర-చాంద్ర మానం) ఈ క్షయ నియమం వర్తించదు.

లుప్త సంవత్సర దోషము:- శుభాశుభప్రకరణం 1.ముహూర్త చింతామణి

గోజాన్త్యకుమ్భేతరభేతిచారగో నో పూర్వరాశి గురురేతి వక్రితః । తదా విలుప్తాబ్దఇహాతినిన్దితఃశుభేషురేవా-సురనిమ్నగాన్తరే ॥ 53 ॥ అన్వయః - గోజాన్త్య కుమ్భేతరభే అతిచారగః గురుః వక్రితః (పునః) పూర్వరాశి నో ఏతి తదా లుప్తాబ్దః । ఇహ రేవాసురనిమ్నగాన్తరే శుభేషు అతినిన్దితః (స్యాత్) ॥ 53 ॥

మేష, వృషభ, కుంభ, మీన రాశులను వదలి మిగిలిన రాశులలో గురుడు అతిచారుడై (వర్తమానరాశిని వదలి) ముందు రాశికి వెళ్ళినపుడు, వక్రియై తిరిగి గత రాశిలోనికి రానపుడు గతరాశి సంబంధ సంవత్సరము లుప్తసంవత్సరమగును. లుప్త సంవత్సరము నర్మద, గంగానదుల మధ్యదేశములలో శుభకార్యములో అత్యంత నిందితమగును. అనగా గంగా నర్మదా నదుల మధ్యప్రదేశములు వదలి మిగిలిన ప్రదేశములలో దోషముండదు. మేష, వృషభ, కుంభ, మీనరాశులలో అతిచార, లేక లుప్తసంవత్సర దోషముండదు.

నిర్ణయ సింధువు: (మూ॥ తత్ర చాంద్రోబ్దః షష్టి భేదః తదాహగర్గః) యద్యపి జ్యోతిషే గురోః మధ్యమరాశి భోగేన, ప్రభవాదీనాం మాఘాదౌ ప్రవృత్తి రుక్తా, తథాపి ప్రభవాదీనాం చాంద్రత్వమప్యస్తి. చాంద్రాణాం ప్రభవాదీనాం పంచకే పంచకేయుగే" ఇతి మాధవోక్తేః, తేన చాంద్రః ప్రభవాదిః చైత్రసితే ప్రవర్తతే, బార్హస్పత్యస్తు మాఘాదౌ. తయోర్వి నియోగః జ్యోతిర్నిబంధే, బ్రహ్మసిద్ధాంతేః. వ్యావహారిక సంజ్ఞోయం కాలః స్మృత్యాది కర్మసు -యోజ్యః సర్వత్ర తత్రాపి జైవోవా నర్మదోత్తరే॥


ఆర్ష్టి షేణః :- స్మరేత్ సర్వత్ర కర్మాదౌ చాంద్ర సంవత్సరం సదా, నాన్యం యస్మాద్వత్సరాదౌ ప్రవృత్తి సస్యకీర్తితా॥ ఇతి.

యద్యపి జ్యోతిషే గురోః మధ్యమరాశి భోగేన జ్యోతిష శాస్త్రంలో గురువు యొక్క 'మధ్యమ రాశి భోగాన్ని' అనుసరించి, ప్రభవాదీనాం మాఘాదౌ ప్రవృత్తి రుక్తా ప్రభవ మొదలైన సంవత్సరాల ప్రవృత్తి (ఆరంభం) 'మాఘ' మాసంలో ఉంటుందని చెప్పినప్పటికీ, తథాపి ప్రభవాదీనాం చాంద్రత్వమప్యస్తి అయినప్పటికీ, ప్రభవాది సంవత్సరాలకు 'చాంద్రత్వము' (చాంద్రమానం) కూడా ఉంది.

చాంద్రాణాం ప్రభవాదీనాం పంచకే పంచకే యుగే ఇతి మాధవోక్తేః "చాంద్రమాన ప్రభవాది సంవత్సరాలకు ఐదేసి సంవత్సరాలకొక యుగం ఉంటుంది" అని మాధవాచార్యులు చెప్పిన ప్రమాణం వల్ల (వీటికి చాంద్రమాన లక్షణం ఉంది).

తేన చాంద్రః ప్రభవాదిః చైత్రసితే ప్రవర్తతే ఆ కారణం చేత, చాంద్రమాన రీత్యా 'ప్రభవ' మొదలైన సంవత్సరాలు 'చైత్ర శుద్ధ పాడ్యమి' (ఉగాది) నాడు ప్రారంభమవుతాయి. (సశేషం)

# గురువునే పరీక్షించిన శిష్యుడు



ఒకసారి కంచి మహాస్వామి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారిని దర్శించడానికి శంకరన్ అనే ఒక బ్రహ్మచారి యువకుడు వచ్చాడు. వచ్చి మహాస్వామి వారికి నమస్కరించాడు. మహాస్వామివారు "ఏమిటి విశేషం? ఏ విశేషమూ లేకుండా నీవు రావు కదా?" అని అడిగారు. "నాకు ఒక సందేహం కలిగింది. ఆ సందేహ నివృత్తి కోసం తమ దగ్గరికి వచ్చాను" అన్నాడు శంకరన్. "అదేం అంత పెద్ద సందేహం?" అని అడిగారు మహాస్వామి.

"మంత్ర జపం సంబంధించిన ఒక సందేహం మహాస్వామీ" అన్నాడు శంకరన్. "మంత్ర జపం గురించి అంటే నీవు ఏదైనా మంత్ర జపం చేస్తున్నావా?" అని అడిగారు మహాస్వామి. తనకు మైసూర్ యజ్ఞనారాయణ ఘనపాఠి గారు మంత్రోపదేశం చేశారని చెప్పాడు శంకరన్. "ఏ మంత్రము?" అని అడిగారు మహాస్వామి. శంకరన్ జవాబు చెప్పేలోగా మహా స్వామి "మంత్రం రహస్యమైంది. అది చెప్పకూడదు. అది నీ దగ్గరే ఉండాలి. ఏ దేవతకు సంబంధించిన మంత్రం అని మాత్రం చెప్పు" అన్నారు. శంకరన్ "ఆంజనేయపరమైన మూల మంత్రం మహాస్వామీ!" అని చెప్పబోతుంటే "సరే! మూలమంత్రం చెప్పకు. నీకు నివృత్తి కావాల్సిన అనుమానం ఏమిటి?" అని అడిగారు మహాస్వామి. "నా ఇరవైమూడవ యేటి నుంచి ఆ మంత్రాన్ని ఏడేళ్లుగా జపిస్తున్నా మంత్రసిద్ధి జరిగిందా లేదా అనే సంగతి నాకు తెలియడం లేదు" అన్నాడు శంకరన్.

"ఇప్పుడు తెలుసుకుని ఏం చేస్తావు? అది సరే ... జపాన్ని కామ్యార్థంగా చేస్తున్నావా ఆత్మార్థంగా చేస్తున్నావా చెప్పు" అని అడిగారు మహాస్వామి. దానికి ఆ యువకుడు "ఆత్మార్థంగానే చేస్తున్నాను. అయినా మంత్రసిద్ధి జరిగి ఆ స్వామి కృప లభించిందా అని తెలియడం లేదు" అన్నాడు. వెంటనే మహాస్వామి "మంత్రసిద్ధి అయిందా లేదా అనే విషయాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకోవచ్చు," అన్నారు. కానీ యువకుడు సమాధానం పొందినట్లు లేదు. "నాకు అటువంటిదేమీ కాలేదు. గురువు గారు చెప్పినట్టుగా చేస్తున్నాను. కానీ చేస్తున్న జపానికి ఫలితం ఉందా లేదా అని కొంచెం బాధ కలుగుతున్నది. దీనికి ఏదైనా మార్గం ఉంటే చెప్పాలి! అన్నాడు శంకరన్.

మహాస్వామి కొన్ని క్షణాలు మౌనంగా ఉండి మాట్లాడడం మొదలుపెట్టారు. "చాలా ఏళ్ల ముందు శృంగేరి శ్రీ శారదా పీఠంలో శ్రీ నృసింహభారతీ స్వామివారు పీఠాధిపతిగా ఉండేవారు. ఒకనాడు ఆ ప్రాంతానికి చెందిన శిష్యుడు ఆ స్వామివారిని దర్శించడానికి వచ్చాడు. ఆ వచ్చినవారు నువ్వు నా దగ్గర అడిగిన ప్రశ్నను ఆ స్వామివారిని అడిగారు. అందుకు ఆ స్వామివారు "ఆత్మార్థంగా జపం చేస్తూ రా! జపం సిద్ధిస్తుంది" అని సమాధానం ఇచ్చారు. కానీ స్వామివారు చెప్పిన సమాధానం ఆ వ్యక్తికి తృప్తి కలిగించలేదు. "అది కాదు మంత్రం నాకు సిద్ధించిందా లేదా అనేది తెలుసుకోవాలి దానికి ఏదైనా దారి ఉంటే అనుగ్రహించాలి" అన్నాడు. అందుకు ఆ స్వామి "ప్రతి నిత్యమూ జపం ఒక చెక్క పలక మీద వడ్లు పరిచి ఆ మీద ఒక వస్త్రం వేసి ఆ వస్త్రం మీద కూర్చొని జపం చేస్తూ రా! జపం చేస్తున్నపుడు ఎప్పుడు ఆ వడ్లు పేలాలుగా పేలితే అప్పుడు నీ జపం సిద్ధించింది అని అర్థం" అన్నారు.

అది విని ఆ శిష్యుడు ఎవరూ ఎదురుచూడని ప్రశ్న అడిగాడు. 'గురునాథులు నన్ను క్షమించాలి. గురు స్థానంలో ఉన్న మిమ్మల్ని పరీక్షిస్తున్నాను అనుకోకూడదు' అన్నాడు.

శ్రీనృసింహ భారతీ స్వామి వారు తాము ఉన్న చోటికి ఒక చెక్క పలకను తీసుకురమ్మని చెప్పి దానిమీద వడ్లను పోయించి తమ వస్త్రం దాని మీద వేసి తూర్పు వైపుకు తిరిగి కూర్చొని కళ్లు మూసుకొన్నారు. ఏదో విశేషం జరగబోతున్నదని అక్కడ చాలా మంది గుమిగూడారు. కొన్ని క్షణాలు గడిచినవి.. అంతే ఆ చెక్క పలక మీద పటపటమనే శబ్దమూ దాంతోబాటు కొద్దిగా పొగ.. వడ్ల మీద పోసిన వస్త్రాన్ని తీశారు ఆ స్వామివారు. చెక్క పలక మీద వడ్లన్నీ పేలి పేలాలై తెల్లగా పరచినట్లున్న దృశ్యం చూసి అక్కడ గుమిగూడిన భక్త బృందం ఆశ్చర్యపోయింది! శ్రీనృసింహ భారతీ స్వామివారిని ప్రశ్న అడిగిన శిష్యుడు ఏడుస్తూ నిలబడి ఉన్నాడు! అక్కడ ఉన్న అందరూ ఆశ్చర్యంలో మునిగి పోయారు!'' అని ఆ వృత్తాంతాన్ని కంచి మహాస్వామి ముగించే టప్పటికీ ప్రశ్న అడిగిన శంకరన్ కళ్లలోనూ ధారపాతంగా నీరు.

శంకరన్ తమాయించుకొని “మహాస్వామీ మీరు...'' అని ఏదో అడగబోతుంటే మహాస్వామి వారు “చెక్కపలక మీద వడ్లు నింపి చూపించమని అడగబోతున్నావా!'' అని నవ్వుతూ అన్నారు. అది విని ఆ యువకుడు మహాస్వామి వారికి సాష్టాంగంగా నమస్కరించి “వద్దు మహాస్వామీ! తమరు ఇంతగా వివరించిన తర్వాత నాకు సత్యం అర్థమైంది! నన్ను ఆశీర్వదించండి!'' అన్నాడు.

**- పి.ఎస్. గోపాలకృష్ణ**

---

43వ పేజీ తరువాయి... రామాయణం...

### ఇంద్రుడి రాకకు కారణం
### శ్రీరామచంద్రుడికి చెప్పిన శరభంగ మహర్షి

“రామచంద్ర దేవా! నేను తపస్సు చేసి క్షుద్రులు పొందలేని బ్రహ్మలోకాన్ని సంపాదించాను. అక్కడకు నన్ను పిలుచుకొని పోవడానికి ఇంద్రుడు ఇక్కడకు వచ్చాడు. ఆ బ్రహ్మలోకానికంటే కూడా ప్రియమై కోరాల్సిన నువ్వు అతిథిగా నా దగ్గరకు వస్తున్నావని తెలిసి, బ్రహ్మలోక ప్రాప్తికంటే కూడా నీ దర్శనం శ్రేష్ఠం కాబట్టి ఇంద్రుడితో పోవడానికి మనసొప్పలేదు. ఫలితంగా నీ దర్శన భాగ్యం కలిగింది. ఇక దేవతలు దర్శించే త్రిదివము నకు పోతాను. నేను తపస్సుతో సంపాదించినవన్నీ ఎప్పటికీ తరిగిపోనివి... పుణ్యలోకాలు కలిగిస్తాయి. నిన్ను దర్శించకుండా నేను బ్రహ్మలోకానికి పోతే ఎలా? స్వర్గలోకంలోని భోగస్థానా లను, బ్రహ్మలోకంలోని భోగస్థానాలను, సంపాదించడానికి నేను చేసిన పుణ్యమంతా నీకిస్తాను. గ్రహించు''. అప్పుడు సకల శాస్త్ర వేత్త అయిన శ్రీరామచంద్రమూర్తి ఇలా అన్నాడు: “మునీంద్రా! నీ పుణ్యాన్నంతా నేను తీసుకుంటా. మేముండడానికి నివాసయోగ్యమైన స్థలమేదో చెప్పు''. జవాబుగా శరభంగుడిలా అన్నాడు: “మీరుండడానికి సరైన స్థలం సుతీక్ష్ణుడనే ముని చెప్తాడు. ఈ అడవిలోనే ఆయన వున్నాడు. రామచంద్రా! మీరు ఇక్కడనుండి తూర్పుగా పారుతున్న ఈ పుణ్యనదికి ఎదురెక్కి, పడమటగా పొండి. మధ్యలో పూల గుంపులు నదిలో కనిపి స్తాయి. అదే సరైన తోవ. రామచంద్రా! పోవద్దు. కాసేపుండు. శరీరాన్ని వదులుతా'' అని అంటూనే తన శరీరాన్ని అగ్నిలో ప్రవేశింపచేశాడు. భస్మమైన శరభంగుడు మళ్లీ కుమారుడి రూపాన్ని దాల్చాడు. ఆ రూపంతో బయల్దేరి పోయి, పరబ్రహ్మ లోకంలో భగవన్మూర్తిని చూశాడు. ఆయన కూడా మునిని సుఖంగా వచ్చావా? అని అడిగాడు. సీతారామలక్ష్మణులు ముగ్గురూ ముని శక్తికి ఆశ్చర్యపడ్డారు.

### సర్గ-6
### శ్రీరాముడికి తమ కష్టాలు చెప్పి శరణు వేడిన మునీంద్రులు

శరభంగుడావిధంగా పరమపదం చేరగా, దివ్యతేజస్సుకల రామచంద్రమూర్తిని, అక్కడున్న ఋషులు కలిసి రక్షించమని వేడుకున్నారు. ఆత్మరక్షణ విషయంలో తాము సమర్థులం కామని, పరాధీనులమనీ, భగవంతుడొక్కడే ఆపద్బాంధవుడనీ భావించిన మునులు శరణాగత రక్షణే పరమ ధర్మమనే జ్ఞానం కల శ్రీరాముడిని రక్షించమని ఇలా వేడుకున్నారు.'' రఘువంశసత్తమా! పురుష రత్నమా! నీ అభిజాతత్వం శ్లాఘ్యమైంది. నిన్ను లోకులు పొగుడుతున్నారు. అరణ్యానికి రావడం వల్ల తండ్రి మీద భక్తి, భరతుడు అడిగినా ఒప్పుకోనందున సత్యవాక్కు మీద ప్రీతి, ధర్మం అంటే నిష్ఠ, నీలో సంపూర్ణంగా వున్నాయి. సీతావల్లభా! పరమాత్మ స్వరూపుడవైన నిన్ను త్రికరణ శుద్ధిగా శరణు కోరుతున్నాం. నిన్ను మేమొక విషయం యాచిస్తాం. రామచంద్రమూర్తీ! మేమొక విన్నపం చేయదల్చాం. కోపగించుకోవద్దు. మేం కార్యార్థులమై వచ్చినందున, నీకు తెలిసినా-తెలియకున్నా చెప్పుకోవాల్సిన విధి మాది. చెప్పుకోలేదన్న లోపం మాలో వుండకూడదు. ప్రజాపాలనే రాజులకు ముఖ్యకార్యం కాబట్టి, మా విన్నపాన్ని ఆలకించు. ఏ రాజైతే తన ప్రాణం కంటే ఎక్కువగా ప్రజలను పాలిస్తాడో, ఆ రాజు, శాశ్వత కీర్తిని సంపాదించి బ్రహ్మలోకానికి పోయి అక్కడ బ్రహ్మతో గౌరవం పొందుతాడు. తపస్సు చేస్తున్న తాము ఆకులలాలు తింటూ కూడా, తమ కష్ట ఫలమైన తపస్సులో నాలుగో భాగం రాజుకు ఇవ్వడానికి కారణం అతడు ప్రజలను రక్షించడానికే కదా?'' (సశేషం)

# వేదాల్లో విజ్ఞానాంశాలు




పోలిశెట్టి బ్రదర్స్

(గత సంచిక తరువాయి)

కాలగమనంలో విషువత్ చలనం వల్ల 'ధ్రువతార' మారుతుంది. దానిని బట్టి 'విషువత్ రేఖ' మారుతుంది. దానిని బట్టి 'వసంత విషువత్' మారుతుంది. దానిని బట్టి 'సంవత్సరం ఆరంభం' మారుతుంది. దానిని బట్టి 'పంచాంగాలు' మారుతూ ఉంటాయి. ఈ విషయాలన్నీ మన ఋగ్వేదంలో స్పష్టంగా తెలియజేయబడ్డాయి. (ప్రస్తుత మన పంచాంగాన్ని కొద్దిగా సవరించుకోవలసిన అవసరం ఇప్పటికే ఉందని గమనించండి.)

ఋతువులు మారడం గమనించిన హైందవ ఋషులు ఖచ్చితమైన పరిశోధనలు జరిపి, భూపరిభ్రమణం గురించి తెలుసుకున్నారు. ఋతువులు మొదలయ్యే కాలాన కలిగే మార్పులకు విషువత్ చలనం కారణమని కనుగొన్నారు. ఆ విజ్ఞానాన్ని ఋగ్వేదంలోని అనేక సూక్తాల్లో మనకు అందించారు.

మన హైందవుల పండుగల చాలావరకూ 'సూర్యసహోదయం' అనే అంశంపై ఆధారపడినవి. ఈ సూర్య సహోదయాన్ని తెలుసుకోవాలంటే విషువత్ చలనం, విషువత్ రేఖల గురించి తెలిసి తీరాలి. వాటి గురించి తెలియకుండా సూర్య సహోదయం కనుక్కోవడం సాధ్యం కాదు. ఈ విషయాలన్నీ క్షుణ్ణంగా తెలిసినందువల్లనే మన హైందవ ఋషీశ్వరులు వివిధ పండుగలను ఖగోళపరంగా నిర్ణయించగలిగారు.

పై ఖగోళ విజ్ఞానమంతా పాశ్చాత్యుల నుంచి మనం నేర్చుకున్నామనే అసత్య ప్రచారాలను ఖండించడం మన కర్తవ్యమని గ్రహించండి.

◆◆◆

## 6. సూర్య సహోదయం

ఏదైనా ఒక నక్షత్రం లేదా కొన్ని నక్షత్రాలు సూర్యునితో జతగా కలిసి ఉదయించడాన్ని "ఆ నక్షత్రం లేదా నక్షత్రాల సూర్య సహోదయం" అంటారు. ఈ నక్షత్రాల సూర్యసహోదయాన్ని ముందుగా ఈజిప్ట్‌వారు గమనించినట్లు ఒక అబద్ధపు చరిత్ర ప్రచారంలో ఉంది. నిజానికి ఈ నక్షత్రాల సూర్యసహోదయాన్ని మన ఋగ్వేద ఋషులు ముందుగా గమనించారు. హైందవ పండుగలు ఇంచుమించుగా చాలావరకూ ఈ నక్షత్ర సూర్యసహోదయాన్ని అనుసరించే నిర్ణయించబడ్డాయి. అనంతర కాలంలో పాశ్చాత్యులకు 'సిరియన్' అనే నక్షత్రం సూర్యునితో కలిసి ఉదయించడం ఒక్కటే తెలుసు. మన హైందవులకు పురాణ కాలం నుంచి వివిధ నక్షత్రాలు ఎప్పుడెప్పుడు ఎలా సూర్యునితో కలిసి ఉదయిస్తున్నాయో స్పష్టంగా తెలుసు. అందువల్లనే ఆయా నక్షత్రాల సూర్యసహోదయాల ఆధారంగా వివిధ హైందవ పండుగల్ని అతి ప్రాచీన కాలంలోనే నిర్ణయించారు. ఉగాది, శ్రీరామనవమి, వినాయక చవితి, ఋషిపంచమి, విజయదశమి, దీపావళి, సుబ్రహ్మణ్య షష్ఠి, ధనుర్మాస ప్రవేశం, మకర సంక్రాంతి, రథసప్తమి, శివరాత్రి, శనిత్రయోదశి, క్షీరాబ్ధి ద్వాదశి మొదలగు పండుగలన్నీ కూడా ఈవిధంగా నిర్ణయించబడినవే!

ఖచ్చితమైన చక్కటి ఖగోళ పరిజ్ఞానంతో పండుగలను ఏర్పరచుకున్న మరోజాతి ప్రపంచంలో లేదు. అదే భరతజాతి ఘనత!

◆◆◆

## 7. గ్రహణాలు

సాధారణంగా మనకు రెండు గ్రహణాలు కన్పిస్తుంటాయి. 1. సూర్యగ్రహణం 2. చంద్రగ్రహణం. పాములు మ్రింగడం వల్ల గ్రహణాలు కలుగుతున్నట్లుగా పురాణాల్లో ఉన్నదనీ, అది దారుణమైన మూఢనమ్మకమనీ, నేడు మనవాళ్లు కొంతమంది హేళనగా మాట్లాడుతుంటారు. ఋషీశ్వరులు తాము కనుగొన్న విజ్ఞాన విషయాల్ని ఆసక్తికరమైన, చిత్రమైన కథలుగా మార్చి పురాణాల్లో ఇరికించిన విషయాన్ని వారంతా గుర్తుకు తెచ్చుకోవాలి. పైకి చూస్తే, పురాణకథల అర్థం ఒక విధంగా ఉంటుంది. అందులోని అంతరార్థం తెలుసుకుంటే, విషయం వేరేగా ఉంటుంది. పురాణ విజ్ఞానం అర్థం కావాలంటే స్వయంగా మేధావి అయివుండాలి. లేదా విడమరచి చెప్పే మేధావి ద్వారానైనా తెలుసుకోవాలి.

ఋగ్వేదంలో అనంతమైన ఖగోళ విజ్ఞానాన్ని అందించిన మహర్షులకు గ్రహణాల గురించి సరిగా తెలియదనుకోవడం అవివేకం. గ్రహణాలకు రాహుకేతువులు కారణాలని వారు చెప్పారు. పురాణపరిభాషగా రాహుకేతువుల్ని 'పాములుగా' చమత్కరిస్తూనే, అవి 'ఛాయాగ్రహాలని' కూడా చెప్పుకొచ్చారు. ఆ విషయం గమనించండి. వాతావరణాన్ని గురించీ, జీవుల గురించీ విస్తారమైన పరిజ్ఞానం ఉన్న మన మహర్షులు -

వాతావరణమూ, ప్రకృతీ లేని అంతరిక్షంలో పాములు ఉంటా యనుకునే మూర్ఖులేం కాదు. ఖచ్చితంగా రాహుకేతువుల్ని ఛాయాగ్రహాలని చెప్పారు అందుకే!

### గ్రహణాల గురించి విదేశీ పూర్వీకుల అభిప్రాయాలు

భారతీయులకే మూఢనమ్మకాలుంటాయని మనలో చాలామందికి ఒక మూఢనమ్మకం ఆ మాటకొస్తే 'మన నమ్మకాల్లో' చాలావాటికి ఒక అర్థం, పరమార్థం ఉంటాయి. అవి తెలుసుకోలేక పోవడం మన పొరబాటు. ఇక విదేశీయుల సంగతి! అర్థం పర్థం లేని మూఢనమ్మకాలు వారికి అనేకం ఉన్నాయి. గ్రహణాల విషయంలే విదేశీ పూర్వీకుల మూఢనమ్మకాలను గురించి ఇప్పుడు తెలుసుకుందాం. డ్రాగన్ అనే వింతజీవి సూర్యచంద్రులను మ్రింగడం వల్ల గ్రహణాలు ఏర్పడతాయని ప్రాచీన చైనీయుల నమ్మకం. గ్రహణాలకు కారణం - ''సూర్యచంద్రుల్ని మొసలి మ్రింగడమని ఈజిప్ట్ వారూ, ఎలుగుబంటి మ్రింగడమని అమెరికా వారూ, (బోదురు కప్ప మ్రింగడమని అమెరికాలోని కాలిఫోర్నియా ప్రాంతం వారూ) పూర్వాకాలంలో నమ్మేవారట. ఈ విధంగా వివిధ రకాలైన జీవులు సూర్యచంద్రుల్ని మ్రింగుతున్నట్లుగా ఆనాడు వివిధ దేశాలవారు భావించేవారు. ఇతర శాస్త్రీయ విషయం దేన్నీ కూడా ఏ దేశం వారూ చెప్ప



లేదు. మన ఋషీశ్వరులు మాత్రం అలా కాదు. రాహుకేతువులను 'రాక్షస దేహాల ఖండాలుగానూ, పాములు గానూ' పురాణ పరంగా వర్ణిస్తూనే అవి 'ఛాయాగ్రహాలని' కూడా చెప్పుకొచ్చారు. ఇలా చెప్పగల శాస్త్రీయ పరిజ్ఞానం హైందవ మహర్షులకే ఉంది.

### మహర్షుల పరిజ్ఞానం

సూర్యుని వల్ల మన భూమి నీడ చంద్రునిపై పడి 'చంద్రగ్రహణం' ఏర్పడుతోంది. చంద్రునిపై పడే భూమి నీడను 'ఛాయాగ్రహం' అన్నారు మహర్షులు.

ఇక సూర్యగ్రహణం సంగతి చూద్దాం. సూర్యుణ్ణి మూసి వేస్తున్నట్లుగా సూర్యునిపై నుండి చంద్రుడు దాటుకుంటూ వెళ్లడమే, మనకు 'సూర్యగ్రహణం'గా కనిపిస్తుంది. ఇందులో సూర్యుణ్ణి మూసివేసేది చంద్రుని నీడ కాదు. సాక్షాత్తూ చంద్రుడే అడ్డుగా ప్రయాణించడం వల్ల సూర్యుడు మనకు కనపడడు. ఈ గ్రహణంలో ఏ గ్రహం యొక్క ఛాయా లేదు. అయినాసరే మహర్షులు, ఛాయాగ్రహం అనే ప్రస్తావన సూర్యగ్రహణంలో ఎందుకు తీసుకొచ్చారో తెలుసుకుందాం. సూర్యుని వెలుగు పడని చంద్రుడు (అనగా అమావాస్య చంద్రుడు) నల్లగా 'నీడ వలె' ఉంటాడు. కానీ నిజానికి అది నీడ కాదు. మరి, ఇలా నీడకాని నీడలా ఉన్న చంద్రుడు, సూర్యునకు అడ్డుగా రావడం వల్ల 'సూర్యగ్రహణం' సంభవిస్తుంది. ఈవిధంగా సూర్యగ్రహణానికి కారణమైన నీడగాని నీడనూ మరియూ చంద్రగ్రహణాన్ని ఏర్పరిచే భూమి నీడనూ 'రాహువు కేతువు' అనే ఛాయాగ్రహాలుగా మహర్షులు వర్ణించారు. వీటిపై పురాణపరంగా ఒక కథను కూడా సృష్టించి గ్రంథస్థం చేశారు. మళ్లీ. అదే వారి చమత్కారం (అనంతర కాలాన భాస్కరాచార్యుడు) తన గ్రహగణితంలో 'భూమి నీడవల్లనే చంద్రగ్రహణం ఏర్పడుతుందని' శాస్త్ర బద్ధంగా వివరించాడు. ''తూర్పువైపు వెళ్తున్న చంద్రుడు భూమి నీడలో ప్రవేశిస్తాడు. అందుచేత చంద్రగ్రహణంలో స్పర్శ తూర్పున అవుతుంది. గ్రహణం విడివడడం పశ్చిమాన అవుతుంది'' అని చెప్పాడాయన. చారిత్రిక కాలాన మన ప్రాచీనుల గ్రహణ పరిజ్ఞానానికి ఇదొక మచ్చుతునక.)

రాహుకేతువుల గురించి క్లుప్తంగా, సూటిగా రెండు మాటల్లో చెప్పుకుందాం. భూభ్రమణం వల్ల సూర్యుడు సంచరిస్తున్నట్లుగా కనిపించే మార్గమూ, చంద్రుడు పయనించే మార్గమూ ఒకదానినొకటి రెండుచోట్ల ఖండించుకుంటాయి. ఆ ఖండన బిందువులనే ఒక దానిని 'రాహువు' అనీ, మరోదానిని 'కేతువు' అనీ మన మహర్షులు గుర్తించారు. ఇందువల్లనే సూర్య చంద్ర గ్రహణాలకు 'రెండు కారణాలను' (రాహువును, కేతువును) చెప్పుకొచ్చారు. విదేశీయులు మాత్రం ఏదో ఒక జీవిని గ్రహణాలకు కారణంగా చెప్పి ఊరుకుని, పొరబాటుగా వ్యవహరించారు.

### వేదాల్లో సూర్యగ్రహణం గూర్చి

ప్రపంచ చరిత్ర ప్రస్తుత రికార్డు ప్రకారం మొట్టమొదటగా సూర్యగ్రహణం గురించి వ్రాసినది చైనావారట. వారు క్రీ.పూ. 2137లో కలిగిన గ్రహణం గురించి వ్రాశారట. అంతకంటే చాలా కాలం క్రితమే మన హైందవ ఋషీశ్వరులకు 'గ్రహణ పరిజ్ఞానం' ఉంది. అత్రి మహాముని 'తురీయబ్రహ్మ' అనే తన టెలిస్కోపుతో సంపూర్ణ సూర్యగ్రహణాన్ని ప్రప్రథమంగా పరిశీలించాడు. ఈ విషయాన్ని 'ఋగ్వేదం' (5వ మండలంలోని 40-6 మంత్రం) తెలియజేస్తుంది. పూర్వకాల గణిత, ఖగోళ శాస్త్రజ్ఞుడైన భాస్కరాచార్యుని రచనల్లో (సిద్ధాంత శిరోమణి అనే గ్రంథంలో గోళాధ్యాయంలోనూ యంత్రాధ్యాయంలోనూ కూడా) ఈ 'తురీయం' అనే టెలిస్కోపు గురించి వర్ణించడం కనబడుతోంది.

(సశేషం)

# ప్రజాస్వామ్య విలువలకి ఇతిహాసాలే ఆయువు పట్టు !

ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాతనే వాటి గురించిన ధర్మాలు ఏర్పడ్డాయా లేక అంతకు ముందు ఈ ప్రజాస్వామ్య ధర్మాలు మనుగడులో లేవా యనే మీమాంస ఏర్పడితే అసలు సనాతన ధర్మాల నుండే ప్రజాస్వామ్య ధర్మాలు ఏర్పడ్డాయనేది నిర్వివాదాంశం. ఈ సనాతన ధర్మాలు ఎంత ప్రగాఢంగా అమలు పరచబడ్డాయంటే ప్రజా ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత కూడా ఈ సనాతన పోకడలు కనపడటమే దీనికి తార్కాణము. చాలా విషయాలలో నేటి ప్రజాస్వామ్య వ్యవస్థకి, ఆపాత తరమైన సనాతన వ్యవస్థే అంతర్గతంగా ముఖ్య సలహాదారుగా ఉంటున్నది. మరి ఈ విషయాలు సత్యదూరమైనవా లేక సత్యమైనవా యని తెలుసుకోవాలంటే ప్రస్తుతం భారతదేశంలో పరిఢవిల్లుతున్న ప్రభుత్వ విధానాలు లోతుగా అధ్యయనం చేస్తే, సనాతన విధానాలలో ఉన్న మంచి సంస్కరణలు పాలకులు గ్రహించి అనుసరిస్తున్నారనే విషయం ప్రస్ఫుటంగా తెలుస్తుంది.

రాజవంశీకులు వంశ పారంపర్యంగా రాజ్యాలు పరిపాలిస్తున్న రోజులలోనే ప్రజలకి మేలు చేసే రాజ్యధర్మాలు అనుసరించారు. అప్పట్లో మహారాజైన వాడు తనకు తన కుటుంబీకులకు మరణం తర్వాత స్వర్గప్రాప్తి కలగాలంటే వేయి అశ్వమేధయాగాలు చేయాలి అనే నిబంధనని పాటించేవారు. మరి ఆ అవకాశం లేకపోతే ప్రజలను స్వంత బిడ్డలుగా భావించి వారిని ప్రజానురంజకంగా పరిపాలించినా ఆ పుణ్యం లభించి స్వర్గసీమను అలంకరించేవారు. ఈ విషయాలు వ్యాసకర్తగా నా స్వంత అభిప్రాయాలు కావు. శ్రీ వ్యాస భగవానుల వారు రచించిన శ్రీ మహాభారతంలో 'ఆశ్రమ వాసిక పర్వం'లో వారిచే విశదీకరించినవి.

ఇదే ఆశ్రమవాసిక పర్వం లోకి మనం శ్రద్ధగా, లోతుగా తొంగి చూస్తే చాలా ఆశ్చర్యకరమైన విషయాలు బయల్పడతాయి. కౌరవ వంశ వినాశ కారకుడైన ధృతరాష్ట్రుడు తన నూర్గురు పుత్రులకు తండ్రిగా ప్రేమను పంచి, ఎల్లప్పుడు విదర మహాశయని వద్ద నీతులు నేర్చి తన అవసాన కాలంలో వాన ప్రస్థాశ్రమాన్ని స్వీకరించే సమయానికి "తొంభై తొమ్మిది మంది కుమారులను కోల్పోయి రాజ్యభ్రష్ఠుడై దాదాపు పదిహేడు సంవత్సరాలు ధర్మరాజు దగ్గర కాలం వెళ్ళబుచ్చుతున్నాడు.

ఒక సాయంత్రపువేళ, పాండవుల వద్ద ప్రత్యక్షం గానూ, శ్రీ వ్యాసభగవానుల వద్ద పరోక్షంగాను వానప్రస్థాశ్రమానికి అనుమతి పొందుతాడు, తర్వాత ఒక రోజు రాత్రి తన వసతి భవనంలో.. ధార్మిక కర్మలన్నిటినీ పూర్వాహ్ణ కాలములో ముగించుకొని ఏకాంతములో ధర్మరాజుతో సమావేశమవుతాడు. "నాయనా ధర్మజా!, నీకు అంపశయ్యపై భీష్ముల వారు, నీకు స్వయాన బంధువైన శ్రీకృష్ణ పరమాత్మ, నీ వంశజుడైన విదుర మహాశయులు సకల రాజనీతులు, సనాతన ధర్మాలు నీకు వివరించి ఉంటారు. కానీ నీ మీద నాకు గల అపారమైన వాత్సల్యంతో నేను కూడ అతి నిగూఢమైన సనాతన ధర్మాలు కొన్ని చెప్పదలచాను. శ్రద్ధగా వినవలసినది అని కోరాడు.

ఇదే సమయములో ఇన్ని రాజనీతులు, సనాతన ధర్మాలు తెలిసిన ధృతరాష్ట్రుడు ధర్మరాజు పతనానికి ఎందుకు తన కుమారులతో సహకరించాడు అనే సంశయం మనకి రాక పోదు. రాజ్యం వంశపారం పర్యం అనే విధానంలో ఉన్న లొసుగులు, తన స్వంత కుమారులపై గల ప్రేమాభిమానాల వల్ల కలిగిన ఈషణ త్రయాలని జయించలేకపోవడమే కారణమని వీటి వల్లనే తాను ఈ సనాతన ధర్మాలు పాటించలేక పోయానని చింతిస్తూ ధర్మరాజుకి నిండు మనస్సుతో చేసే హితబోధనలు మనలని ఆశ్చర్యపరచక మానదు.

ధృతరాష్ట్రుడు చెప్పిన ఈ రాచరికపు ధర్మాలు, నేటి మన భారతీయ దేశం గర్వించదగ్గ నేత నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సనాతన పథకాలను విశ్లేషణ చేసుకుంటే వీటిలో యున్న సామ్యం కేవలము కాకతాళీయమా లేక మన నాయకునికి ఇతిహాసాలపై ఉన్న పట్టు విషయమా అన్నదానిని





పాతకులే గ్రహించాలి.

ధృతరాష్ట్రుడు : రాజైనవాడు జాము రాత్రి ఉందనగానే తర్వాత రోజు చేయవలసిన పనులను ముందుగా నిర్ణయించుకోవాలి.

నరేంద్ర మోడీ: తన బృంద కార్యదర్శులతో ప్రతిరోజు రాత్రి రేపటి కార్యక్రమాల గురించి చర్చించడం.

ధృత : అర్ధరాత్రి వేళ, మిట్ట మధ్యాహ్నం సమయాలలో నగరాలలో సంచరిస్తూ ప్రజల కష్టసుఖాలు స్వయంగా తెలుసుకోవాలి.

నమో : 'మన్ కీ బాత్' కార్యక్రమం ఏర్పాటు చేసుకొని ప్రజలు తను ప్రభుత్వ తీరు పట్ల యున్న సంతృప్తుల, అసంతృప్తితో ఉన్న వారి గురించిన వాకబు, ఇంకా చేయవలసిన పనుల గురించి యోచన.

ధృత : రాజకీయ వివరాలు సేకరించడానికి గూఢచారులను కలవడానికి మంచి సమయం సంధ్యకాలం యని గుర్తెరగాలి.

నమో : గూఢచారి వ్యవస్థను అభివృద్ధి చేయుట సమావేశాలు నిర్వహించుట. కావలసిన ఎత్తుగడలు విశ్లేషించుకొనుట.

ధృత : పరాక్రమవంతులు జనహితైషులు, స్వామిభక్తులైన వారిని సేనాధిపతులుగా నియమించుకోవాలి

నమో : సుశిక్షితులైన నాయకులను దేశ భక్తులను తన మంత్రి మండలిలో కూర్పుచేసి, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయటం, సైన్యాధ్యక్షులతో నిత్య సమావేశాలు నిర్వహించడం.

ధృత: రాజైనవాడు కోశాగారాన్ని తరచుగా పర్యవేక్షిస్తూ ప్రజలకు మేలుచేసే విధంగా వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

నమో : జన్‌ధన్ యోజన, స్కిల్ ఇండియా మిషన్, మేక్‌ఇన్ ఇండియా, పథకాల ద్వారా ప్రజలకి చేరువ అవడం.

ధృత: కేవలమ రాజధాని నగరాలనే కాక గ్రామస్థాయిలో యున్న వాటికి కూడ రక్షణ కవచాలు ఏర్పరచాలి

నమో : సంపద్ ఆదర్శ్ గ్రామ యోజన గ్రామాలలో, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధి.

ధృత: కేవలం రాజైనవాడు సైన్యానికే ప్రాముఖ్యత నిచ్చి రైతువారి ప్రజలను చేతిపనుల వారిని, అనేక విధములైన శ్రామికులను ఉపేక్షించరాదు. వారి ఉన్నతిని కాంక్షించే ఏర్పాట్లు చేయాలి.

నమో : 'శ్రమే జయతి యోజన' దీని ద్వారా కార్మిక శక్తిని వారి పురోభివృద్ధిని పెంపొందించే ప్రణాళికలు రచించి ఆచరణలో పెట్టడం... ఇలా అనేక విధములైన ప్రజానురంజక సనాతన ధర్మాలు, నీతులు దర్మరాజుకి ధృతరాష్ట్రుడు భోధించాడు.

పరోక్షంలో శ్రీకృష్ణపరమాత్మ ఇదంతా విని సంతోషపడి వానప్రస్థాశ్రమ సమయంలో పరమాత్మ విదుర మహాశయునితో బాటు తనలో లీనమయ్యేలా దీవిస్తాడు.

**- కీసర పార్థసారథి శర్మ**



(గత సంచిక తరువాయి)

**మనుస్మృతి చరిత్రలో అమలు చేయబడిందా?**

భారతీయ శిక్షాస్మృతి మొదలైన చట్టాలను నిర్మించే సమయంలో ఈ సమాజాన్ని పాలించిన స్మృతి గ్రంథమేమిటి అని బ్రిటీషు పాలకులు పరిశీలించారు. William Jones అనునతడు ఆ రోజుల్లో గొప్ప సంస్కృత విద్వాంసుడు. అతడు మనుస్మృతిని హిందువులకు ప్రమాణ గ్రంథమని గుర్తించి ప్రతిపాదించాడు. కానీ నిజంగా మన చట్టాలు యాజ్ఞవల్క్య స్మృతి, దానిపై మితాక్షర వ్యాఖ్య, కౌటిల్యుని అర్థశాస్త్రం మొదలైన గ్రంథాల నుంచే ఎక్కువగా తీసుకొనబడ్డాయి. తక్కువ భాగం మాత్రమే మనుస్మృతి నుండి గ్రహింపబడింది. మనుస్మృతి భారతీయ సమాజంలో ఏ కాలంలో అమలు చేయబడిందో చెప్పలేము.

కొన్ని ఉదాహరణలు

◆ బ్రాహ్మణుడు పితృశ్రాద్ధ సమయంలో భోక్తలకు మేక మాంసం, జింక మాంసం పెడితే పితృదేవతలు చాలా కాలం సంతోషిస్తారు (మను 3-123, 3-270 & 271). వీటిని గూర్చి వ్రాయలేదు.

◆ అస్పృశ్యత అనేమాట మనుస్మృతిలో లేదు.

◆ బ్రాహ్మణుడికి ఉంఛవృత్తితో జీవించడం (పొలాల్లో మిగిలిన ధాన్యపు గింజలను ఏరుకొని జీవించడం) శ్రేష్ఠం, లేదా దానాన్ని గ్రహించడం, లేదా యాచనతో జీవించడం చేయవచ్చు. (దీన్ని ఇటీవలి కాలం వరకు చాలమంది ఆచరించినట్లు చూడగలం. ప్రముఖ వాగ్గేయకారులు త్యాగరాజు పురందరదాసు యాచన ద్వారా జీవించినట్లు వారి చరిత్ర చెపుతుంది. దేశంలోని మిగతా ప్రాంతాల్లో పలు ఉదాహరణలు ఉండ వచ్చు.



ఇతిహాసాలు పురాణాల్లో భారత సమాజంలోని ఉదార ఆచరణ గూర్చి అనేక ఉదాహరణలు ఉన్నాయి.

◆ నిమ్నజాతి వ్యక్తి బ్రాహ్మణుడు కావడం (మహాభారతం అనుశాసనపర్వం).

◆ పరశురాముడు, శ్రీరాముడు మొదలగువారు కొన్ని సందర్భాల్లో బ్రాహ్మణులు లేని ప్రదేశాల్లో ఇతర వర్గాల వారిని బ్రాహ్మణులుగా మార్చినట్లు చాతుర్వర్ణ్య భారత సమీక్షా' అనే సంస్కృత పుస్తకంలో స్వామి మహేశానందగిరి వివరించారు (హరిద్వార్, కనఖల్ పీఠ ప్రచురణ, 1963).

# ఆర్ష ధర్మంపై అన్యుల విషం

## భరతజాతిని మేల్కొల్పే 'అరవిందుని' కలం

◆ ద్విజులు (బ్రాహ్మణులు కూడా) అయిదు రకాల జంతువుల్ని తినవచ్చు. అడవి పంది, ముళ్ల పంది, ఖడ్గ మృగం మొదలైనవి (మను 5-18).

◆ బ్రాహ్మణుడు నాలుగు వర్ణాల నుండి కూడా పెళ్లి చేసుకోవచ్చు (మను 3-13, 9-149 నుండి 155).

◆ నియోగ పద్ధతి అనే ఆచారం ఉండేది. అన్నగారు మరణించిన తరువాత అతని భార్య ద్వారా తమ్ముడు పిల్లల్ని కనడం అనుమతింపబడింది (మను 9-60, 61, 62) ఇది బహుశా ఆ రోజుల్లో ఆస్తి రక్షణ అనే ఉద్దేశంతో ఉండవచ్చు.

◆ విధవ వివాహం అనుమతించబడింది (మను 9-175). దీన్నే పరాశర స్మృతిలోనూ కౌటిల్యుని అర్థశాస్త్రంలోనూ అంగీకరించారు. ఈ విధానాన్ని తర్వాతికాలంలో అమలు చేసినట్లు కనపడదు.

◆ శూద్రులకు కఠినమైన శిక్షలు ఇవ్వబడ్డాయి. బ్రాహ్మణున్ని నిందించినా, బ్రాహ్మణుడికి నీతి బోధించినా నాలుక కత్తిరించడం, లేదా చెవుల్లో వేడినూనె పోయడం (మను 8-270, 271, 272). వీటిని దేశంలోని ఏ ప్రాంతంలోనైనా అమలు చేసినట్లు ఎక్కడా కథలు గానీ చరిత్ర గానీ లేదు. విదేశీ యాత్రికులు రెండువేల సంవత్సరాలుగా మన దేశానికి వస్తున్నా వారెవరూ

◆ వేదవ్యాసుడి తండ్రి బ్రాహ్మణుడు తల్లి మత్స్యకారిణి. అలాగే వాల్మీకి బోయవాడు, ఈ ఇద్దరినీ ఋషులుగా పూజిస్తాం. పురాణాలన్నింటిలో వక్తగా ఉన్న సూతుడు కూడా బ్రాహ్మణుడు కాదు. అయినా అతడు దేవతలకు సంబంధించిన అనేక కథల్ని ఋషులకు చెప్పేవాడు.

◆ వనచరుల్లో ముఖ్యులకు యజ్ఞ చేసే అధికారం ఉండేది (రామాయణం అయోధ్యాకాండ, సర్గ 50-36 శ్లోకానికి గోవింద రాజ వ్యాఖ్య). దీన్నిబట్టి వనచరులు ఏదో ఇతర సంస్కృతికి చెందినవారు కారనీ, సనాతన సంప్రదాయానికే చెందినవారనీ చూడగలం.

◆ స్త్రీలు వేదాల్ని చదివేవారు, నిత్య కర్మలు (రోజు చేయాల్సిన పనులైన) సంధ్యా వందనం మొదలైనవి చేసేవారు. బృహదారణ్యకోపనిషత్తులో వీరిని బ్రహ్మావాదినులు అన్నారు. ఈ ఆచారం ఎప్పుడు మరుగుపడిందో తెలియదు.

◆ యోగ సంప్రదాయం కులాలకు అతీతంగా అందరిచే

ఆచరింపబడింది. ఇటీవలి కాలం వరకు, అన్ని కులాల నుండి యోగులు ఉండేవారు ఇప్పుడు కూడా చూడగలం.

కులం గురించి పరిశోధన చేసినవారు ఒక ఆసక్తికరమైన విషయాన్ని బయటకు తీసారు. భారత సమాజంలో మలాన్ని ఎత్తి శుభ్రపరిచే వర్గం అంటూ ఎక్కడా లేరు. ఏ ధర్మశాస్త్రం లోనూ ఇలాంటి వర్గం ఉన్నట్టు చెప్పలేదు. నిర్ణయ సింధు మొదలైన ధర్మశాస్త్రాల్లో మలవిసర్జన విధి అంటూ ఉంది. ఊరి బయలులో కొన్ని నిర్ణీతస్థలాల్లో ఎలా మలవిసర్జన చేయాలి, ప్రవహించే నీటికి ఎంతదూరంలో ఉండాలి మొదలైనవి చెప్పారు. మలం ఎండకు ఎండేది, లేకుంటే పందులు మొద లైనవి శుభ్రపరచేవి. కానీ యూరోపియన్ సమా జంలో మలాన్ని తీసుకుళ్లే వర్గం ఒకటి ఉండేది. వీరిని gong farmers అనేవారు. సమాజంలోని కొన్ని వర్గాలను ఈ పనికై గుర్తించి వారితో ఈ పని చేయించేవారు. ఇస్లామిక్ సమాజంలో కూడా రాణులు బయ టకు వెళ్లేవారు కారు కావున ముస్లిం పాలకులు సమాజంలోని కొన్ని వర్గాలను బలాత్కారంగా ఈ పనికి నియోగించేవారు. బ్రిటీషు వారికి కూడా అదివరకే ఆ విధానం ఉండడం వల్ల వారు కూడా కొన్ని వర్గాలకు ఈ పనిని అప్పజెప్పారు. ఎస్సీ వర్గాలతో ఈ పనిచేయించడం విదేశీ పాలకుల బహుమానం అని గ్రహించాలి.

కలవాయి వెంకట్ అనే రచయిత మనుస్మృతిని గూర్చి ఇలా రాసారు. విలియమ్స్ జోన్స్ కలకత్తాలో ప్రచారంలో ఉన్న మను స్మృతిని ప్రమాణంగా తీసుకున్నారు. కానీ అప్పటికే దేశంలో పలుచోట్ల మనుస్మృతులు ఉండేవి. Patrick Olivelle అనే విద్వాంసుడు దాదాపు యాభై ప్రతులు వివిధ ప్రాంతాల్లో దొరికి నట్లు, ఒకదానితో ఒకటి పలుచోట్ల పొంతనలేనట్లు వ్రాశాడని వెంకట్ పేర్కొన్నారు. దాదాపు 1400 శ్లోకాలు ప్రాచీన మనుస్మృతిలో ఇరికించబడ్డాయని పండితుల అభి ప్రాయం. ఈ ప్రక్షిప్తాలు 18వ శతాబ్దిలో విలియమ్ జోన్స్ ఆజ్ఞ మేరకు జరిగాయా అన్నది ప్రశ్న. ఈ ప్రశ్నను మనం తోసి పుచ్చలేం. Robert Nobili అనే అతడు సంస్కృతాన్ని నేర్చుకుని ఒక వేదాన్ని సృష్టించినట్లు ఇది వరకు పేజిల్లో గమనించాం. 18వ శతాబ్దానికి పూర్వం ముద్రిత గ్రంథాలేమీ లేవన్నది మనకు తెలిసిందే. పలుచోట్ల దొరికిన ప్రతుల్ని సేకరించి బ్రిటీషు వారు ఇచ్చిన గ్రంథమే మనకు ప్రమాణమైంది. కావున మనం చూస్తున్న మనుస్మృతి జోన్స్ మనుస్మృతి అని కూడా పలువురు అన్నారు.

### కులవ్యవస్థ వల్లనే హిందూమతం నిలిచిందా?

మన దేశంపై ఎన్ని దాడులు జరిగినా కులవ్యవస్థ ఉండడం వల్లే హిందూమతం నిలిచిందని ఒక బలమైన వాదం ఉంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. కులవ్యవస్థ, కులవివక్ష భరతఖండమంతా ఒకే విధంగా లేదు. కొన్ని ప్రాంతాల్లో



అస్పృశ్యత ఉండగా అన్ని ప్రాంతాల్లోనూ అదే తీవ్రతలో లేదు. ఎస్‌సి రిజర్వేషన్లు రాకపూర్వం (1901లో) ప్రస్తుత దళిత వర్గాలే తమకు బ్రాహ్మణులతో సమానస్థాయి ఇవ్వాలనీ, మాతంగ బ్రాహ్మణులు అనాలని డిమాండ్ చేశారు. తమిళనాడు, కేరళలలో అస్పృశ్యత తీవ్రస్థాయిలో ఉండి ఉండవచ్చు. కానీ అన్ని ప్రాంతాలలో అలా లేదు. ఆయా కుల గురువులు (సంత్ రవిదాస్ లాగ) ఆయా కులాలకు ధర్మాన్ని కులాచారాలను బోధించేవారు. మైలవరపు సుధామోహన్ అనే రచయిత Sivasya Kulam (2022) అనే ఆంగ్ల పుస్తకంలో ఈ విషయాల్ని చాలా విస్తృతంగా చర్చించారు. ఈయన పరిశోధన ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో జరిగింది. పాశ్చాత్య ప్రచార ఫలితంగా మనం మరచిపోయిన ఒక ముఖ్యమైన కోణాన్ని ఈయన వివరించారు. ప్రాచీన సమాజంలో కులాల మధ్య హెచ్చుతగ్గువలు లేవని ఈయన నిరూపించారు. వివిధ కులాలవారు వారివారి కులదేవతల్ని ఆరాధించేవారు, వైదిక ధర్మంలోని దేవతల్నే తమ కులదేవతలుగా ఆరాధించేవారు, జాతరలు చేసుకునేవారు.

వైదిక గ్రంథాల్లో కూడా (ఉదాహరణకు లలితా సహస్రనామం) ఒకే దేవతకు దక్షిణాచారం, వామాచారం అంటూ రెండూ ఉండేవి. వైదిక మార్గంలో బ్రాహ్మణులు, క్షత్రియులు పూజ చేసేవారు. వామాచారాన్ని మిగతా వారు ఆచరించేవారు. వామాచారంలో జంతుబలి మొదలైనవి ఉండడం వాటి ప్రత్యేకత. మార్క్సిష్టులు చెప్పినట్లు కేవలం ఆర్థికస్థితి అనే అంశంపై కాకుండా ప్రతి కులానికి కూడా ప్రత్యేక ఉపాసనలు, సాధన మార్గాలు, మంత్రోపదేశాలు, గురువులు ఉండేవారని, వీరివల్ల ఆయా కులాలు పటిష్టంగా కలిసి ఉండేవని సుధామోహన్ నిరూపించారు. (సశేషం)

# కంచిస్వామి దివ్య చరిత్ర 'గని - అద్వైత గని'



తూములూరి
మోహన్ కుమార్

## పరబ్రహ్మతత్వం

(గత సంచిక తరువాయి)

అంటే ఆయనే సృష్టికర్త, ఆయనే స్థితికర్త, ఆయనే ప్రళయకర్త. ఇప్పుడు నిజంగా...,

**గురుర్ బ్రహ్మ గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః**
**గురు సాక్షాత్ పర బ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః**

ఈ శ్లోకం ఎవరికి అన్వయం- చన్ద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి వారికి, అటువంటి మహాపురుషులకే అన్వయం అవుతుంది. ఎందుకంటె త్రిమూర్తులు ఆయనే అయి ఉన్నారు. ఆయనే పంబ్రహ్మమై ఉన్నారు. ఇప్పుడు దానినిబట్టి ఏమవుతుంది? ఆయన కొక్కరికి నమస్కారం చేస్తూ ఉంటే అందరికి నమస్కారం అంది పోతుంది. అందరు దేవతలకి నమస్కారం చేసినట్టే. ఆయన అనుగ్రహం సమస్త దేవతల యొక్క అనుగ్రహం. ఆయన యొక్క మనస్సులో మనకి స్థానం కలగటం సమస్త దేవతల యొక్క ఆనుకూల్యత మనకి కలగటం. అందుకే ఆస్థాయికి వెళ్ళిపోయిన వాళ్ళెవరుంటారో, వాళ్ళు కదులుతున్న దేవుడై ఉంటారు. దేవాలయంలో ఉన్న దైవం కదులుతూ కనపడదు. ఉత్సవమూర్తి కదులుతుంది. కానీ 'నడిచే దైవం' అన్నపేరు 'చన్ద్రశేఖరేంద్ర సరస్వతిస్వామివారికి' ఎందుకు అన్వయం అయ్యింది అంటే, ఆయన కదలాడినటువంటి దైవం. ఆయన కదిలి వెళ్ళిపోతూ ఉంటే భగవంతుడే నడిచి వెళ్ళిపోయాడు. ఆయన కూర్చుంటే భగవంతుడు కూర్చున్నాడు. ఆయన మాట్లాడితే భగవంతుడు మాట్లాడాడు. అటువంటివారితో కలిసి ఉండగలగటం 'మోక్షమునకు' హేతువు.

**"సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వమ్ ।**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః" ।**

కాబట్టి అటువంటి సత్పురుషుడు. అందుకే "ప్రజ్ఞా, బ్రహ్మపదజ్ఞా"... అంతటా నిండి నిమిడీకృతమైపోయినటువంటి బ్రహ్మము ఆయన అయిపోయారనుకోండి, 'సర్వజ్ఞత్వం' వస్తుంది. "జ్ఞ" శబ్దం. అన్నీ తెలుస్తాయి. వారికి తెలుస్తోంది అని ఆయనేమి చెప్పక్కర్లేదు. కానీ ఆయనకి తెలియనిదన్నది ఏమి ఉండదు. అన్నీ ఎరుకలో ఉంటాయి. ప్రతి విషయాన్ని తెలుకోగలిగినటువంటి స్థితికి వెళ్ళిపోతారు.

### వడవంబలంలో ఆశ్చర్యకర సంఘటన


నేను మీకు ఒక్క ఉదాహరణ చెప్పాలి అంటే, ఒకానొకప్పుడు, స్వామివారు ఆయన జన్మించినటువంటి ఊరే... విల్లుపురం దగ్గర చాతుర్మాస్యవ్రతం చేస్తున్నారు. ఆ చాతుర్మాస్యవ్రతం చేస్తూ విల్లుపురం పక్కనే... అక్కడే ఉంది.. ఒక ఊరు. ఆ ఊరి పేరు.. 'వడవంబలం' అంటారు. ఆ ఊరిదగ్గరికి వెళ్ళారాయన. అంటే, సరిహద్దులు దాటిపోరుగా! అందులోనే అంతర్భాగం విల్లుపురంలో. ఆ 'వడవంబలం' వెళ్ళారు. వెళ్ళి అలా పొలంలోకి వెళ్ళారు, అక్కడే ఉన్న ఒక పొలంలోకి.

ఈ పొలం ఎవరిది అని అడిగారు. ఒక రైతు పరుగుపరుగున వచ్చి 'నడిచే దైవం' మహానుభావుడు ఆయన నా పొలంలోకి వచ్చి 'ఈ పొలం ఎవరిదని అడుగుతున్నారేమిటి? అని పరుగెత్తుకొచ్చాడు. పరుగెత్తుకొచ్చి స్వామీ ఏం కావాలి? నాదే ఈ పొలం అన్నాడు. ఈ భాగం మా మఠానికిస్తావా? అని అడిగారు. అయ్యో స్వామీ ఈ భాగమేమిటి..ప్రతిసంవత్సరముకూడా పంటపండించి మీకిస్తాను అన్నాడు. ప్చ్... నాకు పంటకోసం కాదు, మా పీఠాన్ని అధిరోహించినటువంటి మహాపురుషులైనటువంటి జగద్గురువులు యాభైతొమ్మిదవవారు వారిపేరు "ఆత్మబోధేన్ద్రసరస్వతిస్వామివారని" వారు రుద్రపాఠానికి భాష్యం చెప్పడంలో అగ్రగణ్యులు. అంత గొప్పగా చెప్పేవారట ఆయన. అటువంటి స్వామివారు ఇక్కడ సజీవసమాధిలో ఉన్నారు. ఆయనున్నారిక్కడ భూమిలో. అందుకని నేను ఇది మఠానికి అడుగుతున్నానని అన్నారు. ఆయన తెల్లబోయి అన్నాడు, నేను చాలాకాలం నుంచి వ్యవసాయం చేస్తున్నాను స్వామీ, నేనెప్పుడూ వినలేదే మా పూర్వికులు కూడా చెప్పలేదే, ఇక్కడలా ఉందని సజీవసమాధి అన్నాడు.

ఆయన నవ్వి, పక్కన సాంబమూర్తిశాస్త్రిగారని ఉన్నారు. ఆయన వంక తిరిగి అన్నారు...గునపాలు, పారలు వాడవద్దు. మీరందరు వెళ్ళి ఏట్లో తలస్నానం చేసి, సంధ్యావందనాదికాలు పూర్తిచేసుకొని రండి. వచ్చేటప్పుడు పాలు, నీళ్లు పట్టుకురండి. పాలు పోస్తూ, నీళ్లు పోస్తూ చేతితో మట్టితీయండి అన్నారు. ఆ సాంబమూర్తిశాస్త్రిగారు వాళ్ళు పాలు పోస్తూ, నీరు పోస్తూ మట్టి తీసారు మెత్తపడిందాన్ని. కొంతసేపైన తర్వాత సాంబమూర్తిశాస్త్రి గారు ఉద్విగ్నుడై అలా ఉండిపోయారు. వెంటనే స్వామివారు కమండలంలో నీళ్లుజల్లి ఏం కనపడింది నీకు అని అడిగారు. స్వామీ! లోపల ఒక మహాపురుషుడు ఉన్నాడు. కాషాయం వస్త్రం కట్టుకొని మెడలో రుద్రాక్షమాల వేసుకొని శ్రీ రుద్రానికి భాష్యం చెప్తున్నారు. ఆయన ఎదురుకుండా ఋషులు కూర్చుని


ఉపనిషద్పారాయణ చేస్తున్నారు. లోపల నుంచి ఆయన రెండు చేతులు పైకెత్తి 'తవ్వవద్దు' అన్నారు స్వామీ, అని ఆయన స్పృహతప్పి పడిపోయారు (సాంబమూర్తిశాస్త్రిగారు). సమాధిలోకి వెళ్ళిపోయారు. ఆ తర్వాత స్వామివారు కమండలంలోని నీళ్లు జల్లితే బహిర్ముఖులయ్యారు. 'తవ్వవద్దు' అని ఆయనక్కడ శివలింగం తెప్పించి ఆ లోపల ఉన్నటువంటి స్వామివారికి అధిష్ఠానం నిర్మాణం చేయించారు.


"ప్రజ్ఞా, బ్రహ్మపదజ్ఞా"... ఆ స్థాయికి వెళ్ళిపోయినటువంటి మహాపురుషులకు ఇది తెలుసు, ఇది తెలియదు అని ఉండదు. వారు సర్వజ్ఞులై ఉంటారు. వారు బ్రహ్మమై ఉంటారు. పరమేశ్వరుడుతో కలిసి ఉండటం అంత తేలికైన విషయం కాదు. శంఖ చక్ర గదా పద్మాలు పట్టుకొని శ్రీమహావిష్ణువో, ఢమరుకం త్రిశులం పట్టుకుని పరమశివుడో వచ్చారనుకోండి హడలిపోతాం. నిజాంగా కూర్చుంటామా? కానీ జగద్గురువులు అలా స్థంభం దగ్గర కూర్చొని రాత్రి మనల్ని కూర్చోబెట్టుకొని మాట్లాడుతున్నారనుకోండి, పరమ సంతోషంతో కూర్చుని మాట్లాడతాం. గురువంటే 'అనునయం' గురువంటే 'ప్రేమ' గురువంటే 'కారుణ్యం'. అందుకే గురువుతో కలిసి ఉండటం తేలిక.




కానీ నిజానికి పరబ్రహ్మంతో అలా కలిసి ఉండటం సాధ్యమయ్యే విషయంకాదు. ఆయన 'ప్రజ్ఞ' బ్రహ్మపదాన్ని ఎరుక పొందింది. అందుకే, వారే పరబ్రహ్మమైనారు. వారికి నమస్కారం చేశాడా! సమస్త దేవతలకు నమస్కారం చేసినట్టే!. వారి పాదుకలమీద ఒక మారేడుదళం వేశాడా! అందరు దేవతలకి ఆరోజున అర్చన చేసినట్టే!. వారిముందు కైమోడ్చి ఇలా నమస్కరించాడా! సమస్తమైన లోకాలకు నమస్కరించినట్టే!. వారు తిరుగాడినటువంటి ప్రదేశంలో తిరుగాడాడా! కొన్ని కోట్ల జన్మలనుంచి తరుముకొస్తున్నటువంటి పాపరాశి 'ధ్వంసం' అవటానికి అది కారణమవుతుంది. నన్ను నమ్మండి. ఎందుకంటే, భాగవతం దశమస్కంధంలో యశోదాదేవి ఒక మాట అంటుంది. (సశేషం)

('గిని..అద్వైతగని' పుస్తకం నుంచి)






# దక్షిణామ్నాయ శృంగేరీ శ్రీశారదాపీఠ వైభవం

(గత సంచిక తరువాయి)

ఆయన తరువాత శ్రీభారతీ కృష్ణతీర్థ, శ్రీవిద్యారణ్య మహా స్వాములు వరుసగా శ్రీ శారదాపీఠాన్ని అధిరోహించారు. వీరిరువురూ పూర్వాశ్రమంలో అన్నదమ్ములే. ఏకశిలా నగరానికి కాకతీయ సామ్రాజ్య పతనానికి వారు ప్రత్యక్షసాక్షులు. వారి మనస్సులలో సనాతన ధర్మానికి ఎదురైన సంకట పరిస్థితులు ఆందోళన కలిగిస్తుంటే, శ్రీవిద్యాతీర్థులను ఆశ్రయించారు. వీరిద్దరిలో శ్రీవిద్యారణ్యులు వయస్సులో పెద్దవారు. అయితే శ్రీభారతీ కృష్ణతీర్థులు ముందుగా అంటే క్రీ.శ. 1328లో సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించారు. మూడు సంవత్సరాల తరువాత క్రీ.శ. 1331లో శ్రీవిద్యారణ్యులు ఆశ్రమాన్ని స్వీకరించారు.

క్రీ.శ. 1338లో శ్రీవిద్యాతీర్థులు తుంగాతీరంలో భూగర్భ గృహంలో అంబికా యోగ నిరతులై కూర్చొంటూ పన్నెండు సంవత్సరాల తర్వాత భూగృహాన్ని తెరవమని శిష్యులకు చెప్పారు. శ్రీ భారతీకృష్ణతీర్థుల అనుమతి లేకుండా, అసలు శ్రీవారికి తెలియకుండానే శ్రీవారి పరిచారకులు కేవలం కుతూహలంతో మూడుసంవత్సరాల తరువాత భూగర్భ గృహాన్ని తెరిచారు. అప్పుడు శ్రీవిద్యాతీర్థుల దేహం కనిపించ లేదు. ఒక లింగము మాత్రమే కనిపించింది. పరిచారకుల తొందరపాటుకు పరితపిస్తున్న శ్రీభారతీకృష్ణతీర్థులకు స్వప్నంలో గురుదర్శనమై ఉపశమనం కలిగిందట. ఆచోట శ్రీభారతీకృష్ణతీర్థులు విద్యాశంకర లింగ ప్రతిష్ఠాపన చేసి కొన్ని సంవత్సరాలలో అద్భుతమైన దేవాలయాన్ని నిర్మింపచేశారు. అదే శ్రీవిద్యాశంకర దేవాలయం. ఈనాటికీ మఠముద్రలో విద్యాశంకరుల పేరే ఉన్నది. ఈ విద్యాశంకర దేవాలయం వాస్తుశిల్ప సౌందర్యానికి చక్కటి ఉదాహరణ.

తుంగానదీ ప్రవాహం మలుపు తిరిగేచోట ఎత్తైన పీఠంపై విద్యాశంకర దేవాలయాన్ని నిర్మించారు. పశ్చిమ భాగంలో గర్భగుడి, దానికిరువైపులా విద్యాగణపతి, దుర్గా అమ్మవారు మిగిలిన మూడు వైపులా బ్రహ్మ విష్ణు మహేశ్వరుల శిల్పాలూ ఉన్నాయి. గుడి మధ్యలో పన్నెండు స్తంభాల మంటపం ఉంది. దానిని నవరంగ మంటపం అంటారు. ఈ పన్నెండు స్తంభాలు పన్నెండు జ్యోతిషరాశులకు చిహ్నాలు. ద్రావిడ సంప్రదాయంలో చెక్కబడిన విగ్రహాలు, లతలూ ఈ స్తంభాలపై ఉన్నాయి. ఇవి ఏకశిలలే. క్రింద ఎత్తిన తొండంతో ఏనుగులు, పైన శరభాలు, సింహాలు చెక్కబడ్డాయి. సింహాల నోరు తెరచి ఉంటే, ఆ నోట్లో కదిలే శిలాకందుకాలు ఉన్నాయి. వాటిని కదిలించగలం, కాని బయటికి తీయలేం. కప్పుపైన ఎనిమిది చదరపు అడుగుల చతురస్రంలో పద్మం చెక్కబడింది. ఆ పద్మం చుట్టూ ఆకులు, వాటిపై చిలుకలూ ఉన్నాయి. దేవాలయ కుడ్యాలపై అనేక దేవతా విగ్రహాలు చెక్కబడి ఉన్నాయి.

శృంగేరి పట్టణం మధ్యలో కొండపై మలహా నికరేశ్వరస్వామి దేవాలయం ఉంది. జనార్దనస్వామి దేవాలయం, కాలభైరవాలయం కూడా చెప్పుకోదగ్గవే. కిగ్గ శృంగేరి నుండి సుమారు ఐదుమైళ్ల దూరంలో ఉంది. అక్కడి ఋష్యశృంగ దేవాలయం మరో విశేషం. ఏడవ శతాబ్దానికి చెందిన అనేక శాసనాలు అక్కడ ఉన్నాయి. ఋష్యశృంగ దేవాలయ గర్భగుడిలోని లింగం రుద్రాక్ష ఆకారంలో పైన కొమ్ముతో ఉంటుంది. దేవాలయానికి

ఎడమవైపు శాంతాదేవి ఆలయం వుంది. ఈ ఆలయంలో స్వామిని శ్రద్ధగా అర్చిస్తే, కరువు కాటకాలు రావని ప్రతీతి.

తుంగానదీ, దేవాలయాలతో పాటు శృంగేరీ పవిత్రతను పెంచిన కారణం మరొకటుంది. శ్రీశంకరభగవత్పాదులు తమ ముఖ్య శిష్యగణానికి వేదాంతశాస్త్రాన్ని బోధిస్తూ శృంగేరిలో కొంత కాలం గడిపారు. ఇప్పుడు ఆయన శిష్యపరంపరకు చెందిన ఆచార్య పురుషులు శృంగేరిలోనే సంచరిస్తున్నారు. భక్తుల మనస్సులకు అనిర్వచనీయమైన స్ఫూర్తి శృంగేరిలోనే లభిస్తున్నది. ఈ జగద్గురు పరంపర సదాశివునితో ప్రారంభ మవుతుంది. శ్రీశంకర భగవత్పాదులు సాక్షాత్తూ పరమశివుని అవతారమే. వివిధ సంప్రదాయాలను క్షాళితం చేసి, వాటిని సమన్వయపరచి భారతీయ ఆధ్యాత్మిక భావనా ప్రపంచంలో ఒక సమగ్ర దృక్పథాన్ని నిర్మించి ధర్మం పతనం కాకుండా కాపాడి. వేదమతాన్ని పునరుద్ధరించటం అనే మహత్తర కార్యాన్ని మరొకరి తోడులేకుండా శ్రీశంకర భగవత్పాదులు సాధించారు. జాతీయ సమైక్యతను సాధించారు. ప్రస్థానత్రయ భాష్యాల్ని అనేక ప్రకరణ గ్రంథాలను, స్తోత్రాలను రచించారు. తమ వాక్పటిమతో ప్రతి వాదులను ఓడించారు. సర్వజ్ఞ పీఠాన్ని అధిరోహించారు. దేశం నలుమూలలా నాలుగు పీఠాలను స్థాపించి అవిచ్ఛిన్నంగా సనాతన ధర్మ ప్రచారం, అద్వైతతత్త్వ ప్రచారం జరగటానికొక శాశ్వత వ్యవస్థను ఏర్పరిచారు.

శ్రీశంకరులు స్థాపించిన నాలుగు పీఠాలలో దక్షిణ భారతంలో శృంగేరిలో ప్రారంభించిన శ్రీశారదాపీఠం అతిముఖ్యమైనది. శ్రీశంకరులు తమ జీవితకాలంలో ఎక్కువ సమయం గడిపిన స్థలమిది. శ్రీసురేశ్వరాచార్యులను శ్రీశంకరులు అక్కడ పీఠాధిపతిగా నియమించారు. ఆనాటి నుండి శ్రీశారదాపీఠంలో అవిచ్ఛిన్నంగా గురుశిష్య పరంపర కొనసాగుతూన్నది. ఆ పీఠాన్ని అధిరోహించిన ఆచార్య పురుషులందూ గొప్పవారే. తపస్సంపన్నులే.

శృంగేరీ శారదా పీఠంలో పదకొండవ పీఠాధిపతులు శ్రీ భారతీకృష్ణతీర్థులు, పన్నెండవవారు శ్రీవిద్యారణ్యులు. శ్రీవిద్యారణ్యులు హరిహర బుక్కసోదరుల చేత హిందూ సామ్రాజ్య స్థాపన చేయించ సంకల్పించి, అనేక యుద్ధాలలో వారికి విజయాన్ని ఆశీర్వదించి, వారికి క్రీ.శ. 1336లో తుంగభద్రా నదీ తీరాన విద్యానగరాన్ని రాజధానిగా నిర్మింపజేసి వారికి పట్టాభిషేకం గావించారు. దానినే విజయనగరమనీ అంటారు. అందువల్లనే శ్రీజగద్గురువులు బిరుదావళిలో 'కర్ణాటక సింహాసన ప్రతిష్ఠాపనాచార్య' అన్న బిరుదు కూడా ఉంది. శంకరానంతర అద్వైత వేదాంతానికి అనేక గ్రంథాలు ఈ కాలంలోనే రచింపబడ్డాయి. శృంగేరిపీఠం మహాసంస్థానంగా అప్పుడు ప్రసిద్ధికెక్కింది. విజయనగర సామ్రాజ్య పతనానం తరం నాయక రాజులు, ఆ తరువాత మైసూరు రాజులు జగద్గురువుల పట్ల భక్తి శ్రద్ధలను ప్రదర్శిస్తూ వచ్చారు. స్వాతంత్ర్యానంతరం శృంగేరి జాగీరును కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

శృంగేరి పీఠాధిపతులలో ముప్పది మూడవవారు శ్రీసచ్చిదానంద శివాభినవ నృసింహభారతీ మహాస్వాముల వారు. క్రీ.శ. 1879 నుండి. క్రీ.శ. 1912 వరకు వారు పీఠాధిపతులుగా ఉన్నారు. శ్రీశంకర భగవత్పాదుల అవతార స్థలాన్ని కేరళలో 'కాలటి'గా కనుగొని అచట ఒక దేవాలయాన్ని నిర్మించడం ఆ ప్రక్కనే శ్రీశారదాంబ దేవాలయాన్ని నిర్మించడం శ్రీశంకరుల మాతృమూర్తి ఆర్యాంబ సమాధిస్థలాన్ని కనుగొని అచట బృందావనాన్ని ఏర్పరచటం వారి హయాంలో జరిగిన మహత్తర కార్యక్రమాలు. వైశాఖమాసంలో శు. పాడ్యమి నుండి శు. పంచమి వరకు ఐదురోజులు శ్రీశంకరజయంతి ఉత్సవాలు జరగాలని శ్రీవారే నిర్ణయించారు. గణపతి వాక్యార్థ విద్వత్సభలూ వీరి హయాంలోనే ప్రారంభమయ్యాయి. క్రీ.శ. 1912లో శ్రీచంద్రశేఖర భారతీస్వాములవారు పీఠాధిపతి అయ్యారు. శ్రీవారు జీవన్ముక్తులు, నిత్యమూ తపస్సులో నిమగ్నులై వుండేవారు. వారి తరువాత శ్రీమదభినవ విద్యాతీర్థులు క్రీ.శ. 1954లో పీఠాన్ని అధిరోహించారు. వీరి హయాంలో శంకర మఠాలు దేశంలో ఎన్నోచోట్ల స్థాపించబడ్డాయి. దేశమంతటా వీరు సంచరించి ఆస్తికభావాలను ప్రోత్సహించారు. వారి తరువాత 1989లో శృంగేరీ శారదాపీఠాన్ని అలంకరించి తేజోభరితం చేస్తున్న ఆచార్య పురుషులు శ్రీ భారతీతీర్థ మహాస్వాములవారు. శ్రీవారు బహుభాషాకోవిదులు. బహుశాస్త్రాలను అధ్యయనం చేసిన మహాపండితులు.

శృంగేరిలో ముఖ్యంగా చూడవలసినవి శ్రీశారదాంబ దేవాలయం, శ్రీమలహానికరేశ్వరాలయం,శ్రీశంకర భగవత్పాద ఆలయం, శ్రీజనార్ధనస్వామి ఆలయం, శ్రీ విద్యాశంకర దేవాలయం, శ్రీసురేశ్వరాచార్య దేవాలయం. శ్రీ ఉగ్రనరసింహ భారతీ స్వాములవారి సమాధి, శ్రీ అభినవ సచ్చిదానంద భారతీస్వాముల వారి సమాధి, శ్రీసచ్చిదానంద భారతీస్వాములవారి సమాధి, శ్రీవిద్యాశంకర దేవాలయం వెనుకనే ఉన్నాయి. నరసింహ వనంలో శ్రీసచ్చిదానంద శివాభినవ నృసింహభారతీ భారతీ స్వాములకు, శ్రీచంద్రశేఖర భారతీస్వాములకు, శ్రీమదభినవ విద్యాతీర్థస్వాములకు అధిష్ఠానాలు నిర్మింపబడ్డాయి. శ్రీ జగద్గురువులు శ్రీ చంద్రమౌళీశ్వరునికి, శ్రీరత్నగర్భ గణపతికి, శ్రీ చక్రానికి నిత్యమూ పూజాకార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటారు. స్ఫటికలింగరూపంలో శ్రీ చంద్రమౌళీశ్వరులు, శ్రీరత్నగర్భగణపతి, శ్రీశంకరభగవత్పాదుల కాలం నుండీ సచ్చిదానంద జగద్గురువుల పూజలను అందుకుంటూనే ఉన్నారు. ■

# ధర్మజిజ్ఞాస

(గత సంచిక తరువాయి)

అది పైకి పాకి మూలాధార చక్రము (సెక్స్ గ్లాండ్స్)ను చ్చొనప్పుడు లైంగిక శక్తి వృద్ధి చెందును. అది స్వాధిష్ఠాన చక్రము (పాంక్రియాస్ - ఎడ్రినల్)ను చొచ్చొనప్పుడు అది జీర్ణశక్తిని వృద్ధిచేయును. విశుద్ధ చక్రము (థైరాయిడ్, పారాథైరాయిడ్)ను అది చొచ్చినప్పుడు లైంగిక శుద్ధి కార్యమును వేగవంత మొనర్చి దానిని (దేహమును) దృఢవంతము చేయుచున్నది. అది ఆజ్ఞా చక్రము (పిట్యూటరి)ని చొచ్చినప్పుడు వ్యక్తి ఆధిపత్యము జరుపగలడు. అది సహస్రార చక్రము (పినియల్)ను చొచ్చి నప్పుడు మూసిన కన్నులచే భ్రూమధ్యమున ఒక వెలుతురు (జ్యోతి) (లైట్)ని దర్శించగలము. ప్రాణచికిత్స (ప్రాణిక్ హీలింగ్)లో దీనిని శిరస్సుపై స్వర్ణ కిరీటము (గోల్డెన్ క్రౌన్)ను పొందడము అంటారు.

ఎప్పుడు విద్యుత్తు మెదడును చేరునో అప్పుడు అది కంప్యూటర్ యొక్క 20,000 చిప్పును ఒక్కొటొక్కటిగ నెమ్మదిగ చైతన్య వంతము చేయుచున్నది, లోపలి నుంచి నూతనోత్తేజము (జ్ఞానము) పెల్లుబుకుటకు ప్రారంభిచును. అందువల్ల ఒకనికి విషయాలపై నూతన దృక్పథము, ఒక కొత్త జీవితోద్దేశము కలుగుచున్నది. నిద్రాణమైయున్న విద్యుత్తును దేహాధారము నుండి మేల్కొ లుపు ఈ విధానమును ''కుండలినీ జాగృతి'' అందురు.

జన్మౌషధి- మంత్ర- తపః- సమాధిజాః సిద్ధయః- (పతంజలి)

కుండలిని శక్తి ఓషధుల వల్ల గానీ, మంత్రోపాసనల వల్ల గానీ, గుర్వానుగ్రహం వల్లగానీ, పూర్వజన్మవాసనాబలం వల్ల గానీ జాగృతమవుతుందని యోగులు తెలియజేస్తున్నారు. యోగశాస్త్రాలు కూడా ఈ విషయాన్ని బలపరుస్తున్నాయి.

**255. కొందరు విష్ణువు తప్ప ఇతర దేవతల్ని పూజించరాదని, మరికొందరు శివుణ్ణి తప్ప ఇంకొకరిని పూజించరాదని అంటుంటారు- ఇందులో ఏది నిజం?**

ఇంతకన్న మూర్ఖత్వం ఇంకొకటతి లేదు. పూర్వం కూడా సమన్వయధోరణి లేకపోవడం వల్లనే ఎన్నో సంఘర్షణలకు అవకాశం ఏర్పడింది. చరిత్రను పరిశీలిస్తే ఇలాంటి మతోన్మాదం వల్లనే యుద్ధాలు కూడా జరిగాయి. ప్రపంచానికి మతోన్మాదం కన్నా ప్రమాదకరమైన శత్రువు ఇంకొకటి లేదు. మతోన్మాద ఫలితాన్ని ఇవాళ అన్ని దేశాలు అనుభవిస్తున్నాయి.

ఏకోనారాయణోనద్వితీయో2స్తి కశ్చిత్
ఏకేవ శివో నిత్యస్తతో2న్యత్సకలం మృషా ॥
బహూనా2త్రకిముక్తేన సర్వం బ్రహ్మమయం జగత్
అనేక భేదభిన్నస్తు క్రీడతే పరమేశ్వరః ॥


పి. భాస్కరయోగి

నారాయణుడొక్కడే. రెండవదేదీ లేదు. ఆ నారాయణుడే నిత్యమైన శివుడు. అందుకు ఇతరమైనదంతా అసత్యం, వేయేల? ఈ జగమంతా బ్రహ్మమే. ఆ బ్రహ్మమైన పరమేశ్వరుడు అనేక విధాలుగా అవతరించి క్రీడిస్తున్నాడు.

విశ్వచైతన్యశక్తి అయిన పరబ్రహ్మ ఈ సృష్టి రచనకు అవసర మైన స్వరూపంగా మార్పు చెంది కార్యనిర్వహణ చేస్తున్నాడు. ఆ స్వరూపాలే- బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులన్న విషయం మనం మరువకూడదు. ఈ విషయాన్నే శాస్త్రాలు ఏకం సద్విప్రా బహుదా వదన్తి- ఉన్నది ఒక్కటే, తెలిసినవాళ్లు అనేక రకాలుగా చెప్పారని, ఒకేమూర్తి మూడు భాగాలై బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులైనారని కూడా చెప్పడం జరిగింది.

**నారాయణశ్శివో విష్ణుశ్శంకరః పురుషోత్తమః ।**
**ఏతేషు నామభిర్బ్రహ్మపరం ప్రోక్తం సనాతనమ్ ॥**

నారాయణ, శివ, విష్ణు, శంకర, పురుషోత్తములు- ఈ నామా లన్నీ సనాతన పరబ్రహ్మకు పేర్లు తప్ప ఇంకేమీ కాదు- అని శాస్త్రాలు నొక్కి చెబుతున్నా మనకర్థం కాకపోవడం దౌర్భాగ్యం.

అందుకే స్వామి వివేకానందుడు ఈ విషయాన్ని ఒకచోట ప్రస్తావిస్తూ 'మానవులకు కుక్కకున్న బుద్ధిజ్ఞానం లేకపోవడం విచిత్రం - ఒక కుక్క తన యజమాని ఎన్ని రకాల, ఎన్ని రంగుల దుస్తులు ధరించి వచ్చినా, గుర్తుపట్టి యదార్థం గ్రహిస్తుంది. మరి మానవులకేమయ్యింద''ని వాపోయారు.

సత్యం తెలుసుకొన్న వాళ్లకు ఈ భేదభావాలు లేనేలేవు. అంతెందుకు? శివుడు ఎల్లప్పుడు రామనామధ్యానం చేస్తున్నా నని పార్వతికి చెబుతాడు. విష్ణువును మీకెవరు ప్రీతిపాత్రమైన వారు అంటే - 'శివుడు' అంటాడు. విష్ణుసహస్రనామ స్తోత్రంలో ఈశ్వర, ఈశాన, శర్వ, శివ, రుద్ర అనే పేర్లు విష్ణువుకున్నట్లు, శివ సహస్రనామాల్లో త్రివిక్రమ, కృష్ణ, విష్వక్సేన, వైష్ణవ, పద్మ నాభ, హరి అనే పేర్లు శివునికి ఉన్నట్లు మనం గ్రహించకపోతే మనంత బుద్ధిహీనులు ఇంకొకరు ఉండరు. అయితే మరి పురాణాల్లో కొన్నిసార్లు విష్ణువుకు ప్రాధాన్యత ఉంటూ, మరోసారి శివునికి, ఇంకోసారి దేవికి ఇలా అందరికీ ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. ఈ కథలన్నీ ఆయా సందర్భాన్ని బట్టి తెలుసుకొని, అందులోని సారాన్ని గ్రహించాలి. ఆయా దేవతల గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేయడమే ఇందులోని అంతరార్థం.

**(మిగతా 63వ పేజీలో)**

# దర్శనమ్
## ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

బ్ర॥శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి గారు, పుత్రులు బ్ర॥శ్రీ గౌరీభట్ల రామకృష్ణశర్మ సిద్ధాంతి, శ్రీ సిద్ధకుంజికా పీఠము
శ్రీ మహాకాల మందిరము, విశ్వం విహార్, మేడిపల్లి (ఔదుంబరపురి), బోడుప్పల్ బస్‌డిపో, హైదరాబాద్, ఫోన్ : 94403 50868, 8008513203

శ్రీ పరాభవ సం ॥ ఉత్తరాయణం
వసంత/గ్రీష్మఋతువు
వైశాఖ-శు.పూర్ణిమ-అధికజ్యేష్ఠ-శు.పూర్ణిమ

# మే MAY 2026

ఉ: ఉదయం, మ: మధ్యాహ్నం, సా: సాయంత్రం, రా: రాత్రి, తె: తెల్లవారుఝామున, వ: వర్జ్యము, శే.వ.: శేషవర్జ్యము, ల: నుండి

| | | | | | |
|---|---|---|---|---|---|
| **S U N ఆది**<br>రాహు కాలం<br>సా. 4.30 మొ 6.00<br>యమగండ కాలం<br>మ. 12.00 మొ 1.30<br>వారదుర్ముహూర్తం<br>సా. 4.24 మొ 5.12 | **31** ○<br>పూర్ణిమ మ.12.39<br>అనూరాధ మ.3.08<br>వ.రా.9.15ల11.01 | **3**<br>విదియ రా.12.33<br>అనూరాధ పూర్తి<br>వ.ఉ.9.47ల11.33 | **10**<br>అష్టమి ఉ.10.01<br>ధనిష్ఠ రా.8.15<br>వ.రా.3.38ల5.16 | అధికజ్యేష్ఠ **17**<br>శు.పాడ్యమిరా.11.32<br>కృత్తిక సా.4.01<br>శే.వ.ఉ.6.17 | **24**<br>అష్టమి ఉ.8.59<br>మఖ ఉ.6.43<br>వ.మ.2.35ల4.10 |
| **M O N సోమ**<br>రాహు కాలం<br>ఉ. 7.30 మొ 9.00<br>యమగండ కాలం<br>ఉ. 10.30 మొ 12.00<br>వారదుర్ముహూర్తం<br>మ. 12.24 మొ 1.12<br>మ. 2.48 మొ 3.36 | పండుగలు (క్రింద చూడండి) | **4**<br>తదియ రా.2.36<br>అనూరాధ ఉ.7.52<br>వ.మ.2.00ల3.47 | **11**<br>నవమి ఉ.10.08<br>శతభిషం రా.8.51<br>వ.రా.3.22ల4.59 | **18**<br>విదియ రా.9.03<br>రోహిణి మ.2.21<br>వ.ఉ.6.59ల8.28<br>తి.రా.7.29ల8.58 | **25**<br>నవమి ఉ.8.04<br>పుబ్బ ఉ.6.33<br>వ.మ.1.50ల3.27 |
| **T U E మంగ**<br>రాహు కాలం<br>మ. 3.00 మొ 4.30<br>యమగండ కాలం<br>ఉ. 9.00 మొ 10.30<br>వారదుర్ముహూర్తం<br>ఉ. 8.24 మొ 9.12<br>రా. 10.48 మొ 11.36 | | **5**<br>చవితి రా.తె.4.43<br>జ్యేష్ఠ ఉ.10.31<br>వర్జ్యంలేదు | **12**<br>దశమి ఉ.9.47<br>పూర్వాభాద్ర రా.8.59<br>వర్జ్యంలేదు | **19**<br>తదియ సా.6.36<br>మృగశిర మ.12.41<br>వ.రా.8.31ల10.01 | **26**<br>దశమి ఉ.7.38<br>ఉత్తర ఉ.6.49<br>వ.మ.3.29ల5.08 |
| **W E D బుధ**<br>రాహు కాలం<br>మ. 12.00 మొ 1.30<br>యమగండ కాలం<br>ఉ. 7.30 మొ 9.00<br>వారదుర్ముహూర్తం<br>ఉ. 11.36 మొ 12.24 | | **6**<br>పంచమి పూర్తి<br>మూల మ.1.04<br>వ.ఉ.11.12ల1.04<br>తి.రా 11.37ల1.23 | **13**<br>ఏకాదశి ఉ.9.00<br>ఉత్తరాభాద్ర రా.8.42<br>వ.ఉ.6.28ల8.03 | **20**<br>చవితి సా.4.12<br>ఆరుద్ర ఉ.11.03<br>వ.రా.10.20ల11.50 | **27**<br>ఏకాదశి ఉ.7.42<br>హస్త ఉ.7.34<br>వ.మ.3.54ల5.35 |
| **T H U గురు**<br>రాహు కాలం<br>మ. 1.30 మొ 3.00<br>యమగండ కాలం<br>ఉ. 6.00 మొ 7.30<br>వారదుర్ముహూర్తం<br>ఉ. 10.00 మొ 10.48<br>మ. 2.48 మొ 3.36 | ధర్మశాస్త్రం ప్రకారం<br>**వాస్తుకర్తరి, అగ్నికర్తరిలలో**<br>గృహారంభం చేయరాదు, గృహప్రవేశం చేయవచ్చు | **7**<br>పంచమి ఉ.6.35<br>పూర్వాషాఢ మ.3.27<br>వ.రా.12.04ల1.48 | **14**<br>ద్వాదశి ఉ.7.44<br>రేవతి రా.7.58<br>వ.ఉ.8.20ల9.53 | **21**<br>పంచమి మ.2.00<br>పునర్వసు ఉ.9.36<br>వ.సా.5.05ల6.36 | **28**<br>ద్వాదశి ఉ.8.17<br>చిత్త ఉ.8.50<br>వ.మ.2.44ల4.27 |
| **F R I శుక్ర**<br>రాహు కాలం<br>ఉ. 10.30 మొ 12.00<br>యమగండ కాలం<br>మ. 3.00 మొ 4.30<br>వారదుర్ముహూర్తం<br>ఉ. 8.24 మొ 9.12<br>మ. 12.24 మొ 1.12 | వైశాఖం **1** ○<br>పూర్ణిమ రా.9.11<br>స్వాతి రా.3.06<br>వ.ఉ.7.13ల8.56 | **8**<br>షష్ఠి ఉ.8.05<br>ఉత్తరాషాఢ సా.5.34<br>వ.రా.9.55ల11.37 | **15**<br>త్రయోదశి ఉ.6.04<br>త.చతుర్దశి రా.తె.5.49<br>అశ్విని సా.6.52<br>వ.మ.2.58ల4.30<br>తి.రా.3.56ల5.27 | **22**<br>షష్ఠి మ.12.00<br>పుష్యమి ఉ.8.18<br>వ.రా.8.31ల10.03 | **29**<br>త్రయోదశి ఉ.9.18<br>స్వాతి ఉ.10.31<br>వ.సా.4.32ల6.17 |
| **S A T శని**<br>రాహు కాలం<br>ఉ. 9.00 మొ 10.30<br>యమగండ కాలం<br>మ. 1.30 మొ 3.00<br>వారదుర్ముహూర్తం<br>ఉ. 6.00 మొ 7.36 | వైశాఖం **2**<br>బ.పాడ్యమి రా.10.42<br>విశాఖ రా.తె.5.17<br>వ.ఉ.9.07ల10.52 | **9**<br>సప్తమి ఉ.9.20<br>శ్రవణం రా.7.07<br>వ.రా.11.23ల1.04 | **16** ●<br>అమావాస్య రా.1.54<br>భరణి సా.5.32<br>వ.రా.తె.4.47ల | **23**<br>సప్తమి ఉ.10.20<br>ఆశ్లేష ఉ.7.21<br>వ.రా.7.02ల8.35 | **30**<br>చతుర్దశి ఉ.10.51<br>విశాఖ మ.12.40<br>వ.సా.5.10ల6.56 |

### పండుగలు

1 మేడే వ్యాసపూర్ణిమ
అన్నమయ్యజయంతి
బుద్ధపూర్ణిమ
4 వాస్తుకర్తరిప్రారంభం
5 సంకష్టహరచతుర్థి
11 శ్రీహనుమజ్జయంతి
అగ్నికర్తరిప్రారంభం
కృత్తికకార్తి
13 సర్వేషాం ఏకాదశి
15 మాసశివరాత్రి
వృషభసంక్రమణం
25 అగ్నికర్తరి సమాప్తం
రోహిణికార్తి
27 సర్వేషాం ఏకాదశి
బక్రీద్
29 వాస్తుకర్తరి సమాప్తం

| తేది | సూ.ఉ. | సూ.అ. |
|---|---|---|
| 1 | 5.51 | 6.37 |
| 5 | 5.48 | 6.37 |
| 10 | 5.47 | 6.40 |
| 15 | 5.44 | 6.40 |
| 20 | 5.43 | 6.42 |
| 25 | 5.42 | 6.44 |
| 30 | 5.41 | 6.44 |

### మీ కోసం...

1.
2.
3.
4.
5.
6.
7.
8.
9.
10.
11.
12.
13.
14.
15.
16.
17.
18.
19.
20.
21.
22.
23.
24.
25.
26.
27.
28.
29.
30.
31.

# లలితా సహస్రనామ స్తోత్రం (సరళ వ్యాఖ్య)



ఆచార్య కుప్పా విజయశ్రీ

(గత సంచిక తరువాయి)

**346. ప్రగల్భా పరమోదారా పరామోదా మనోమయీ**

పరిశుద్ధమైన మనస్సునిచ్చి అంతులేని ఆనందస్వరూపమైన పరతత్వాన్ని తెలియజేసే ఉదారమైన స్వభావము, నేర్పరితనము శ్రీమాతది.

ఈ నామపారాయణ ఉపనిషత్ పారాయణతో సమానం.

**347. వ్యోమకేశీ విమానస్థా వజ్రిణీ వామకేశ్వరీ**

దట్టమైన కురులు ఆకాశమంతా వ్యాపించి ఉన్న విరాడ్రూపం శ్రీమాతది. శివుడి వామభాగానికి ఈశ్వరి అయిన శ్రీమాత ఇంద్రుడి వజ్రాయుధంలో శక్తి రూపంలో ఉంటుంది.

ఈ నామపారాయణతో మంచికేశ సంపద లభిస్తుంది.

**348. పంచయజ్ఞప్రియా పంచప్రేత మంచాధిశాయినీ**

దేవ, బ్రహ్మ, భూత, పితృ, మనుష్య యజ్ఞములు అనే యజ్ఞాలు శ్రీమాతకు ప్రియము. శ్రీమాత బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వర, సదాశివులు అనే పంచబ్రహ్మల ఆసనము మీద అధిష్టించి ఉంటుంది.

ఈ నామపారాయణతో అన్నపానాలకి లోటు ఉండదు.

**349. పంచమీ పంచభూతేశీ పంచసంఖ్యోపచారిణీ**

పంచ భూతాలు, పంచ ప్రాణాలు, పంచ తత్వాలతో కూడిన సృష్టిని శాసించే దేవత శ్రీమాత. గంధము, పుష్పం, ధూపం, దీపము, నైవేద్యము అనే పంచోపచారాలతో శ్రీమాతని పూజించాలి.

ఈ నామపారాయణతో శరీరంలో పంచ భూతాల వ్యవస్థ సక్రమంగా నడుస్తుంది.



**350. శాశ్వతీ శాశ్వతైశ్వర్యా శర్మదా శంభు మోహినీ**

సర్వకాల సర్వావస్థలయందు శాశ్వతమైన ఐశ్వర్యము, సుఖము ఇచ్చే శంభు మోహిని శ్రీమాత.

ఈ నామపారాయణతో అఖండమైన శాశ్వతమైన ఐశ్వర్యము లభిస్తుంది.

**351. ధరాధరసుతా ధన్యా ధర్మిణీ ధర్మవర్ధినీ**

హిమవంతుని పుత్రికగా పుట్టి ఆ వంశాన్ని ధన్యం చేసింది శ్రీమాత. ధర్మ స్వరూపిణి అయిన శ్రీమాత భక్తులలో ధర్మాన్ని వర్ధిల్లజేస్తుంది.

ఈ నామపారాయణతో వంశం పావనమవుతుంది.

**352. లోకాతీతా గుణాతీతా సర్వాతీతా శమాత్మికా**

లోకాలకి, గుణాలకి, సమస్త విషయాలకి అతీతమైన పరమ శాంత స్వరూపిణి శ్రీమాత.

ఈ నామపారాయణతో శాంత స్వభావం అలవడుతుంది.

**353. బంధూక కుసుమ ప్రఖ్యా బాలా లీలా వినోదినీ**

బంధూక పుష్పము వంటి ఎఱ్ఱనైన కాంతి కలది శ్రీమాత. బాలా స్వరూపిణి అయిన శ్రీమాత సృష్టి స్థితి లయలతో ఆటలాడి వినోదిస్తుంది.

ఈ నామపారాయణతో సంతానానికి అభివృద్ధి కలుగుతుంది.

**354. సుమంగళీ సుఖకరీ సువేషాఢ్యా సువాసినీ**

**355. సువాసిన్యర్చన ప్రీతా శోభనా శుద్ధ మానసా**

ఆపాదమస్తకం సుందరమైన శరీరముతో శుద్ధమైన మనస్సుతో మంగళకరమైన అలంకరణతో శోభిస్తూన్న సుమంగళి స్వరూపము శ్రీమాతది. సువాసినులను పూజించుట శ్రీమాతని పూజించుటయే. అట్టి పూజకి ప్రీతి చెంది భక్తులకి సుఖాలని ప్రసాదిస్తుంది.

ఈ నామపారాయణతో భర్త అనారోగ్యం తొలగి సౌభాగ్యము వృద్ధి చెందుతుంది.

ఈ నామాల (356-359) పారాయణతో సంతాన ప్రాప్తి కలుగుతుంది.

**356. బిందు తర్పణ సంతుష్టా పూర్వజా త్రిపురాంబికా**

శ్రీచక్రంలో ఎనిమిదో ఆవరణకి అధిదేవత త్రిపురాంబిక. సృష్టి కన్నా ముందు నుంచి ఉన్న శ్రీమాత చిన్న నీటి బిందువుతో తర్పణం ఇచ్చినా సంతుష్టి చెందుతుంది.

**357. దశముద్రా సమారాధ్యా త్రిపురాశ్రీ వశంకరీ**

సర్వసంక్షోభిణీ మొదలైన పది

ముద్రలతో ఆరాధింపబడేది శ్రీమాత. సృష్టి అంతా త్రిపురములే (మూడు గుణాలు, శరీరాలు, అవస్థలు మొదలైనవి). వాటిలో ఉండే శక్తి శ్రీమాత. అందుకే సర్వమూ శ్రీమాత వశము.

**358. జ్ఞానముద్రా జ్ఞానగమ్యా జ్ఞాన జ్ఞేయ స్వరూపిణీ**

ఆత్మ పరమాత్మలో లీనమయ్యే స్థితిని సూచించే జ్ఞాన ముద్ర శ్రీమాత స్వరూపం. శ్రీమాత జ్ఞాన స్వరూపము.

ఆమెను తెలుసుకోవాలంటే అది ఆమె ద్వారానే సాధ్యము.

**359. యోనిముద్రా త్రిఖండేశీ త్రిగుణాంబా త్రికోణగా**

శ్రీచక్రంలో త్రికోణ మధ్యంలో ఉండే బిందువులో ఉండే శ్రీమాత నమస్కార ముద్ర అయిన యోని ముద్ర, పది ముద్రలలో ఆఖరిదయిన త్రిఖండ ముద్రలతో ఆరాధింపబడేది. సర్వ సృష్టికి ఆధారమైన సత్వ రజ తమో గుణాలకు అధిపతి శ్రీమాత.

**360. అనఘా-ద్భుత చారిత్రా వాంఛితార్థ ప్రదాయినీ**

శ్రీమాత చరిత్ర అద్భుతమైంది - విన్నవారికి, చదివిన వారికి పాపాలను నశింపజేసి కోరిన కోర్కెలు ప్రసాదిస్తుంది.

ఈ నామపారాయణతో కోరిన కోర్కెలు నెరవేరుతాయి.

**361. అభ్యాసాతిశయజ్ఞాతా షడధ్వాతీతరూపిణీ**

ఎక్కువగా సాధన చేసి మాత్రమే శ్రీమాతని తెలుసుకొనగలము. వేదవిజ్ఞానములలోగల ఆరు మార్గాలకు కూడా అందనటువంటి రూపం శ్రీమాతది.

ఈ నామపారాయణతో అభ్యాసం చేత శ్రీమాత దర్శనం లభిస్తుంది.

**362. అవ్యాజకరుణామూర్తి రజ్ఞానధ్వాంత దీపికా**

**363. ఆబాలగోపవిదితా సర్వానుల్లంఘ్యశాసనా**

ఆబాలగోపాలానికి అవ్యాజమైన కరుణతో అజ్ఞానాన్ని నశింపజేసి జ్ఞానజ్యోతిని వెలిగిస్తుంది శ్రీమాత. ఆమె శాసనాన్ని ప్రపంచంలో ఎవరూ అతిక్రమించలేరు.

ఈ నామపారాయణతో అజ్ఞానం తొలగి జ్ఞానం లభిస్తుంది.

**364. శ్రీచక్రరాజ నిలయా శ్రీమత్త్రిపురసుందరీ**

**365. శ్రీశివాశక్త్యైక్య రూపిణీ లలితాంబికా**

శ్రీమాత లలితాంబిక శ్రీచక్రరాజ నిలయ. మంగళకరమైన శోభాయమానమైన స్వరూపం.

శివ శక్తుల ఐక్య స్వరూపం. ఆమెయే శ్రీ మహా త్రిపుర సుందరి.

ఈ నామపారాయణతో శ్రీమాత అనుగ్రహం సంపూర్ణంగా లభిస్తుంది. (సశేషం)


అద్భుతమైన స్తోత్ర సంపద, ఇప్పుడు మీకు అందుబాటులో ఈ వెబ్‌సైట్ లో !!

stotranidhi.com

తెలుగు । ಕನ್ನಡ । தமிழ் । देवनागरी । english

www.stotranidhi.com



- దేవ, ఋషి ప్రోక్త స్తోత్రములు
- మహా మహిమాన్వితమైన స్తోత్రములు
- అరుదుగా లభించే విశేష స్తుతులు
- పూజా విధానములు, వ్రతములు
- అష్టోత్తరములు, సహస్రనామములు
- స్వరసహిత వేద సూక్తములు
- సంధ్యావందనం, సుందరకాండ
- శ్రీమద్భగవద్గీత, దుర్గా సప్తశతి
- కీర్తనలు, మంగళ హారతులు
- ... ఇంకా ఎన్నెన్నో !!

Scan this QR code to visit website

పూజా కార్యక్రమాలలో, పండుగ రోజులలో, ఆలయాలలో మరియు మీ దైవకార్యాలలో పఠించండి, తరించండి !!

Email: stotranidhi@gmail.com /stotranidhi Download on the App Store GET IT ON Google Play

# ధృతరాష్ట్రుడు శతయూపుడి ఆశ్రమం చేరుట

**ధృతరాష్ట్రుడు గంగ అవతలి ఒడ్డున ఉన్న శతయూపుని ఆశ్రమ సమీపానికి రాగానే, పాండవులు కుంతిని గాంధారీ ధృతరాష్ట్రులకు అప్పగించి, కన్నీళ్లతో తడిసిన ముఖాలతో వెనుదిరిగి వచ్చి తమ కాంతలతో పుట్టెడు దుఃఖంతో తమ తమ ఇండ్లలో ప్రవేశించాడు.**



డా. ఎమ్వీఎస్ సత్యనారాయణ

పాండవులు విడిచి వెళ్లిన తర్వాత అక్కడ నిత్యమూ అగ్నికార్యానికి అవసరమైన ఋత్విక్కులను తీసికొని గాంధారి, కుంతి, విదురుడు, సంజయుడు తనతో రాగా ధృతరాష్ట్రుడు నిశ్చింతగా గంగ ఒడ్డుకు చేరుకున్నాడు. తనతో వచ్చిన బలగంతో అక్కడ ఆనాటికి తన బసను ఏర్పాటు చేసుకున్నాడు. బ్రాహ్మణులు తయారుచేసిన అగ్నులకు అర్చనలు చేసి అందరూ భోజనం చేసిన తరువాత విదురుడు సంజయుడూ సిద్ధం చేసిన దర్భల పడకమీద విశ్రాంతిగా కూర్చున్నాడు ధృతరాష్ట్రుడు. ఆయనకు కొంచెం ప్రక్కగా గాంధారి, ఆమెకు దగ్గరలో కుంతి, అక్కడికి కొంచెం ప్రక్కగా విదురుడు, సంజయుడు వారందరికీ చుట్టూ ఋత్విక్కులు విశ్రాంతి తీసికొన్నారు. ఆ రాత్రి గంగ ఒడ్డునే గడిపి మర్నాడు ఉదయాన్నే చేయవలసిన హోమాది విధులన్నీ పూర్తి చేసి ధృతరాష్ట్రుడు అందరిలో కలిసి గంగా నదిని దాటి ఆవలి ఒడ్డున ఉన్న కురుక్షేత్రంలో ప్రవేశించాడు.

కేకయ వంశంలో శ్రేష్ఠుడూ, గొప్ప తపస్వి అయిన శతయూపుడనే రాజర్షి ధృతరాష్ట్రుడు వనవాసార్థం గాంధారీ మొదలగు వారితో వచ్చి తన ఆశ్రమ సమీపాన ఉన్నాడని తెలిసికొని వచ్చి, వారందరినీ సగౌరవంగా తన ఆశ్రమానికి తీసికొనివెళ్లి అర్ఘ్యం మొదలైన సత్కారాలు చేశాడు. ధృతరాష్ట్రుడు శతయూపుడి ఆశ్రమంలో నివసించాలని కోరగా, విదురుడు అక్కడికి అతి సమీపంలో తగిన విధంగా పర్ణశాలను నిర్మింపజేశాడు. ధృతరాష్ట్రుడు-గాంధారీ నారచీరలు ధరించి నియమాలు పాటిస్తూ ఉండగా కుంతి, విదురాదులు సమీపంలో ఉన్న పర్ణశాలలో తపస్సు చేసికొంటున్నారు.

ధృతరాష్ట్రుడు ఆ ప్రకారంగా తీవ్రమైన తపస్సును ఆచరిస్తూ ఉండగా, ఒకరోజు నారదుడు, పర్వతుడు, దేవలుడు మొదలైన మహర్షులు ధృతరాష్ట్రుడిని చూడడానికి అక్కడికి వచ్చారు. మహర్షుల రాకను విన్న శతయూపుడు కూడా అక్కడికి వచ్చాడు. అప్పుడు కుంతి సవినయంగా వారందరినీ పూజించగా వారంతా సంతోషించారు. ధృతరాష్ట్రుడు ఆ మహర్షులందరికీ వంగి నమస్కరించి ఆశీస్సులు అందుకున్నాడు. కుశలాదిక సంభాషణలో నారదుడు ధృతరాష్ట్రునితో "పూర్వం ఈ శతయూపునికి తాతగారైన 'సహస్రచిత్యుడు' ఇక్కడ తపస్సు చేసి ఇంద్రుడి స్నేహాన్ని పొందాడు. ఆ తర్వాత పృషధ్రుడూ, శైలాలయుడు ఈ ఆశ్రమంలోనే తపస్సు చేసి ఇంద్రలోకం పొందారు. వారందరినీ నేను ఇక్కడ, అక్కడ కూడా ఎరుగుదును. ఈ ఆశ్రమానికి రావడం సామాన్యులకు సాధ్యం కాదు. నీకు వ్యాసుడి దయవల్ల ఈ ఆశ్రమంలో నివసించే అవకాశం లభించింది. మహారాజా! విశిష్టమైన ఈ ఆశ్రమంలో తపస్సు చేయడం వల్ల నీవు కూడా 'సహస్రచిత్యుడు' మొదలగు పూర్వపు రాజులవలె ఉత్తమగతిని పొందుతావు. గాంధారి నిన్ను అనుసరించి వస్తుంది. కుంతి తన భర్త పాండురాజు దగ్గరకు వెడుతుంది. ధర్మస్వరూపుడైన ధర్మరాజు తన ఆత్మ కాబట్టి విదురుడు ధర్మరాజు శరీరంలో ప్రవేశిస్తాడు. సంజయుడు స్వర్గలోకానికి వెళ్లి ప్రకాశిస్తాడు" అనగానే అందరూ సంతోషించారు.

అప్పుడు శతయూపుడు నారదునితో "మునీంద్రా! అన్నీ తెలిసిన మిమ్మల్ని ఒక విషయం అడుగుతాను. దయతో చెప్పండి. ఈ ధృతరాష్ట్రుడు ఉత్తమగతిని పొందుతాడని చెప్పావు. ఆ విషయాన్ని నాకు పూర్తిగా వివరించండి." అప్పుడు నారదుడు- "ఓ పుణ్యాత్మా! ఒకానొకప్పుడు నేను దేవేద్రుడి దగ్గరకు వెళ్లినప్పుడు మాటల సందర్భంలో ఈ ధృతరాష్ట్రుడి వృత్తాంతం ప్రస్తావనకు వచ్చింది. అప్పుడు ఇంద్రుడు నాతో ఇట్లా అన్నాడు- "మహర్షీ! ఈ ధృతరాష్ట్రుని తీవ్ర తపోనిష్ఠను అందరూ ప్రశంసిస్తున్నారు. ఈతడు మూడు సంవత్సరాలు వనవాసంలో తపస్సు చేస్తాడు. ఆ తరువాత తానూ, గాంధారీ వారి శరీరాలు విడిచిపెట్టి, కుబేరుడితో మైత్రి పొంది, దివ్యమైన ఆభరణాలు ధరించి, పుష్పక విమానంలో విహరిస్తూ సంతోషంగా వెలుగుతాడు." ఆ నారదుని మాటలు విన్న ధృతరాష్ట్రుడి మనస్సు నిండా ఆనందం పొందింది. అక్కడున్న

వారందరి మనస్సులలోనూ ప్రీతి అతిశయించింది. ఈ విధంగా మంచి మాటలతో సమావేశం ముగియగానే అందరూ తమ తమ నివాసాలకు వెళ్లిపోయారు.

అక్కడ హస్తినాపురంలో పాండవులు తల్లిని, గాంధారీ ధృతరాష్ట్రులను చాలాసార్లు తలచుకొంటూ దుఃఖిస్తున్నారు. "ముసలివాడైన ధృతరాష్ట్రుడు సుఖపడవలసిన సమయంలో నిర్జరారణ్యంలో ఏవిధంగా ఉండగలడు? గాంధారీ-కుంతి ఇరువురూ చాలా సుకుమారులు. వారు అడవి కష్టాలను ఎలా ఓర్చుకొంటారు? పాండవుల వంటి ఉత్తమ కుమారులను విడిచిపెట్టి కుంతి ఎందుకు అడవికి వెళ్లిందో? తల్లి దూరమైనందుకు ఈ పాండవులు ఎంత దుఃఖిస్తున్నారో" - అంటూ హస్తినాపురం ప్రజలు కూడా మిక్కిలి దుఃఖించారు. ధర్మరాజు సోదరులను, దుఃఖిస్తున్న పరిజనులను ఒకచోటికి చేర్చి ఇలా దుఃఖిస్తూ ఉంటున్నాడు- "గాంధారీ-ధృతరాష్ట్రుల కొడుకులందరూ మరణించారు. ఇటువంటి దుస్థితిలో, పండు ముసలి ప్రాయంలో అడవికి వెళ్లారు. మా తల్లి కుంతి పచ్చికూరలు తింటూ అడవులలో ఇంకా ఎన్నాళ్లు ఉండగలదో? నిర్దాక్షిణ్యంగా బంధువులను చంపేశాం. పరాక్రమవంతుడైన అభిమన్యుడిని, తమ్ముళ్లయిన ద్రౌపది కొడుకులు మొదలగు వారిని అపకీర్తికరంగా సోదరుడైన కర్ణుడిని పోగొట్టుకున్నాం. ఏకాకులం అయినాం." అంతేకాదు విదురుడిని, సంజయుడిని తలచుకొని పాండవులు ప్రతిరోజూ దుఃఖంతో అలసట పొందుతున్నారు. తమకు ఇష్టమైన సుఖాలు విడిచిపెట్టారు. వేడుకలపై కోరికనే వదిలివేశారు. రాజ్యం మీద ఆలోచన కూడా తొలగిపోయింది. తమకు అర్హమైన స్థితిని పోగొట్టుకొన్నారు. ఆ పాండవుల విచారం మరింత ఎక్కువయ్యేట్లుగా ద్రౌపదీ సుభద్రలు బాధపడుతూ ఉండేవారు. పాండవులు ఈవిధంగా ఉత్తమ ధైర్యాన్ని కోల్పోయి- మనస్సు ఆగక ముసలివారు, గ్రుడ్డివాడు, కుమారులనందరినీ పోగొట్టుకొని ఒంటరివాడైన ధృతరాష్ట్రుడిని చూడడానికి పూనుకొన్నారు. (సశేషం)

---

**58వ పేజీ తరువాయి... ధర్మజిజ్ఞాస...**

**హరిశంకర యోర్మధ్యే బ్రహ్మణశ్చాపియోనరః**
**భేదకృన్నరకం భక్తేయావదా చంద్ర తారకమ్ ॥**

శ్రీమన్నారాయణుని గాని, శ్రీ పరమేశ్వరుని గాని, శ్రీ బ్రహ్మ దేవునిగాని భేదభావంతో చూసేవాళ్లు చంద్ర నక్షత్రాలున్నంత వరకు నరకం అనుభవిస్తారు- అని శాస్త్రాలే చెబుతున్నాయి.

**శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే ।**
**శివస్య హృదయం విష్ణు ర్విష్ణోశ్చ హృదయం శివః ॥**

(స్కందోపనిషత్)

శివుని రూపమే విష్ణువు, విష్ణువు రూపమే శివుడు. శివుని హృదయమే విష్ణువు, వనిష్ణువు హృదయమే శివుడని శ్రుతులు కూడా తెలియజేస్తున్నాయి. కాబట్టి దేవతల పట్ల ఈ బుద్ధి భేదం ఎంత మాత్రం తగదు.

శ్రీ శంకరపీఠాధిపతులు అసురసంధ్యవేళ చంద్రమౌళీశ్వర స్వామిని, శ్రీచక్రాన్ని అర్చించి, 'నారాయణా, నారాయణా' అని నామోచ్చారణ చేస్తారు. శివకేశవులకు భేదం పాటించరు. తిక్కన లాంటి కవులు కూడా ఈ భేదభావం తొలగించడానికే హరిహరాద్వైతాన్ని ప్రతిపాదించారు. వ్యాసభారతంలో కూడా హరిహరాద్వైతం స్పష్టంగా కన్పిస్తుంది. దృష్టిలో భేదం ఉంది కాని, సృష్టిలో భేదం లేదని తన మహాభారత రచనలో నిరూపించారు. పోతన మహాభాగవతంలో కృష్ణుణ్ణి శివుడుగా ఎలా వర్ణించాడో చూడండి.


**సీ ॥ తనువున నంటిన ధరణీపరాగంబు**
**పూసిననెఱి భూతి పూతగాగ**
**ముందర వెలుగొందు ముక్తాలలామంబు**
**తొగల సంగడికాని తునకగాగ**
**ఫాలభాగంబున బరుగుకావిరిబొట్టు**
**కాముని గెల్చిన కన్నుగాగ**
**కంఠమాలికలోని ఘననీలరత్నంబు**
**కమనీయమౌ మోడకప్పుగాగ**
**ఆవె॥ హారవల్లులురగహారవల్లులుగాగ**
**బారలీల గోప బాలకుండు**
**శివుని పగిదినొప్పె శివునికి తనకును**
**పేరులేమి దెలియ వెలయునట్లు ॥**

(భాగవతం - దశమస్కంధం)

పండరీపూర్ పాండురంగనికి మొలత్రాడు తయారుచేసిన శైవ స్వర్ణకారుని కథ. 1. విశ్వేశ్వరునిలో దర్శించిన ఘంటాకర్ణుని కథ 2. ప్రతాపరుద్రుడు చేయించిన విగ్రహం కథ 3. ఈ భేద భావాన్ని రూపమాపడానికే చెప్పబడ్డాయి.

1) పండరీపూర్ స్వర్ణకారుని కథ : పండరీపురంలో ఒక స్వర్ణకారుడుండేవాడు. ఆయన పరమశివభక్తుడు. ఒకసారి పాండురంగనికి మొలత్రాడు చేయించడానికి దేవాలయ అధికారులు ఈ స్వర్ణకారుణ్ణి పిలిపించారు. ఆయన తాను శైవుణ్ణి కాబట్టి వైష్ణవదేవతల ముఖం చూడకూడదని కళ్లుమూసుకొని దారంతో పాండురంగని నడుముకొలత తీసుకొన్నాడు. (సశేషం)

# మీ రాశి




**మేషం** (అశ్వని 4 పాదాలు, భరణి 4 పాదాలు, కృత్తిక 1వ పాదం)

అపకీర్తి రాకుండా జాగ్రత్త పడుట మంచిది. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ప్రయాణాల్లో వ్యయ, ప్రయాసలు తప్పవు. కలహాలకు దూరంగా ఉండుటకు ప్రయత్నించాలి. దూర వ్యక్తుల పరిచయం ఏర్పడుతుంది. ఆకస్మిక ధనలాభముం టుంది. కుటుంబంలో ఆనందోత్సాహాలు లభిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు. సమాజంలో గౌరవం లభిస్తుంది. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ప్రతి విషయంలో అభివృద్ధి ఉంటుంది. పిల్లలపట్ల జాగ్రత్తగా నుండుట మంచిది.




**వృషభం** (కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి 4 పాదాలు, మృగశిర 1,2 పాదాలు)

మానసికానందం లభిస్తుంది. గతంలో వాయిదా వేయబడిన పనులు పూర్తవు తాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. వృత్తిరీత్యా అభివృద్ధిని సాధిస్తారు. కుటుంబ పరిస్థి తులు సంతృప్తికరంగా నుంటాయి. కొన్ని జటిలమైన సమస్య లకు పరిష్కారం లభిస్తుంది. ధర్మకార్యాలు చేయుటయందు ఆసక్తి పెరుగుతుంది. దైవదర్శనం చేసుకుంటారు. కుటుంబ సౌఖ్యముంటుంది. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ఆకస్మిక ధన లాభముంటుంది. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయ త్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు.




**మిథునం** (మృగశిర 3,4 పాదాలు, ఆరుద్ర 4 పాదాలు, పునర్వసు 1,2,3 పాదాలు)

కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవు తుంది. అనారోగ్య బాధలు స్వల్పంగా వున్నాయి. వేళ ప్రకారం భుజించుటకు ప్రాధాన్యమిస్తారు. చంచలంవల్ల కొన్ని ఇబ్బందులెదురవుతాయి. మనోనిగ్రహానికి ప్రయత్నించాలి. పిల్లలపట్ల ఏమాత్రం అశ్రద్ధ పనికిరాదు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుం టారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభంలో ఆనం దంగా ఉంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో సఫలీకృతు లవుతారు. కీర్తి, ప్రతిష్ఠలు అధికమవుతాయి. విందులు, వినో దాల్లో పాల్గొంటారు. ఆర్థిక ఇబ్బందులుండవు.




**కర్కాటకం** (పునర్వసు 4వ పాదం, పుష్యమి 4 పాదాలు, ఆశ్లేష 4 పాదాలు)

వృత్తిరీత్యా అనుకూల స్థానచలనం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమత మవుతారు. పోట్లాటలకు దూరంగా నుండుట మంచిది. అనారోగ్య బాధలధిగమించుటకు ఔషధసేవ తప్పదు. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో తొందరపాటు పనికి రాదు. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విష యంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్నకార్యాలు ఆలస్యంగా సఫలమవుతాయి. చెడుపనులకు దూరంగా నుండుట మంచిది. వృత్తి ఉద్యోగరంగాల్లో అభివృద్ధి ఉంటుంది.



**సింహం** (మఖ 4 పాదాలు, పుబ్బ 4 పాదాలు, ఉత్తర 1వ పాదం)


స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో సమయస్ఫూర్తి అవసరం. నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. అపకీర్తి వచ్చే అవకాశముం టుంది. ఇతరులకు అపకారం కలిగించే పనులకు దూరంగా నుండుట మంచిది. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చినచో అనారోగ్య బాధలుండవు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుండును. ఆరోగ్యం గూర్చి శ్రద్ధ వహించాలి. ఆర్థిక ఇబ్బందు లతో సతమతమవు తారు. నూతనకార్యాలు ప్రారంభించకుండా నుండుట మంచిది. ఆత్మీయుల సహాయసహకారాలకై సమయం వెచ్చించాల్సి వస్తుంది.



**కన్య** (ఉత్తర 2,3,4 పాదాలు, హస్త 4 పాదాలు, చిత్త 1,2 పాదాలు)


కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధననష్టం కలిగే అవ కాశం ఉంటుంది. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు. బంధు, మిత్రులతో కలహించుకోకుండా జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తి, ఉద్యోగరంగాల్లో సహనం వహించక తప్పదు. సంతోషంగా కాలం గడుపుతారు. శుభ వార్త వింటారు. కుటుంబ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. తోటివారి ప్రశంసలందుకుందురు. విందులు, వినోదాల్లో పాల్గొనే అవ

కాశం ఉంది. ఆర్థికంగా బలపడతారు. స్త్రీలు మనోల్లాసాన్ని పొందెదరు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం ఉంటుంది.




**తుల** (చిత్త 3,4 పాదాలు, స్వాతి 4 పాదాలు, విశాఖ 1,2,3 పాదాలు)

ఇంతవరకు అనుభవించిన కష్టాలన్నీ క్రమేణ తొలగిపోతాయి. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబసౌఖ్యం సంపూర్ణంగా వుంటుంది. బంధు, మిత్రులతో కలిసి సరదాగా కాలక్షేపం చేస్తారు. ఆకస్మిక ధనలాభముంటుంది. గొప్ప వ్యక్తిని కలుస్తారు. అకాల భోజనాదులవల్ల అనారోగ్య మేర్పడుతుంది. పిల్లల పట్ల ఎక్కువ పట్టుదలతో నుండుట అంత మంచిదికాదు. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. మనోద్వేగానికి గురి అవుతారు. కోపాన్ని తగ్గించుకోవడం అన్నివిధాలా శ్రేయస్కరం. క్రొత్త పనులు ప్రారంభించరాదు.



**వృశ్చికం** (విశాఖ 4వ పాదం, అనూరాధ 4 పాదాలు, జ్యేష్ఠ 4 పాదాలు)

ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో విరోధమేర్పడే అవకాశాలుంటాయి. స్త్రీల మూలకంగా శత్రు బాధలనుభవిస్తారు. ఏదో ఒక విషయం మనస్తాపానికి గురి చేస్తుంది. పిల్లలపట్ల మిక్కిలి పట్టుదల పనికిరాదు. పగ సాధించు ప్రయత్నాన్ని వదిలివేయడం మంచిది. కుటుంబంలో సుఖసంతోషాలుంటాయి. ధనధాన్యాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు విజయాన్ని సాధిస్తారు. ప్రయత్న కార్యములు ఫలిస్తాయి. గృహంలో జరిగే మార్పులు సంతృప్తి నిస్తాయి. బంధుమిత్రులతో కలుస్తారు. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం.



**ధనుస్సు** (మూల 4 పాదాలు, పూర్వాషాఢ 4 పాదాలు, ఉత్తరాషాఢ 1వ పాదం)

అపకీర్తి రాకుండా జాగ్రత్తపడుట మంచిది. మనోల్లాసాన్ని పొందుతారు. సోదరులతో వైరమేర్పడకుండా మెలగాలి. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. ఆర్థిక ఇబ్బందులు ఆలస్యంగా తొలగిపోతాయి. నూతన వ్యక్తులజోలికి వెళ్లరాదు. రాజకీయ వ్యవహారాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ఇతరులకు ఉపకరించు పనులు చేపడతారు. గౌరవ మర్యాదలు లభిస్తాయి. శుభవార్తలు వింటారు.




**మకరం** (ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం 4 పాదాలు, ధనిష్ఠ 1,2 పాదాలు)

తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తి చేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్యబాధలుండవు. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది. మీ ఆలోచనలు ప్రణాళికాబద్ధంగా ఉంటాయి. అనుకూల పరిస్థితులేర్పడతాయి. గొప్పవారి పరిచయం ఏర్పడుతుంది. స్త్రీల మూలకంగా లాభం వుంటుంది. మంచి ఆలోచనలను కలిగివుంటారు. బంధు, మిత్రులు గౌరవిస్తారు. కుటుంబసౌఖ్యం సంపూర్ణంగా పొందుతారు. సత్కార్యాల్లో పాల్గొంటారు. గృహ అవసరాలకు ప్రాధాన్యమిస్తారు. వ్యవసాయ రంగంవారికి లాభదాయకంగా ఉంటుంది.



**కుంభం** (ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం 4 పాదాలు, పూర్వాభాద్ర 3 పాదాలు)

వ్యవసాయరంగంలోని వారికి లాభదాయకంగా ఉంటుంది. తొందరపాటువల్ల ప్రయత్నకార్యాలు చెడిపోతాయి. చెడును కోరేవారికి దూరంగా నుండుట మంచిది. ఆకస్మిక భయము, ఆందోళన ఆవహిస్తాయి. శారీరకంగా బలహీన మేర్పడుతుంది. కుటుంబ కలహాలు దూరమవుతాయి. ప్రయత్నకార్యాలకు ఆటంకాలెదురవుతాయి. వృథా ప్రయాణాల వల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా వుండుట మంచిది. అందరితో స్నేహంగా నుండుటకు ప్రయత్నించాలి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా వుంటాయి. మనస్సు చంచలంగా ఉంటుంది. బంధుమిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త పడాలి.



**మీనం** (పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర 4 పాదాలు, రేవతి 4 పాదాలు)

వ్యాపారంలో విశేషలాభాన్ని ఆర్జిస్తారు. మంచివారితో స్నేహం చేస్తారు. అంతటా సుఖమే లభిస్తుంది. ఆకస్మిక ధనలాభముంటుంది. బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. ఒక ముఖ్యమైన సమాచారాన్ని సేకరిస్తారు. నూతన వస్తు, ఆభరణాలను కొనుగోలు చేస్తారు. ఋణప్రయత్నాలు ఫలించును. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండక మానసికాందోళన చెందుతారు. స్త్రీలకు స్వల్ప అనారోగ్య బాధలుండును. బంధు, మిత్రులతో జాగ్రత్తగా ఉండడం మంచిది. అనుకూల స్థానచలనం కలిగే అవకాశాలున్నాయి.

**- గౌరీభట్ల రామకృష్ణ శర్మ**

## పదసంపద-255

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ✡ | 3 | 4 | 5 | | 6 |
| | ✡ | 7 | 8 | ✡ | 9 | | ✡ | |
| 10 | | ✡ | 11 | 12 | | ✡ | 13 | |
| | ✡ | 14 | | | ✡ | 15 | | |
| ✡ | 16 | | | ✡ | 17 | | | |
| 18 | | | ✡ | 19 | | ✡ | | ✡ |
| 20 | | ✡ | 21 | | | 22 | ✡ | 23 |
| | ✡ | 24 | | ✡ | 25 | | 26 | |
| 27 | | | | | ✡ | 28 | | |

పదసంపన్నులు

పేరు ______________________

విలాసం ______________________

______________________

పిన్ ____________ ఫోన్ ____________

పద సంపద సమాధానాలను ఈ నెల 15 తేదీలోగా మా చిరునామాకు పంపాలి.

**దర్శనమ్** ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

ఇం.నెం. 29-105/4/1, న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్-56

మీ అభిప్రాయాలను baludarshanam@gmail.comకు పంపగలరు.

### పదసంపద-254 సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 వి | శ్వా | 2 మి | త్ర | ✡ | 3 స్థ | 4 ప్ర | 5 న | 6 వా |
| శా | ✡ | థ్య | ✡ | 7 శ్రీ | ✡ | 8 భ | వ | సం |
| 9 లా | లి | ✡ | 10 న | సీ | 11 బు | ✡ | 12 మి | తి |
| క్షి | ✡ | 13 ప | ✡ | 14 తా | డ | 15 నం | ✡ | క |
| ✡ | 16 ప | రం | 17 ప | రా | గ | త | ము | ✡ |
| 18 ప | ✡ | 19 బు | తా | మ | ✡ | కే | ✡ | 20 అ |
| 21 రి | 22 సా | ✡ | 23 ప్ర | చం | డ | ✡ | 24 స్ర | ష్టా |
| 25 మి | థి | 26 ల | ✡ | ద్రా | ✡ | 27 ప్ర | ✡ | థ్యా |
| 28 తి | ర | గ | లి | ✡ | 29 వా | జ | పే | యి |

### ఏప్రిల్ నెల విజేతలు

**కాశీభట్ల మంజులాదత్తా**
చందానగర్, హైదరాబాద్

**భండారు శ్రీనివాసరావు**
హైదరాబాద్

**వనమాల రామలింగాచారి**
ప్రశాంత్‌నగర్, యాదగిరిగుట్ట

**గుళ్లపల్లి ఉదయ కుమార్**
విజయవాడ

**రాయపెద్ది అప్పాశేషశాస్త్రి**
శ్రీనివాస నగర్, ఆదోని

**కీసర ఇషన్వీశర్మ**
మిల్టన్, కెనడా

# ఆధారాలు

### అడ్డం

1. విద్యాసంవత్సరం చివర వచ్చేది (3)
3. ఎట్నుంచైనా తెనాలి రామకృష్ణుని బిరుదే (5)
7. తల్లీ! (2)
9. సీతాపతీ! (2)
10. పూర్వకాలపు వైద్యులు ఇది చూసి వైద్యమందించే వారు (2)
11. హంస (3)
13. మజ్జిగ (2)
14. రాగము లేనివాడు (3)
15. స్వప్నంతో వాంతులు, విరేచనాల వ్యాధి (3)
16. వినకు, తినకు లాగే మాట్లాడకు (3)
17. బాలకులలో శ్రేష్ఠుడు, చిన్న తేడు (4)
18. అంతములేని (3)
19. పంటపొలాల (2)
20. ఆడ కాని (2)
21. 'వలయ' మంతమందున్నభూమి (4)
24. క్షీరము, వంతు (2)
25. తెల్ల కలువ తీగ (4)
27. హరిశ్చంద్రుని వేధించిన విశ్వమిత్రుని శిష్యుడు (5)
28. ఓడప్రయాణిక (3)

### నిలువు

1. బొడ్డులో కమలంగల దేవా! (4)
2. సహనగుణమున్నదానా! భూమీ! (2)
4. భయంకరమైన, అగ్నికీలలు వెదజల్లే (3)
5. తలకిందులైన వాక్కు (2)
6. అజ్ఞాతవాసంలో పాం డవులాశ్రయించిన తేడు(5)
8. పద్మపత్ర... (4)
12. బైరాగిలో ధాన్యం (2)
13. మన్మథుడు, జాలమేసే తేడు (4)
14. గరుత్మంతుని జనని (3)
15. స్వప్న (2)
16. అంగాలు లేని, మదన (3)
17. 'పిల్లలకు' (4)
18. మలినము కాని (4)
19. సత్తువ, బలం (2)
21. ఎటునుంచైనా కులకడమే (3)
22. త్వరలో పుష్కరాలొస్తున్న నదిని పిలుద్దామా! (3)
23. పూర్వకాలపు ధాన్యపు కొలత (3)
24. నాటకంలోనూ వంటింట్లోనూ ఉండేది (2)
26. స్వర్గం (2)

**పద సంపాదకులు : ఎం. దత్తాత్రేయశర్మ**

Edited Printed, Published and Owned by Marumamula Rukmini, Printed at Capital Graphics, 118 Chenoy Trade Centre, Parklane, Secunderabad-500003, Published at 601, Chenoy Trade Centre, Parklane, Secunderabad-500003, Editor: Marumamula Rukmini.



# బ్రహ్మస్వభవనం ట్రస్టు,వారణాసి

సోనార్‌పురా,క్షీర్‌సాగర్ స్వీట్‌హౌజ్ పక్కన,కేదారఖండం



**కాశీలో సదాచారసంపన్నులకు సకల వసతులతో రూ.ఐదు కోట్ల వ్యయంతో ఐదు అంతస్తుల ధార్మిక బ్రహ్మస్వ భవనం నిర్మాణం**

కాశీలోని కేదారఖండం సోనార్‌పురాలో శ్రీశ్రీశ్రీ బ్రహ్మనందతీర్థస్వామివారి సంకల్పంతో ఏర్పాటుచేసిన బ్రహ్మస్వభవనం ట్రస్టులో సదాచారసంపన్నులు, కాశీలో నిష్ఠగా దీక్షతో వాసంచేసేవారికి శుచిగా అన్నప్రసాదం, వసతి అందించటం, ధార్మిక సేవాకార్యక్రమాలు నిర్వహించుకోటానికి తగిన వ్యవస్థను అందించే సమున్నత లక్ష్యంతో బ్రహ్మస్వభవనం ట్రస్టు ఏర్పాటయింది. ఈ లక్ష్యంతో గత రెండున్నర సంవత్సరాలుగా తాత్కాలిక భవనంలో లక్ష మందికి మడితో భోజనం,వసతి అందించి ఎన్నో ధార్మిక కార్యక్రమాలు, సత్సంగాలను నిర్వహించింది. ప్రస్తుతం ఐదుకోట్ల రూపాయల వ్యయంతో ఐదు అంతస్తుల ధార్మిక భవనాన్ని నిర్మాణం చేస్తోంది. శృంగేరీ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీస్వామివారు తమ కరకమలములచే ఈ భవననిర్మాణానికి శిలాన్యాసం చేసి అనుగ్రహించారు. ఈ మహత్తర కార్యాచరణలో ఆస్తికమహాజనులందరూ భాగస్వాములై బ్రహ్మస్వ భవనం నిర్మాణానికి తమ శక్తిమేర విరాళాలు అదించి అన్నపూర్ణా,విశాలాక్షీ సమేత కాశీ విశ్వనాథుని అనుగ్రహానికి పాత్రులు కాగలరని కోరుతున్నాము.

BRAHMASWA BHAVANAM TRUST VARANASI

SBI

Merchant Name : BRAHMASWA BHAVANAM TRUST

UPI ID : brahmaswabhavanam@sbi

BHIM UPI

G20

BRAHMASWA BHAVANAM TRUST
SBI A/C NO 43207617077
IFSC CODE SBIN0021461
SWIFT CODE SBININBB
SARASWATHI NAGAR BRANCH SAIDABAD, HYDERABAD

వివరాలకు 9441015469, 9866351972, 9440507716,9440734105 నెంబర్లకు సంప్రదించగలరు

## బ్రహ్మస్వభవనం నిర్మాణంలో భాగస్వాములయ్యే వదాన్యులకు సూచనలు... విన్నపం

లక్ష రూపాయలు విరాళం ఇచ్చే వదాన్యులకు, వారి కుటుంబసభ్యులకు ప్రతిసంవత్సరం మూడు రోజుల ఉచిత వసతి

ఐదు లక్షల రూపాయల విరాళం ఇచ్చే వదాన్యులకు, వారి కుటుంబసభ్యులకు ప్రతిసంవత్సరం 15 రోజుల ఉచిత వసతి

పది లక్షల రూపాయలు విరాళం ఇచ్చే వదాన్యులకు, వారి కుటుంబసభ్యులకు ప్రతిసంవత్సరం 30 రోజుల ఉచిత వసతి

ఇరవై ఐదు లక్షల రూపాయలు విరాళం ఇచ్చే వదాన్యులకు,వారి కుటుంబసభ్యులకు ప్రతిసంవత్సరం 60 రోజుల ఉచిత వసతి

కోటి రూపాయలు విరాళం ఇచ్చే వదాన్యులకు,వారి కుటుంబసభ్యులకు శాశ్వత వసతిగా ఒక గది కేటాయింపు (ఒక అంతస్తుకు వారిపేర శిలాఫలకం)

RNI Regd No. APTEL/2005/16209
Date of Publication : 25th of Every Month
Date of Posting : 28th & 29th of Every Month

DARSHANAM
MAY - 2026

Postal Regd.No. HQ/SD/508/2025-2027
WPP NO:PMG/TS/HQR/SC-01/WPP/2025-2027
Licensed to Post Without Prepayment
Posting at B.P.C - IV Patrika Channel,Nampally,Hyderabad-01



PM Hoist Double Cage, Hyderabad



PM Hoist with 12mts Horizontal rebar carrier, Vijayawada


Curved Hoist Bangladesh

**CMAC**

*Mechanisation & Automation in Construction*

ISO 9001:2015 CERTIFIED COMPANY
AND
CE CERTIFIED COMPANY

## Equipments & Solutions for Infrastructure fraternity. Residential, Commercial Infrastructure, Power, Steel, Cement & Industrial Infra

Innovation with safety & Sustainability
Export them as Made in India



Multi Functional Hoist, Nagpur


MFH - CMAC Rambo with Rebar Carrier, Delhi



Chimney SRP, Mumbai


Pre Cast Panel Movement SRP, Hyd.


Anji Khad Cable Stayed Bridge Project, Dist.: Reasi, Jammu



PMH at Pump House, Kaleshwaram


Bridge Special SRP at Durgam Cheruvu, Cable Stayed Bridge, Hyd.

**ConMechAuto Consultants India Pvt Ltd.,**
**Head Office** : # 1-3-183/40/19, 2nd Floor, SBI Colony, Gandhi Nagar, Hyderabad - 500 080, India.
Tel. No.: + 91- 40 - 2754 1464

**Factories :**
Phase 2, Phase 5, IDA Cherlapally, Hyderabad - 500 051

For Further Details:
**CONTACT : 9393 111 464**
**Email : sales@cmac.co.in**
**www.cmac.co.in**

*If Undedelivered please return to:*
**DARSHANAM Devotional Magazine,Srirama Siddhanthi Bhavanam, H.No.29-105/4/1 Rythu Bazar Road, New Vidyanagar Colony, Neredmet, Secunderabad, 500056**
**Mobile 7013093123, 9441015469** *e mail: darshanameditordesk@gmail.com*